www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 222 | గురువారం | 1 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



కొత్త సబ్‌మెరైన్ కరంజన్ జల ప్రవేశం

10

తరలివచ్చిన సారలమ్మ

కన్నెపల్లి నుంచి కన్నుల పండువగా వనదేవత రాక

- దారి పొడవునా సాగిలబడి మొక్కులు
- తొలిరోజు సారలమ్మతో పాటు గద్దెలపైకి వచ్చిన పగిడిద్దరాజు, గోవిందరాజులు
- నేడు గద్దెపైకి సమ్మక్క రాక



మన తెలంగాణ/ మేడారం : కన్నెపల్లి వెన్నల సారలమ్మ గద్దెలపై కొలువు దీరింది. బుధవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలను ఆదివాసీ సంప్రదాయాలతో నిర్వహించారు. సారలమ్మ పూజారి కాక సారయ్య, కాక లక్ష్మీబాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆడ బిడ్డను పుట్టింటికి పంపించడానికి ఊరు ఊరంతా శుద్ధి చేశారు. ఇళ్ల తరువాయి 6లో



వ్యవసాయము, కొలువులు ఖాయమేనా?

నేటి జైట్లీ పద్దులో ఎన్నెన్ని పొద్దులు?

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో నిరాశను తొలగించి, మరింతగా ఉద్యోగాలను సృష్టించి, ఆర్థిక వృద్ధిని ఊర్ధ్వ ముఖం పట్టించడం ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ నేడు సమర్పించబోయే 2018–19 బడ్జెట్ ప్రధాన లక్ష్యాలు. ఇది ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఐదవ బడ్జెట్. బహుశ ఇంత వరకు ప్రకటించిన అన్ని బడ్జెట్‌ల కంటే సంక్లిష్టమైనది. దీనికి కారణం 2019 సార్వత్రిక ఎన్నికల సంవత్సరం కావడమే. అంతేకాకుండా 2018లో ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో మూడు ప్రధాన రాష్ట్రాలు బిజెపి పాలనలో ఉన్నాయి. గ్రామీణ ఉపాధికి ఊతం ఇవ్వడానికి కొత్త బడ్జెట్‌లో మహాత్మాగాంధీ రోజ్‌గారి యోజన పథకానికి కొత్త గ్రామీణ పథకాలను చేర్చే అవకాశం ఉంది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన ఎన్నికలలో బిజెపి ఓట్ల వాటా తరిగిపోయిన వాస్తవం బయటపడడంతో వ్యవసాయ రంగానికి కూడా జైట్లీ ప్రోత్సాహకాలను ప్రకటించే అవకాశం ఉంది. బిజెపికి ఓటర్లలో ప్రధాన మద్దతుదార్లుగా ఉన్న చిన్న వ్యాపారులకు కూడా రాయితీలను ప్రకటించవచ్చు. జిఎస్‌టి కలిగించిన నొప్పిని మరిచిపోయేలా వారికి ఈ రాయితీలు ప్రకటిస్తారని నిపుణులు ఊహిస్తున్నారు. ఆదాయ పన్ను విధింపు పరిమితిని పెంచడం ద్వారా మధ్య ఆదాయ వర్గాలకు ఊరట ప్రకటించే అవకాశం కూడా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 3.2 శాతానికి ద్రవ్యలోటును తగ్గించే లక్ష్యం జైట్లీ చేరుకోవాలి. 2018–19లో కూడా ఈ లక్ష్యం 3 శాతం. ఇందుకు గట్టి సంకల్పాన్ని తాజా బడ్జెట్‌లో ఆయన ప్రకటించే అవకాశం ఉంది. ఓటర్లను భారీ హామీలతో ఆకట్టుకునే ప్రయత్నాలు ఏమీ ఉండవని అనుకోవచ్చు. జనాకర్షక చర్యలను ప్రకటించబోమని ప్రధాని మోడీ ఇటీవల సంకేతం అందించారు. ప్రజలు ఉచితాలను ఆశించరని చెప్పడం ద్వారా కూడా ఉచిత కానుకలు ఏవీ బడ్జెట్‌లో ఉండకపోవచ్చునని కూడా సూచన అందించారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత దేశపు తొలి బడ్జెట్ ఇది. ఆసియాలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ వృద్ధిని ముందుకు తీసుకుపోవడానికి జైట్లీ ఏమి చేస్తారన్నది నిశితంగా అనేక దేశాల ఆర్థిక వేత్తలు పరిశీలిస్తున్నారు. భారీ యంత్ర పరికరాల, ఆస్తుల తరువాయి 6లో

కొత్త సిఎస్ ఎస్‌కె జోషి

బాధ్యతల స్వీకరణ



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె జోషి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ సిఎస్‌గా ఉన్న ఎస్‌పి సింగ్ పదవీ విరమణ చేయడంతో ముఖ్యమంత్రి కెసిఆర్ నూతన సిఎస్‌గా ఎస్‌కె జోషిని నియమించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం సాయంత్రం ఎస్‌పి సింగ్ నుంచి నూతన సిఎస్ జోషి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌కె జోషి మీడియాతో మాట్లాడుతూ అధికారుల, సిబ్బంది సమష్టి కృషితో కొత్త రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని వ్యాఖ్యానించారు. ఇంతకాలం సాగునీటిపారుదలశాఖ బాధ్యతలు చూసిన తాను ఇప్పుడు మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన తరువాయి 6లో

24 నుంచి టిఆర్‌టి

- మార్చి 4 వరకు సాగే 16 సెషన్ల పరీక్షల్లో 13 ఆన్‌లైన్
- షెడ్యూల్ విడుదల చేసిన టిఎస్‌పిఎస్‌సి



మన తెలంగాణ/ హైదరాబాద్: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టిఆర్‌టి) పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 24 నుంచి మార్చి 4 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి వెల్లడించింది. మొత్తం 16 సెషన్లలో నిర్వహించే ఈ పరీక్షల్లో 13 సెషన్లను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తుండగా తరువాయి 6లో

చందురుని మించి అందమొలికించి

- ప్రపంచ వ్యాప్తంగా ఆకాశంలో సూపర్, బ్లూ, బ్లడ్ మూన్ అరుదైన అద్భుత దృశ్యం
- సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా భూమిని కప్పిన నీడలో ముదురు ఎరుపురంగు పులుముకున్న జాబిల్లి

10



వలసలకు ప్రాతిపదిక

ప్రతిభే : ట్రంప్

- కుటుంబ ఆధారిత విధానాన్ని పరిమితం చేయాలి
- వీసా లాటరీ రద్దు : కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో అమెరికా అధ్యక్షుడి ప్రసంగం



వాషింగ్టన్: గొలుసుకట్టు వలసల (చెయిన్ మైగ్రేషన్) విధానానికి స్వస్తి పలికి, ప్రతిభ ఆధారిత వలసల విధానాన్ని ప్రోత్సాహించాల్సి ఉందని, తద్వారా భారత్ వంటి దేశాల నుంచి వచ్చే ఐటి ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా కాంగ్రెస్ ఉభయసభలనుద్దేశించి ఆయన చేసిన తొలి ప్రసంగంలో ఈ విషయాన్ని చెప్పారు. వలస సంస్కరణలపై ద్వైపాక్షిక చట్టం(బైపార్టిసన్ లెజిస్లేషన్) చేయడంలో తన యోగ్యతను నొక్కేసిన పోలరైజింగ్ ఇమేజ్‌ను వదిలించుకునే ప్రయత్నాన్ని ఆయన చేశారు. ట్రంప్ వలస సంస్కరణలకు తరువాయి 6లో

కుండబోతు



మూడేళ్ల నుంచి శుభ'వార్తే' వస్తుంది, ఉద్యోగం ఎప్పుడొస్తదో..?!

రూ. 10 కోట్ల మేరకు

ఖాతాలకు వాత

- వందకుపైగా అకౌంట్లకు గ్రామీణ బ్యాంకు టోకరా
- మొయినాబాద్ అజీజ్ నగర్‌లో ఖాతాదారుల ఆందోళన, ఇంటి దొంగలే కారణం?



మన తెలంగాణ/ మొయినాబాద్ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దాదాపు వంద మంది ఖాతాదారుల ఖాతాల నుంచి దాదాపు పది కోట్లకు పైగా నిధులు మాయమవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం మూలంగానే నిధులు మాయమవుతున్నా పట్టించుకోకపోవడంపై ఖాతాదారులు మండిపడుతున్నారు. మంగళవారం నాడు సాయంత్రం బ్యాంకు బాగోతం బయటకు రావడంతో బుధవారం ఉదయం బ్యాంకు తెరవక ముందే తరువాయి 6లో

హోంగార్డుల భత్యాల పెంపు జిఓ జారీ

- రూ.400 నుంచి 675కు దినభత్యం



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో పనిచేస్తున్న వేలాది మంది హోంగార్డుల భత్యాలను పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దినసరి భత్యం రూ.400 నుంచి రూ. 675కు తరువాయి 6లో

నెల రోజుల్లో జీవిత ఖైదీలకు క్షమాభిక్ష



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎన్నో ఏళ్లుగా క్షమాభిక్ష కోసం ఎదురుచూస్తున్న జీవిత ఖైదీలకు త్వరలోనే తీపికబురు రానుందని జైళ్ళశాఖ డైరెక్టర్ జనరల్ తరువాయి 6లో

కుంటియాతో ఏకాంత భేటీలో

మనసు విప్పిన నేతలు

- ఉత్తమ్ సారథ్యంపై అభ్యంతరం చెప్పని మెజారిటీ
- ముందే అభ్యర్థులను ప్రకటించాలి
- నేరుగా ఢిల్లీలో చేరికలొద్దని డిమాండ్



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులను ఏకతాటిపై తీసుకువచ్చే చర్యలు మొదలయ్యాయి. ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ డాక్టర్ ఆర్.సి.కుంటియా రంగంలో దిగారు. హైదరాబాద్‌కు వచ్చిన కుంటియా బుధవారం గాంధీభవన్‌లో మధ్యాహ్నం నుండి ఏకధాటిగా 8 గంటలకు పైగా సీనియర్ నాయకులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఒక్కో నాయకునితో అరగంట నుండి గంట వరకు ఏకాంతంగా భేటీ అయ్యారు. కుంటియాతో సమావేశమైన వారిలో ప్రతిపక్ష నాయకులు కె.జానారెడ్డి, మహ్మద్ అలీ షబ్బీర్, మాజీమంత్రులు సర్వే తరువాయి 6లో

పోలీసు కొలువుల్లో మహిళలకు 33% రిజర్వేషన్


మన తెలంగాణ/హైదరాబాద్ : పోలీసు ఉద్యోగాల నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం కల్పించిందని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర పోలీసు అకాడమీలో 735 మంది మహిళా కానిస్టేబుళ్ల తొమ్మిది నెలల శిక్షణ ముగింపును పురస్కరించుకుని జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్‌కు నాయిని నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా కానిస్టేబుళ్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, దేశంలోనే అత్యున్నతమైన పోలీసు అకాడమీలలో ఒకటైన తెలంగాణ పోలీసు అకాడమీలో పాసింగ్ ఔట్ పరేడ్‌కు తాను హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళా కానిస్టేబుళ్ళు రైతు బిడ్డలు, శ్రామికులు, చేతి వృత్తుల కుటుంబాల నుంచి వచ్చిన వారున్నారన్నారు. ప్రభుత్వం పోలీసు శాఖ ఆధునీకరణకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే కొన్ని చట్టాలలో మార్పులు వచ్చాయని, మహిళల భద్రత విషయంలో కొత్తగా వచ్చిన ఆర్డినెన్స్‌లో నేరస్తులకు కఠినమైన శిక్షలు పొందుపరచబడ్డాయన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లల భద్రతపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అనేక ప్రశంశలు వస్తున్నాయని, ఇతర రాష్ట్రాల వారు కూడా ఇక్కడి విధానాన్ని అమలు పరుస్తున్నారన్నారు.



పొంతన లేని 'మద్దతు'!

- సాగు వ్యయం ఆధారంగా ధర పెంచాలి
- కేంద్ర వ్యయ, ధరల కమిషన్‌కు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రతిపాదనలు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రైతుల సాగుకైన ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు లేవని, వ్యయానికి తగ్గట్టు వాటిని పెంచాలని భారత వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సిఎసిపి)ను రాష్ట్ర వ్యవసాయ శాఖ కోరింది. జూన్ నుంచి ప్రారంభమయ్యే వానాకాలం (ఖరీఫ్) పంటలకు రైతులు పెట్టే ఖర్చుల వివరాలు నివేదిస్తూ వాటికి ఇవ్వాల్సిన మద్దతు ధరలను కమిషన్‌కు ప్రతిపాదించింది. పంటలవారీగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటకోత, రవాణా, కూలీ, రైతు కుటుంబ శ్రమకు ఫ్రతిఫలం తదితరాలన్నీ మదింపు చేసి రూపొందించిన నివేదికను వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం. జగన్‌మోహన్ ఆంధ్రప్రదేశ్‌లో గురువారం జరిగిన సిఎసిపి సమావేశంలో సమర్పించారు. వరికి సాధారణ, ఏ గ్రేడ్ కింద రెండు రకాలు విభజించి మద్దతు ధర ఇస్తారు. సాధారణ వరి పంటకు ఒక క్వింటాల్‌కు రైతుకు అయ్యే ఖర్చు రూ. 3286.50గా, 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 3348గా నిర్ధారించినట్లు తెలిసింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సాగు ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఇవ్వాలని సిఎసిపికి ప్రతిపాదించింది. ఆ ప్రకారం 2018–19 వానాకాలంలో సాధారణ రకం వరికి క్వింటాకు రూ. 4930 ఇవ్వాలని కోరింది. మొక్కజొన్న, పత్తి, కంది, పెసర, సోయా, వేరుశనగ, జొన్న పంటలకు కూడా ఖర్చు, ఎంఎస్‌పిని పేర్కొంటూ సమగ్ర నివేదికను తయారు చేసింది. సాగు సహా ఇతర ఖర్చులు పరిగణనలోకి తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతోందని అధికారులు అం టున్నారు. అన్ని పంటల సాగు, ఇతరత్రా ఖర్చులను శాస్త్రీయంగా లెక్కవేసినట్లు వారు చెబుతున్నారు. ఉదాహరణకు సాధారణ వరి రకం నారుమడి సిద్ధం చేయడం, ఎరువులు, విత్తనా లు, పంట కోత వరకు ఎకరానికి రూ. 32,103 ఖర్చవుతోందని, గత ఏడాదితో పోలిస్తే రూ. 4 వేలు పెరిగిందని పేర్కొన్నారు. అదే 'ఏ' గ్రేడ్ వరికి రూ.32, 884 అవుతోందని పేర్కొంది. అలాగే పత్తి (లాంగ్ స్టాపిల్ రకం) క్వింటాల్‌కు రూ. 9217, మీడియం స్టాపిల్‌కు రూ. 8066 వ్య యం అవుతోందని నివేదించింది. క్వింటా కంది పండించేందుకు రూ. 7601.50 అవుతోంది. ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న మద్దతు ధర మాత్రం రూ. 5450గా ఉంది. తన భూమినే రైతు ఒక వేళ కౌలుకు తీసుకున్నట్లుగా లెక్క వేసుకున్నట్లయితే అందుకు చేసే ఖర్చు, పెట్టుబడుల మీద వడ్డీ, ఇంటి మనుషులంతా చేసే శ్రమ ఖర్చు, యాజమాన్యం కింద అయ్యే ఖర్చుతో కలిపితే ఇంకా పెరుగుతుందని పేర్కొంది.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన(క్వింటాకు రూపాయాల్లో)

పంట	సాగు వ్యయం	ఇవ్వాల్సిన మద్దతు ధర	ప్రస్తుత మద్దతు ధర
వరి సాధారణం	3287	4930	1550
వరి గ్రేడ్ ఎ	3348	5022	1590
జొన్నలు	3560	5340	1700
పత్తి	9217	13825	4320
కంది	7601	11402	5450
పెసర	6259	9388	5575
మొక్కజొన్న	2019	3028	1425
వేరుశనగ	5096	7645	5096
సోయా చిక్కుడు	4545	6818	3050

ఎస్ఎస్ఎ, ఆర్ఎంఎస్ఎ పథకాలు విలీనం?

మనతెలంగాణ/హైదరాబాద్ : పాఠశాల విద్యాశాఖలో అమలవుతున్న సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) పథకాల విలీనానికి కేంద్రం చర్యలు చేపట్టింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ పథకాలు విలీనం కానున్నట్లు తెలిసింది. ఈ రెండు పథకాలకు వేర్వేరుగా నిధులు కేటాయిస్తున్నా క్షేత్రస్థాయిలో చేసే పనులు, కార్యక్రమాలు ఒకేలా ఉంటుండడంతో ఒక పథకం నిధులు వేరొక పథకానికి వినియోగించుకోడానికి అవకాశం లేదు. వీటిని విలీనం చేసి రాష్ట్రాలకు బడ్జెట్‌ను కేటాయించడం ద్వారా రాష్ట్రాలు వాటివాటి అవసరాలనుబట్టి నిధులు వినియోగించుకునే వెసులుబాటు కల్పించే అంశం కేంద్రం పరిశీలనలో ఉంది. ఇందుకోసం రాష్ట్రాల అభిప్రాయాలు, సూచనలను సేకరిస్తోంది. పాఠశాల విద్యార్థులకు యూనిఫాంకు ప్రస్తుతం రెండు జతలకు రూ. 400 కేటాయిస్తుండగా, దానిని రూ.600 పెంచాలని కేంద్ర నిర్ణయించింది. ఇప్పటివరకు 1 నుంచి 8వ తరగతి వరకు ఇస్తున్న యూనిఫాంను 12వ తరగతి వరకు కేటాయించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కేంద్రాన్ని కోరింది. అలాగే విద్యార్థులకు బూట్లు ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు ప్రతిపాదించాయి. పాఠశాల నిర్వహణలో వాచ్‌మెన్ నియమించుకునేందుకు, చాక్‌పీస్‌లు, స్టేషనరీ ఖర్చుల నిమిత్తం ఇచ్చే స్కూల్ గ్రాంట్‌కు గ్రాంట్‌ను రూ.25 వేలకు పెంచాలని కోరారు. ఖర్చులు పెరిగిన నేపథ్యంలో స్కూల్ గ్రాంట్ పెంపు అంశాన్ని సీరియస్‌గా పరిశీలించాలని రాష్ట్రాలు కోరాయి.

సామ్రాట్‌కు బెయిల్ మంజూరు

మనతెలంగాణ/హైదరా బాద్: సినీ నటుడు సామ్రాట్ రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. భార్య మోపిన దొంగతనం కేసులో అరెస్టు అయిన సామ్రాట్‌కు బుధవారం మియాపూర్‌లోని 25వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఇద్దరు వ్యక్తులురూ.25 వేల చొప్పున పూచికత్తు ఇవ్వాలని, ప్రతి శనివా రం మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని షరతు విధించారు. బెయిల్ కాపీలు చర్లపల్లి జైలు అధికారులకు ఆలస్యంగా చేరడంతో గురువారం విడుదలయ్యే అవకాశం ఉంది.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం!

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలో జర్నలిస్టుల హత్యలు, దాడులు పెరిగిన నేపథ్యంలో పాత్రికేయుల రక్షణకు ఒక ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనేశ్వర్‌లో ఒరిస్సా జర్నలిస్టుల రాష్ట్ర మహాసభలను అమర్ బుధవారం ప్రారంభించారు. ఒరిస్సా యూనియన్ అధ్యక్షులు ప్రభాత్ దాస్, శ్రీశ్రీ యూనివర్సిటీ డైరెక్టర్ నరేంద్ర లాంబా ప్రసంగించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ దేశంలో జర్నలిస్టులకు నిత్యం రక్షణ కరువవు తున్నదని, 2017లో దాడులు పెరిగి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్‌లపై, మీడియా సంస్థలపై జరుగుతున్న దాడులపై భారత ప్రెస్ కౌన్సిల్ స్పందనను అభినందించారు. అయితే ప్రెస్ కౌన్సిల్ మాత్రమే స్పందిస్తే, చర్యలు తీసుకుంటే సరిపోదనీ, ఇందుకు ప్రత్యేక చట్టం అవసరమని ఆయన అన్నారు.



2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు

- మార్కెటింగ్ సదుపాయాలపై 4 రాష్ట్రాల్లో అధ్యయనం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పెట్టుబడి పథకం, సాగునీటి వసతి, మార్కెటింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు అవుతుందని మార్కెటింగ్ మంత్రి హరీష్ రావు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రైతులకు మరిన్ని ప్రయోజనాలు లభించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యప్రదేశ్,మహారాష్ట్ర, హర్యానా,కర్నాటకలలో అమలవుతున్న వ్యవసాయ మార్కెటింగ్ కార్యకలాపాలపై అధ్యయనం చేసి వచ్చిన మార్కెటింగ్ ఉన్నతాధికారుల బృందం మంగళవారం రాత్రి మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది. అక్కడి రైతులు వేసే పంటలు, దిగుబడులు, నిల్వ సదుపాయాలూ, మార్కెట్ యార్డుల పరిస్థితి, మద్దతు ధర, రైతులకు చెల్లింపులు, మార్కెట్ స్థిరీకరణ నిధి వంటి అంశాలను వివరించింది. మహారాష్ట్ర మార్కెటింగ్ సంస్థ కందులు కొనుగోలు చేసి, పప్పుగా మార్చి మధ్యాహ్న భోజన పథకానికి, హాస్టళ్లకు సరఫరా చేస్తోందని, మధ్యప్రదేశ్ లో 'భావంతర్ భుగ్తాన్' పేరిట అమలు చేస్తోందని బృందం సభ్యులు వివరించారు. కనీస మద్దతు ధర కన్నా మార్కెట్లో రైతులకు తక్కువ ధర పలికిన సందర్భాల్లో మిగతా డబ్బును నష్టపరిహారం కింద ఆ రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తోందని తెలిపారు. ఎంఎస్‌పితో పాటు తమ రాష్ట్ర రైతుల కోసం సరాసరి ధరను మధ్యప్రదేశ్ అమలు చేస్తున్నదని చెప్పారు. ధరల స్థిరీకరణ కింద రూ. 4000 కోట్లను మధ్యప్రదేశ్ సమకూర్చిందని వివరించారు. హర్యానాలో ఉల్లి, టమాటా,క్యాలిఫ్లవర్ వంటి కూరగాయలను పండించే ముందే ఆయా పంటలు, వాటి దిగుబడి అంచనాతో ప్రాథమిక ధరను ప్రభుత్వం ఖరారు చేస్తోందని తెలిపారు. తాజా కూరగాయలతో నడుపుతున్న 'మన కూరగాయలు' అవుట్‌లెట్‌ల సంఖ్య 100 కు పెంచాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి తదితరులు ఉన్నారు.

యాసంగి సాగు@ 26.16 లక్షల ఎకరాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : యాసంగి సాగు 26.16 లక్షల ఎకరాల్లో (లక్ష్యంలో88%) నమోదైనట్లు వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఇందులో 13.41 లక్షల ఎకరాల్లో వరినాట్లు ఉండగా, పప్పుధాన్యాల సాగు 2.96 లక్షల ఎకరాలుగా ఉందని, మొత్తం ఆహార ధాన్యాల సాగు 20.13 లక్షల ఎకరాలుగా నమోదైందని ఆ ప్రకటనలో పేర్కొంది. క్షేత్రస్థాయిలో సాగుభూముల విస్తీర్ణాన్ని పక్కాగా లెక్క చేయాలని, ఇందుకోసం ఏరియా విస్తరణాధికారులను పురమాయించాలని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇటీవల నిర్వహించిన జిల్లా వ్యవసాయాధికారుల సమావేశంలో స్పష్టం చేశారు.ఒక్కసారిగా సాగు అధికంగా నమోదైనట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో తేలింది.

చేతులెత్తి ఎన్నుకునే పద్ధతికి స్వస్తి

- 'సహకార' ఎన్నికల విధానంలో మార్పులు, చేర్పులు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో సహకార సంఘాలకు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండేలా ఓటర్ల జాబితాను తయారు చేయాలని ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు రిజిస్ట్రార్ ఆదేశాలు జారీచేశారు. కొత్తగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోడానికి రైతులకు ఫిబ్రవరి 15 వరకు గడువు ఇచ్చారు. పారదర్శకంగా ఉండేలా ఓటర్ల జాబితాలో రైతుల ఫోటోలు కూడా ఉండేలా నిబంధనలు రూపొందించారు. కార్యవర్గాన్ని ఎన్నుకోడానికి ప్రస్తుతం అమలవుతున్న 'చేతులెత్తి ఎన్నుకునే' పద్ధతికి (సభ్యుల సంఖ్య 50కి పైగా ఉంటే) స్వస్తి పలికింది. రిజర్వ్‌డ్ స్థానాల్లో ఏర్పడిన ఖాళీలను నామినేషన్‌కు బదులుగా ఇక నుంచి రాష్ట్ర సహకారం ఎన్నికల సంఘమే భర్తీ చేస్తుంది. పదవీకాలం రెండున్నరేళ్ల లోపు ఉండి రాజీనామా చేయడం, మరణించడం, అనర్హత వేటు పడడం వంటి కారణాలతో ఖాళీలు ఏర్పడితే మాత్రం ఆయా సొసైటీలు నామినేషన్ విధానంలో ఆ స్థానాలను భర్తీ చేసుకోవచ్చు. ప్రస్తుత కమిటీ ఎన్నికల్లో ఓడిపోయిన వారిని మాత్రం నియమించకూడదని నిబంధనలో రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం పొందని సొసైటీల ఎన్నికలను సైతం ఇకపై రాష్ట్ర సహకారం సంఘమే నిర్వహించనుంది. కార్యవర్గంలో సభ్యుల సంఖ్య గరిష్టంగా 21మంది ఉండాలి. సహకార సంఘాల కార్యవర్గం పదవీకాలం ముగియడానికి 60 రోజుల ముందే ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపాలి. రిజిస్ట్రార్ సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడానికి ముందుగానే ఓటర్ల జాబితాను జిల్లాల అధికారులు సిద్ధం చేయాలి. ఎన్నిలకు అయ్యే ఖర్చును ఎన్నికల సంఘం వద్ద ఆయా సొసైటీలు జమ చేయాలి.



సహకార సంఘాలకు ఇంచార్జిలు

మన తెలంగాణ/హైదరాబాద్ : పదవీకాలం ముగిసిన,ముగుస్తున్న ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గ కమిటీ సభ్యులను 6 నెలల పాటు పర్సన్ ఇంఛార్జీలుగా నియమించాలని నిర్ణయించినట్లు వ్యవసాయ, సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అలాగే త్వరలోనే పదవీకాలం ముగియనున్న జిల్లా కేంద్రం సహకార బ్యాంకులు, జిల్లా కేంద్రం మార్కెటింగ్ సంఘాలు, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టిఎస్‌క్యాబ్) పాలకవర్గ కమిటీ సభ్యు లను కూడా ఆరు నెలల పాటు పర్సన్ ఇంచార్జీలుగా నియమించనున్నట్లు చెప్పారు. సచివాలయంలో గురువారం సహకార సంఘాల ఎన్నికలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జూపల్లికృష్ణారావు, ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలు పరిశీలించిన మంత్రుల బృందం పర్సన్ ఇంఛార్జీల నియామకం చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మొత్తం ప్యాక్స్‌లలో 456 సంఘాల పదవీకాలం ఈ మంగళవారంతో ముగియగా, 427 సంఘాల పదవీకాలం ఫిబ్రవరి 3 తో ముగియనుంది. మిగతా సహకార సంస్థల పదవీకాలాలు కూడా ముగియనున్నాయి.



భక్తులు సంయమనం పాటించాలి : కడియం

మన తెలంగాణ/మేడారం: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు సంయమనం పాటించాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం ఐటిడిఎ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాజాతరకు వివిధ ప్రాంతాల నుంచి గంటకు వెయ్యి వాహనాలు వస్తున్నాయని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతరకు వస్తున్న సమయంలో ములుగు గట్టమ్మ వద్ద వాహనాల రవాణను స్వయంగా పరిశీలించినట్లు వివరించారు. ప్రశాంత వాతావరణంలో తల్లులను దర్శించుకొని మొక్కులు సమర్పించుకోవాలన్నారు. జాతరను పురస్కరించుకొని నేడు (గురువారం) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. 2వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా సెలవును ప్రకటించామన్నారు. ఈనెల 2న సిఎం కెసిఆర్, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి జ్యూయల్ ఓరమ్, గవర్నర్ నరసింహన్‌లు వస్తున్నట్లు తెలిపారు. భక్తులు ప్లాస్టిక్‌ను నియంత్రించి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు.

బుధవారం జంపన్న వాగులో కిక్కిరిసిన భక్తులు



• జంపన్న వాగుల్ల అబ్బియా.. జనజాతర సాగుతోంది అబ్బియా...

దాదాపు కోటి మందికి పైగా భక్తులు..! రాష్ట్ర వ్యాప్తంగా 2490 ప్రత్యేక బస్సులు..! ఏ జాతరకు లేని విధంగా 10వేల మంది పోలీస్ బందోబస్తు..! మేడారం జనసంద్రమైంది! అడుగేసి తీసి అడుగు వేయలేని పరిస్థితి..! దారి పొడవునా నిలిచిన వాహనాలు.. శివసత్తుల పూనకాలు.. ఎక్కడ చూసినా ఆధ్యాత్మికతే..! ఎవరిని చూసినా తల్లులను తనివితీరా దర్శించుకోవాలనే ఆతృతే..! మేడారం మహా ఘట్టానికి బుధవారం తెరలేచింది. భక్తుల జయజయ ధ్వానాలతో కీకారణ్యం దద్దరిలింది! కన్నెపల్లి నుంచి సారలమ్మ తల్లి వద్దకు బయల్దేరింది. మధ్యలో సంపెగ వాగు వద్ద తమ్ముడు జంపన్నను తలుచుకుంటూ నీటిని తాకడంతో భక్తజనం తన్మయత్వంలో మునిగి ప్రణమిల్లింది! అక్కడి నుంచి గద్దెపై కొలువుదీరింది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామం నుంచి మంగళవారం రాత్రే పగిడిద్దరాజు అటవీ మార్గాన పడిగే రూపంలో బయల్దేరగా, సమ్మక్కతో వివాహానంతరం కొండాయి నుంచి వచ్చిన గోవిందరాజుతో కలిసి గద్దెలపైకి చేరడంతో మేడారం మురిసింది! నేడు తల్లి సమ్మక్క రాకతో మహా జాతర ప్రధాన ఘట్టం మరికొద్ది గంటల్లోనే ఆవిష్కృతం కానుంది. ఇందుకోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

- మన తెలంగాణ/మేడారం

ప్రణమిల్లిన వనం

మేడారం
జన గుడారం







భారీ బందోబస్తు



మేడారం సమ్మక్క, సారక్కలను సిఎం కెసిఆర్‌తో పాటు కేంద్ర మంత్రి జ్యూయల్ ఓరమ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, ఉప రాష్ట్రపతి, గవర్నర్ గురువారం రానున్నారు. ఈ సందర్భంగా జాతరలో ఏర్పాట్లతో పాటుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్‌వి కర్ణన్, ఎస్‌పి భాస్కరన్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జాతరకు భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనికి భక్తులు సంయమనం పాటించి సహకరించాలని కోరారు. గత జాతరకన్నా ప్రస్తుతం జరుగుతున్న జాతరకు కోటి యాభై లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 10వేల మందికి పైగా పోలీస్ బందోబస్తు, పారిశుధ్య నిల్వలు ఉండకుండా సుమారు 3వేల మంది సిబ్బందితో పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సారలమ్మ, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవింద రాజులు గద్దెలపై చేరుకున్నారు. గురువారం సమ్మక్క రాకను పురస్కరించుకొని భక్తులను నియంత్రించేందుకు రోప్ పార్టీని ఏర్పాటు చేశామన్నారు.

తప్పని తాగునీటి తిప్పలు



సమ్మక్క సారలమ్మ జాతరలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు కరెంటు కష్టాలను అనుభవిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నల్లాలు పనిచేయక భక్తులు తా గునీటి కోసం అల్లాడుతున్నారు. అలాగే భక్తుల సౌక ర్యార్థం బిఎస్‌ఎన్‌ఎల్ వైఫై సేవలను నిర్విరామంగా అందిస్తున్నామని ప్రకటనలిచ్చినా మేడారం పరిసర ప్రాంతాల్లో సేవలందించడంలో విఫలమైంది. దీంతో ఫోన్లు కూడా పనిచేయడం లేదు. కేవలం వివిధ కంపెనీలు తమ సేవలను అందిస్తున్నామంటూ స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రసార మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారే తప్ప వినియోగదారులకు చెప్పిన తీరుగా నెట్‌వర్క్‌లు అందించడంలో విఫలమయ్యాని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





సారలమ్మ
పగిడిద్దరాజు
ఆగమనం

నిండు గర్భిణి విషాదాంతం..

• జాతరకు వస్తూ
మరి ఇద్దరి మృతి

మన తెలంగాణ/ములుగు/అశ్వాపురం: మేడారం సమ్మక్క, సారక్కలను దర్శించుకునేందుకు వస్తుండగా వేర్వేరు చోట్ల ప్రమాదవశాత్తు ముగ్గురు భక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం ఉదయం భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ములుగు గట్టమ్మ నుంచి పస్రా వరకు దాదాపు 4 నుంచి 5 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో నిర్మల్ జిల్లా సాప్జమ్ గ్రామానికి చెందిన గర్భిణి మృతి చెందగా, ఆమె కడుపులో పాప క్షేమంగా ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ తస్లిమా మహ్మద్ అన్నారు. వారి కుటుంబానికి సబ్ రిజిస్ట్రార్ ఆర్థిక సహాయం చేసి, ప్రైవేట్ వాహనంలో వారిని స్వగ్రామానికి పంపించారు. అలాగే ఖమ్మం జిల్లా అశ్వాపురం మండలం చవిటి గూడెం గ్రామానికి చెందిన పొలిశెట్టి నవీన్(24) తమ కుటుంబ సభ్యులతో కలిసి మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు ఆటోలో వెళ్తుండగా వరంగల్ జిల్లా తాడ్వాయి గ్రామం వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌తో పాటు పాల్వంచకు చెందిన అతడి మేనమామ అంజయ్య అక్కడికక్కడే మృతి చెందా రు. గాయపడిన వారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు.



"సత్యం ఎల్లప్పుడు విశ్వజనీనమైనది. ఒక మతం నిజమైనదైతే ఇతర మతాలూ నిజమైనవే.
– స్వామి వివేకానంద"



ఒకే దేశం – ఒకేసారి ఎన్నికలు

సంపాదకీయం

ఒకే దేశం – ఒకే పన్ను (జిఎస్‌టి) లాగే ఒకే దేశం – ఒకేసారి ఎన్నికలు'. ఇది ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇటీవల కాలంలో పదేపదే ప్రతిపాదిస్తున్న అంశం. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన దీన్ని పునరుద్ఘాటిస్తూ రాజకీయ పార్టీలు చర్చించాలన్నారు. మోడీ ప్రభుత్వం రూపొందించిన 'రాష్ట్రపతి ప్రసంగం'లో కూడా రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కూడా లోక్‌సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలను సమర్థించారు. దీనిపై చర్చ జరగాలని, రాజకీయ పార్టీలు స్థూల ఏకాభిప్రాయానికి రావలసిన అవసరం ఉందని కోరారు. ప్రతి ఏటా ఏవో కొన్ని రాష్ట్ర శాసనసభల ఎన్నికలవల్ల అధిక వ్యయం కావటంతో పాటు, ఎన్నికల షెడ్యూలు ప్రకటనతో 'నమూనా ప్రవర్తనా నియమావళి' అమలులోకి రావటం, అధికార యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో నిమగ్నం కావటంవల్ల అభివృద్ధి కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడుతోందన్నది మోడీ వాదన. ఐదేళ్ల కాలపరిమితితో ఒకేసారి జమిలి ఎన్నికలు జరిగితే అధికారం పొందిన పార్టీ నిరంతరాయంగా అభివృద్ధి కార్యక్రమాల్లో నిమగ్నం కావచ్చునేది సమర్ధన. ఈ వాదన పైకి హేతుబద్ధంగా కనిపిస్తోంది. రాజకీయ పార్టీల ఏకీభావంతో రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే ఇది సాధ్యం. కాంగ్రెస్ గుత్తాధిపత్యం సాగినకాలంలో – 1967 ఎన్నికల వరకు జమిలి ఎన్నికలు జరిగాయి. తదుపరి కాలంలో రాజకీయ అస్థిరతతో ఆ లింకు తెగిపోయింది. ఇప్పుడు లోక్‌సభలో బిజెపికి ఏకపక్ష మెజారిటీ ఉండటం, దాని అధికారం 19 రాష్ట్రాలకు విస్తరించటంతో ప్రధాని మోడీ, ఆయన అనుంగు సహచరుడు, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా మదిలో గుత్తాధిపత్య భావన కలిగి ఉండవచ్చు. అయితే ప్రజాస్వామ్యం మాటేమిటి? మోడీ ఎన్‌డిఎ ప్రభుత్వంలాగే ఏ ఇతర రాష్ట్ర ప్రభుత్వానికైనా పదవీ స్వీకారం రోజునుంచి ఐదేళ్లు (మధ్యలో ప్రభుత్వం కూలిపోతే తప్ప) అధికారంలో ఉండటం ప్రజాస్వామ్యయుత రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను పక్కనబెట్టి తమ 19 రాష్ట్రాల ప్రభుత్వాల చేత రాజీనామా చేయించి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆ శాసనసభలకు ఎన్నికల జరిపించే సాహసం మోడీ చేయగలరా? రాజ్యాంగ సవరణకు రాజకీయ ఏకాభిప్రాయం సాధ్యంకాదు కాబట్టి జమిలి ఎన్నికలు ఇప్పటికైతే సాధ్యంకాని విషయం. ప్రజలెదుర్కొంటున్న తీవ్ర సమస్యలనుంచి వారి దృష్టిని పక్కదారి పట్టించే ఎత్తుగడగానే దీన్ని చూడాల్సి ఉంటుంది.

ఇదే సమయంలో, మోడీ ప్రభుత్వం డిసెంబర్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభకు ముందస్తు ఎన్నికలకువెళ్లవచ్చని ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. 2019 జూన్ వరకు పదవీకాలమున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా ముందస్తు జమిలి ఎన్నికలకు సిద్ధమన్న ప్రకటనలు వెలువడుతున్నాయి. నరేంద్రమోడీ మూడున్నరేళ్ల పాలనపట్ల ప్రజల్లోని కొన్ని విభాగాల్లో వ్యతిరేకత ఒక మోతాదులో వ్యక్తీకరణ పొందుతోంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ఇందుకు సాక్ష్యం. ప్రధానమంత్రి ప్రచార భారాన్నంతా తన భుజానవేసుకుని అవిరామంగా పాటుపడినా 150 సీట్ల గెలుపులక్ష్యం 99కి పడిపోయింది. కాబట్టి ప్రభుత్వ వ్యతిరేకత మరింతగా పెరగక మునుపే, ప్రతిపక్షాలకు ఐక్యమయ్యే అవకాశమివ్వకుండా తెలివైన రాజకీయ వేత్త అయిన ప్రధాని నరేంద్రమోడీ రెండవ పదవీకాలాన్ని స్థిరపరుచుకునేందుకు ఆకస్మిక ఎన్నికలకు వెళ్లవచ్చు. అయితే నేడు పార్లమెంటుకు సమర్పించే 2018–19 బడ్జెట్ కలిగించే 'సంతృప్తి' అంశం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యం. దాంతోపాటు వర్షాలు–పంటలు–రైతుల సంతృప్తి అంతేముఖ్యం. కొద్ది మాసాల్లో జరగనున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి, తమ పాలనలో ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాల్లో డిసెంబర్ ఎన్నికల్లో అధికారం నిలుపుకోవటాన్నిబట్టి ఆకస్మిక ఎన్నికల నిర్ణయం జరగవచ్చు. లేదా కర్నాటకలో ఆశిస్తున్న అధికారం చేతికందితే డిసెంబర్‌లో మూడు రాష్ట్రాల ఎన్నికలతోపాటే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లవచ్చు. జమిలి ఎన్నికలైతే లోక్‌సభ ఎన్నికల ప్రభావంతో ఆ రాష్ట్రాల్లో 'ప్రభుత్వ వ్యతిరేకత'ను అధిగమించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఎన్నికలు ఎప్పుడు జరిగినప్పటికీ, ప్రతిపక్షాలు భేషజాలతో కాలయాపన చేయకుండా సాధ్యమైనంత విస్తృత ఐక్యతను సాధించగలిగితేనే మోడీ'గాలి'ని ఎదుర్కోగలుగుతాయి.

వైద్య కమిషనూ వ్యర్థమే!

చూపు

ఇంతకు ముందున్న భారత వైద్య మండలి (ఎంసిఐ)వలెనే జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసి) కూడా ఆరోగ్య వృత్తిలో ప్రమాణాలను సాధించడంలో విఫలం కానుందని చెప్పవచ్చు. ముఖ్యంగా జాతీయ కమిషన్‌ను కూడా డాక్టర్లతో నింపేస్తే ప్రమాణాల విషయంలో రాజీ పడవలసిందే. కమిషన్ ఏర్పాటు బిల్లును ఇటీవల పార్లమెంట్ స్థాయీ సంఘానికి నివేదించారు. 2017 జాతీయ వైద్య కమిషన్ బిల్లు అది. భారత వైద్య మండలిని సంస్కరించడానికి ఇది 13వ శాసన ప్రయత్నం. ఇంతకు ముందు కూడా చట్ట సవరణ ప్రయత్నాలు చాలా జరిగాయి. వైద్య మండలి చరిత్ర, వైఫల్యాలు అందరికీ తెలిసినవే. అవి బాగా రికార్డు అయ్యాయి కూడా. ఎంసిఐఐ పనిలో న్యాయవ్యవస్థ, చట్టసభలు చాలాసార్లు ప్రమేయం కల్పించుకొన్నాయి కూడా. తాజా బిల్లు ఎంసిఐ సంస్కణకు సరికొత్త యత్నం. ప్రస్తుత ఎంసిఐ వలెనే రానున్న ఎన్‌ఎంసి కూడా డాకర్ల ఆధిక్యతలోనే ఉంటుంది. అందుచేత ఆ సంస్థ డాక్టర్లను క్రమశిక్షణలో పెట్టడానికి ఇష్టపడదు. వారి అక్రమాలు, నిర్లక్ష్యం కొనసాగుతాయి. ఈ కమిషన్ మొత్తానికి అసమర్థ రెగ్యులేటర్‌గానే మిగులుతుంది. బిల్లులోని 4వ సెక్షన్ ఎన్‌ఎంసిని ఎలా కూర్చాలో నిర్దేశిస్తోంది. ఎంసిఐ బోర్డులో 104 మంది సభ్యులుంటే కొత్త ఎన్‌ఎంసి బోర్డులో 25మందే ఉంటారు. ఇది ఆహ్వానించదగ్గ మార్పే. పాలక సంస్థలు ఉన్నవే ఎక్కువ సమర్థతతో పని చేస్తున్నట్లు చరిత్ర నిరూపించింది. భారీ సంస్థలు ఆ విషయంలో వెనుకబడ్డాయి. కానీ ఈ 25మంది సభ్యులలో 20మంది డాక్టర్లే కావడం అసలు సమస్య. సభ్యులలో ముగ్గురు మాత్రమే ఇతర రంగాలకు చెందిన నిపుణులు.

ఎంసిఐ వలెనే ఎన్‌ఎంసి కూడా రెగ్యులేటర్ పాత్రను పోషించడంలో విఫలం కానుందని, ఫలితంగా రోగులకు జరగాల్సిన మేలు కొత్త వ్యవస్థలో కూడా మృగ్యం కానుందని అర్థమవుతోంది. దీని 25 మంది సభ్యులలో 11మంది ఎక్స్ అఫీషియో సభ్యులు. అందులో నలుగురు ఎన్‌ఎంసి కింది బోర్డుల అధ్యక్షులు కాగా ఆరుగురు ఎఐఐఎంఎస్, టాటా మెమోరియల్ హాస్పిటల్, పిజిఐఎంఇఆర్ డైరెక్టర్లు. ఆరోగ్య సర్వీసుల డైరెక్టర్ జనరల్ (డిజిహెచ్‌ఎస్)పాత్రను పిజిఐఎంఇఆర్ (వైద్య విద్యా పరిశోధనా సంస్థ) నిర్వహిస్తుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఒకరు ప్రతినిధిగా ఉంటారు. వీరంతా తాత్కాలిక సభ్యులే. దీని అధ్యక్షులుగా కనీసం 20ఏళ్ల అనుభవం గల డాక్టర్ ఉంటారు. మెంబర్ సెక్రటరీని ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. ఆ పదవిలోకి కూడా డాక్టర్ వస్తే ఎన్‌ఎంసిలో డాక్టర్ల ప్రాతినిధ్యం 21సీట్లకు పెరుగుతుంది.

ఎన్‌ఎంసిలో నిర్ణయాలు మెజారిటీ ఓటు ప్రకారం తీసుకోవడం జరుగుతుంది. టై పడితే చైర్‌పర్సన్ (డాక్టర్) ఓటుతో నిర్ణయం ఖరారవుతుంది. ఆ విధంగా ఎన్‌ఎంసి నిర్ణయాలు డాక్టర్ల చేతిలోనే ఉంటాయని చెప్పవచ్చు. ఈ రకంగా కూడా ఆ సంస్థలో డాక్టర్ల ఆధిపత్యం కొనసాగేలా నిబంధనలు ఉన్నాయి. ఎన్‌ఎంసి కింద ప్రమాణాలు నిర్ణయించి, అమలు పరిచే నాలుగు బోర్డులు డాక్టర్ల ఆధిక్యంలోనే ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా వృత్తిపరమైన రెగ్యులేటర్లు (నియంత్రణ సంస్థలు) క్లబ్‌లుగా మొదలయ్యాయి. వృత్తి నిపుణుల సరఫరాలో నియంత్రణను అవి కోరుకున్నాయి. ఎంసిఐని నెలకొల్పిన తరుణంలో డాక్టర్ల ప్రవేశాన్ని నియంత్రించడమే ప్రధానలక్ష్యంగా ఉండేది. అయితే కాలక్రమేణ ఎంసిఐ బోర్డు కేవలం డాక్టర్లతోనే నింపే ఆనవాయితీ నెలకొంది.

1960 దశకంలో ఈ ఆధిపత్యంలో కొద్దిగా మార్పు చోటుచేసుకుంది. ఆరోగ్య వృత్తిపై విమర్శల ధాటి పెరుగుతూ వచ్చింది. రోగ నిర్ధారణలో తప్పులు, అపసవ్య చికిత్సా పద్ధతులు, రోగులను తప్పుడు సమాచారంతో భయపెట్టడం సరైన చికిత్స కొరవడిన సందర్భాలను నిఘా కాసే సమాచారం లోపించడం వంటి అవకతవకలు ప్రముఖంగా వెలుగులోకి రావడం మొదలయింది. వైద్యచికిత్సలో అవకతవకల వల్ల తమకు అందుతున్న వైద్యం నాణ్యమైనదో కాదో రోగులు చెప్పలేని పరిస్థితి వచ్చింది. దీనితో రోగులపై డాక్టర్లు అలవికాని ప్రభావాన్ని చెలాయిస్తూ వచ్చారు. అనవసరపు పరీక్షలతో డబ్బులు గుంజడం, అక్కరలేకపోయినా శస్త్ర చికిత్సలు చేయడం వంటి అవకతవకలకు ఆస్కారం పెరిగింది. వైద్య సంరక్షణ తీరుపై కెన్నెత్ యారో తన పరిశోధనా పత్రంలో తీవ్రంగా విమర్శలు గుప్పించాక డాక్టర్లను నియంత్రించే చట్టాలను తిరగరాసే ప్రక్రియ మొదలయింది. కొత్త శాసనాల వల్ల డాక్టర్ల వైద్య వృత్తిని సంరక్షించే బదులు రోగుల క్షేమాన్ని పట్టించుకొనేదిగా దృశ్యం మారింది. ఇందుకు 1983 బ్రిటన్ వైద్య చట్టం, 1975 కాలిఫోర్నియా చట్టం ఉదాహరణ. వాటికి చేసిన మార్పులు కొత్త తరం ఆలోచనలను ప్రతిబింబించాయి. దీనితో వైద్య నియంత్రణ బోర్డులలో రోగుల ప్రాతినిధ్యం పెరగాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. రోగుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వైద్య నియంత్రణ సంస్థలను కూర్చే పద్ధతిలో మార్పులు ప్రవేశపెట్టారు. తమ ప్రయోజనాలు, తమ సాటివారి ప్రయోజనాలు రక్షించడానికి పాటుపడే డాక్టర్లతో బోర్డును నింపే పద్ధతి పోయింది. కనీస ప్రమాణాలు పాటించని కేసులపై విచారణలు, కోర్టులకు నివేదించడాలు కొత్తగా అమలులోకి వచ్చాయి. ఉదాహరణకు బ్రిటన్‌లోని 'జనరల్ మెడికల్ కౌన్సిల్ (జిఎంసి)'లో డాక్టర్లు, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య సరిసమానంగా ఉంటుంది. ఆస్ట్రేలియాలోని 'హెల్త్ ప్రాక్టీషనర్ ఏజెన్సీ (ఎహెచ్‌పిఆర్‌ఎ)లో అందరూ ప్రజలకు సంబంధించిన సభ్యులే ఉంటారు. భారతదేశంలో అక్రమాలకు, నిర్లక్ష్యానికి డాక్టర్లను బాధ్యులను చేసేందుకు కొంత ప్రయత్నం జరిగింది. 1964సవరణ చట్టం వైద్య వృత్తికి ప్రమాణాలు నిర్దేశించే అధికారాన్ని ఎంసిఐకి కట్టబెట్టింది. అయినప్పటికీ ఆ సంస్థ కాలం చెల్లిన రూపంలో కొనసాగుతూ వస్తోంది.



ప్రభుత్వం నియమించే 8మంది సభ్యులు తప్ప తక్కిన వారంతా డాక్టర్లే ఉంటున్నారు. ప్రస్తుతం ఎంసిఐలో ఉన్న 104మంది సభ్యులలో అందరూ డాక్టర్లే. 8మంది నామినేటెడ్ సభ్యులు కూడా డాక్టర్లే. దీనితో ఎంసిఐ నియంత్రణ తీరు దెబ్బతింది. 1964 సవరణ చట్టంతో డాక్టర్లకు ప్రవర్తనా నియమావళిని నిర్ణయించే అధికారం కూడా ఎంసిఐకి కలిగింది. 2002లో మొదటి నియమం అమల్లోకి వచ్చింది. అంటే 38 ఏళ్ల తర్వాత డాక్టర్లపై దర్యాప్తు, శిక్షా చర్యలలో ఎంసిఐ రికార్డు చాలా కనాకష్టంగా ఉంది. 2000 నాటి ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంలో ఫిర్యాదులు, దర్యాప్తుకు సంబంధించి డేటాబేస్ లేనేలేదని వెల్లడయింది. ఎంసిఐ కంటే ప్రతిపాదిత ఎన్‌ఎంసి ఎక్కువ భిన్నత్వంతో ఉంది. అయితే ఇతర నియంత్రణ సంస్థలతో పోలిస్తే ఎన్‌ఎంసిలో కూడా ప్రజల నుంచి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన ఎన్‌ఎంసి వ్యవస్థలో మరింత భిన్నత్వం కనిపిస్తోంది. 20మంది సభ్యులలో 10 మందే ఆరోగ్యవృత్తికి చెందిన వారుండాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. ఇతర దేశాల వైద్య నియంత్రణ సంస్థలవలే కాకుండా ఎన్‌ఎంసిలో ప్రభుత్వ ప్రతినిధులు ఉండడం విశేషం. కానీ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాలలో జోక్యం చేసుకుంటుందనే భయాలను తొలగించవలసి ఉంది. వృత్తిపరమైన నియంత్రణసంస్థలు ప్రభుత్వంతో సమానం. కాబట్టి ప్రమాణాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఎన్‌ఎంసి ఇవ్వకతప్పదు.

షెఫాలి మల్హోత్రా, శుభో రాయ్

అధ్వాన్నంగా ఆర్థిక దృశ్యం

గత నాలుగేళ్లుగా ఆర్థికవ్యవస్థ అధ్వాన్నంగా ఉండడం ప్రభుత్వాన్ని, ప్రజలను కూడా ఆందోళనలో పడవేస్తోంది. 2018–19 ఆర్థిక సర్వేలో చిత్రించిన విధంగా ఆర్థికవ్యవస్థ దూసుకుపోవడం లేదు. ఇది మోడీ ప్రభుత్వ ఐదవ, ఆఖరి బడ్జెట్‌ను కంపింపచేస్తున్న అంశం. ఆర్థిక సర్వే రచయితలు కూడా ఆశలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థ పనితీరు ఉండగలదా అన్న ఆందోళనను ఆ పత్రంలో వెలిబుచ్చారు.

ప్రజలు కూడా తమను కష్టాల పాలుచేస్తున్న ప్రభుత్వాన్ని కూల్చడానికే ప్రాముఖ్యం ఇస్తారు. తామనుభవించిన నష్టాలను మరిచిపోయేలా చేసే ప్రయోజనాలను కల్పించినా పట్టించుకోరు. రాజకీయాలకు కూడా ప్రజల ఆర్థిక పరిస్థితి అతి ముఖ్యం. ప్రస్తుతం ప్రభుత్వంలో ఆందోళన పెరిగిన కారణం కూడా అదే. ఎందుకంటే గత నాలుగేళ్లుగా ఆర్థిక వ్యవస్థలో వరుసగా ప్రయోగాలను చూశాము. భవిష్యత్తులో లాభం ఇచ్చినా తక్షణమే భారీ నష్టాన్ని కలిగించిన ప్రయోగాలు అవి. ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల వ్యక్తులు తమకు అవసరమైన సేవలు, సరకులు పొందడానికి ఎక్కువ డబ్బు ముట్టజెప్పారు. సరకులు, సేవల పన్ను(జిఎస్‌టి) అమలు తర్వాత ప్రత్యక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 50 శాతం పెరిగిందని సర్వే తెలిపింది.

> జిఎస్‌టిని తరుచూ మార్చడం నూతన దివాళా నిబంధనలు ఆర్థిక స్థితిని గట్టున పడేస్తాయని ఆర్థిక సర్వే ఊహాగానం చేసింది. 2017–18 రెండవ అర్ధ భాగంలో ఆర్థిక వ్యవస్థ పురోగతి వేగం పుంజుకున్నట్లు సర్వే ఆశ లు రేకెత్తించింది. అలా జరగాలంటే జిడిపి వృద్ధి 2017 –18లో 6.75 శాతం చేరుకోవాలి. అంతే కాకుండా 2018–19లో 7–7.5 శాతం చేరుకోవాలి. మొత్తానికి ఆర్థిక సర్వే ధైర్యం చెబుతున్నా, వాస్తవాలు భయపెట్టడం మానలేదు. ఇది ఎన్నికల సంవత్సరంలో మోడీ ప్రభుత్వానికి గొంతులో పచ్చి వెలక్కాయలా మారిందని చెప్పవచ్చు.

జిఎస్‌టి వల్ల ద్రవ్యోల్బణం అదుపులో ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ దాని అమలుతో సరుకులు, సేవల ఖర్చు పెరిగింది. ఇందులో ప్రజలకు కలిగిన నగదు నష్టం కేవలం ప్రకటనలతో తీరదు. అంతేకాకుండా, 2018లో జీవన వ్యయం పెరగబోతోంది. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరగడం, వాటి గిరాకీ కూడా దేశీయంగా పెరగడం వల్ల జీవన వ్యయం మరింత భారం కానుంది. చమురు ధరలు తగ్గుతున్నప్పుడే పరిస్థితి మెరుగుకానప్పుడు అవి పెరుగుతున్నప్పుడు ఎలా మెరుగవుతుంది? ఇపిఎఫ్, ఇఎస్‌ఐ వంటి సామాజిక భద్రత సౌకర్యాల వ్యవసాయేతర ఉపాధి వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాల సంఖ్య ప్రస్తుతం 7.5 కోట్లు ఉంది. ఇది మొత్తం ఉద్యోగులలో 31 శాతం. అయితే ఇటీవల అమలులోకి తెచ్చిన జిఎస్‌టి నెట్‌వర్క్ ఈ సంఖ్యను 12.7కోట్లుగా చూపుతోంది. అంటే మొత్తం ఉద్యోగులలో 53 శాతం.

కార్మిక సంస్కరణల భూతం

ప్రభుత్వంపై విరుద్ధ ప్రభావం చూపే అంశాల్లో కార్మిక సంస్కరణలు, భూముల సేకరణ చట్టాల్లో మార్పులు కూడా చేయబోతున్నాయి. ఆ మార్పులను పరిశ్రమలకు, వ్యాపార వర్గాలకు అనుకూలంగా మార్చబోతున్నారు. ఇది కూడా రాజకీయంగా ప్రభుత్వానికి ఎదురుతన్నవచ్చు. ప్రజలను ఎన్ని రకాలుగా ప్రభుత్వం మభ్యపెడుతోందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా సిబిఐపై, పన్నుల శాఖలపై చాలా ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు తర్వాత ఈ ఆరోపణలు పెరిగాయి. ఆర్థిక సర్వేలో న్యాయ విచారణ సాగుతున్న ప్రత్యక్ష పన్నుల కేసులపై ఇచ్చిన సమాచారం అంత సరిగా లేదు. 27శాతం ప్రత్యక్ష పన్నుల కేసులు ఆదాయం పన్ను అపిలేట్ ట్రిబ్యునల్(ఐటిఎటి), కస్టమ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అపిలేట్ ట్రిబ్యునల్ (సిఇఎస్‌టిఎటి) వద్ద, 13 శాతం కేసులు హైకోర్టుల వద్ద విచారణలో ఉన్నట్లు సర్వే పేర్కొంది.

ఐటిఎటి/సిఇఎస్‌టిఎటి వద్ద 12శాతం కేసులు, సుప్రీంకోర్టులో 11శాతం కేసులు, హైకోర్టులలో 46 శాతం కేసులు ఉన్న విషయం యదార్థం. ప్రభుత్వ శాఖలను దుర్వినియోగపరుస్తున్న తీరుకు ఓటు బ్యాంకులో చాలా భాగం అసమ్మతి పెంచుకొని ఉంది. హై ప్రొఫైల్ కేసులు కేవలం 0.2శాతం మాత్రమే. ఇది వివాదంలో ఉన్న మొత్తం విలువలో 56శాతం. పెండింగ్ కేసుల్లో 66 శాతం ఒక్కొక్కటి రూ.10లక్షలు కంటే తక్కువ విలువ గలవి. రానున్న ఎన్నికల్లో ఈ గ్రూపు ప్రజలు మోడీకి ఎదురు తిరిగే ప్రమాదం ఉంది. దేశంలో ఇంకా వ్యవసాయ రంగమే అత్యంత ప్రాధాన్యం గలది. ఎందుకంటే మన జనాభాలో 70శాతం మందికి అదే జీవనోపాధి కల్పిస్తోంది. స్థూల దేశీయ ఉత్పత్తి(జిడిపి)లో దాని భాగం 16 శాతం. అంటే చెప్పుకోదగ్గంత.

49 శాతం మంది ప్రజలకు ఆ రంగం ఉపాధి కల్పిస్తోంది. వ్యవసాయ రంగం పనితీరు కుంటుపడితే ద్రవ్యోల్బణం, రైతుల్లో నిరాశ, అశాంతి పెరుగుతాయి. రాజకీయ, సామాజిక అనాసక్తత పెచ్చుమీరుతుంది. ఇవన్నీ కలిసి ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తాయి.

2017–18 సంవత్సరానికి తొలి అంచనాల ప్రకారం జాతీయ ఆదాయంలో వృద్ధి 'గ్రాస్ వ్యాల్యూయాడెడ్ (జివిఎ)'లో 2.1శాతం ఉండగలదని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇది ఇంతకు ముందు ఏడాది వృద్ధి రేటు(4.9)తో పోల్చితే సగం కంటే తక్కువ. ఓటర్లలో చాలామంది ఈ వర్గం ప్రజలే. వీరు మోడీ రాజకీయ భవితవ్యాన్ని విరుద్ధంగా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అయితే అలా కాకుండా ఉండాలంటే ఆకర్షణీయమైన ప్యాకేజీని ఈ ఎన్నికల సంవత్సరంలోనే ప్రకటించి, అమలు పర్చాలి.

పారిశ్రామిక రంగం కూడా..

2016 నుంచి పారిశ్రామిక రంగం పనితీరు కూడా చాలా కనాకష్టంగా ఉంది. మన పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 75శాతం కంటే తక్కువ వినియోగించుకుంటున్నాయి. ఈ విపరిణామం 2016లో నోట్ల రద్దు ప్రకటించినప్పటి నుంచి కనపడుతోంది. 2016 జూన్ నుంచే పారిశ్రామిక రంగంలో మాంద్యం కనపడుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ దాకా పారిశ్రామిక ఉత్పత్తి కేవలం 3.2శాతం రేటున పెరిగింది. ఈ రేటు అంతకు ముందు ఏడాది అదేకాలంలో 5.5శాతం ఉండేది. 2007లో స్థూల జాతీయ ఉత్పత్తి(జిడిపి)లో స్థూల స్థిర పెట్టుబడి రూపొందడం 35.6శాతం దాకా చోటు చేసుకుంది. ఇది 2017లో 26.4 శాతానికి దిగిపోయింది.

అలాగే జిడిపిలో దేశీయ ఆదా నిష్పత్తి కూడా 38.3 శాతం నుంచి 29.0శాతానికి 2016లో పడిపోయింది. భారతదేశ చరిత్రలో అటువంటి పెట్టుబడి ఆటుపోట్లు ఎన్నడూ సంభవించలేదు. పెట్టుబడులు, ఆదా రేట్లు రెండూ పడిపోవడం అనూహ్యమైన విపరిణామం. 1991లో 'బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్' సంక్షోభం తరుణంలో కూడా అలా జరగలేదు. పెట్టుబడులకు పెద్దగా ప్రోత్సాహకాలు కల్పించడం ప్రభుత్వానికి తలకు మించిన భారంగా పరిణమించింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో, పారిశ్రామిక రంగంలో రెండింటా ఈ ప్రోత్సాహకాలకు అనుకూలంగా మన ఆర్థిక పరిస్థితి లేదు. గత ఏడాదిగా చేపట్టిన ఆర్థిక సంస్కరణలు వచ్చే ఏడాది సత్ఫలితాలిస్తాయని ఆర్థిక సర్వే చేసిన జోస్యం నిజం కావాలని మోడీ ప్రభుత్వం ఎంతైనా కోరుకొంటోంది.

జిఎస్‌టిని తరుచూ మార్చడం నూతన దివాళా నిబంధనలు ఆర్థిక స్థితిని గట్టున పడేస్తాయని ఆర్థిక సర్వే ఊహాగానం చేసింది. 2017–18 రెండవ అర్ధ భాగంలో ఆర్థిక వ్యవస్థ పురోగతి వేగం పుంజుకున్నట్లు సర్వే ఆశలు రేకెత్తించింది. అలా జరగాలంటే జిడిపి వృద్ధి 2017–18లో 6.75 శాతం చేరుకోవాలి. అంతే కాకుండా 2018–19లో 7–7.5శాతం చేరుకోవాలి. మొత్తానికి ఆర్థిక సర్వే ధైర్యం చెబుతున్నా, వాస్తవాలు భయపెట్టడం మానలేదు. ఇది ఎన్నికల సంవత్సరంలో మోడీ ప్రభుత్వానికి గొంతులో పచ్చి వెలక్కాయలా మారిందని చెప్పవచ్చు.

జ్ఞాన్ పాఠక్

జాతరకు జాతీయ హోదా

ఆదివాసీల అస్తిత్వానికి ముప్పు



పూకె రామకృష్ణదొర
9866073866

మేడారం ఆదివాసీ జాతరగా చెప్పవచ్చు. ఆదివాసీలు, ఆదివాసేతరులు లక్షలాదిగా తరలివచ్చే జాతర. ఈ జాతరలో విగ్రహారాధన ఉండదు. ఎలాంటి బ్రహ్మణాధిపత్య భావజాలం లేని ఆదివాసీ జాతర. కేవలం ప్రకృతి ఆరాధన, పసుపు, కుంకుమలు తప్ప మరే ఇతర ఆచారాలుఉండని జాతర. ఏదో ఒక పేరుతో ఆదివాసీల్ని అడవినుంచి వెళ్లగొట్టాలనే కుట్రలు మన ప్రభుత్వాల విధానాలుగా ఉన్నాయి. పోరు బిడ్డలను ఆరాధించడం అంటే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవడమే అవుతుంది. అందుకే దీనికి పూర్తి ఆధ్యాత్మికత జోడించి ప్రశ్నించే తత్వాన్ని పారదోలేందుకు కుట్రలు జరుగుతూనే ఉన్నాయి.

ఆదివాసీలను మన చట్రంలోకి తీసుకువచ్చే ప్రయత్నం బ్రాహ్మణాధిపత్య శక్తులు, లంబాడీలు చేస్తూనే ఉన్నారు. దీన్ని వ్యాపారం చేసేందుకు, ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది మేడారం జాతరకు కోటి 30లక్షల మంది రానున్నారు. ఈ జాతరకు అంతర్జాతీయ ఖ్యాతి వస్తుం డటంతో మేడారంపై కార్పొరేట్ కంపెనీల దృష్టి పడింది. అసలు మేడారం జాతర నేపథ్యాన్ని, సమగ్ర చరిత్రనూ వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ఆదివాసీ రచయితల సంఘంపై ఉన్నది. సంస్కృతి, సంప్రదాయం భావనల్ని సరిగ్గా అర్థం చేసుకోగలిగినప్పుడే మేడారం జాతర అర్థం అవుతుంది.

అడవిని నమ్ముకుని జీవించే ఆదివాసీల రాగాలాపన ఈ మేడారం జాతరలో కనిపిస్తుంది. ఆదివాసీల ప్రాకృతిక ఆరాధనకు, ఆధిపత్య ప్రతిఘటనకు ప్రతీకగా మేడారం జాతర నిలుస్తుంది. ఆధిపత్య సంస్కృతుల్ని సవాల్ చేస్తూ ప్రత్యామ్నాయ సంస్కృతుల్ని రూపొందించుకునే స్థాయికి స్థానికంగా ఆదివాసీ సమాజం ఎదిగింది. అందువలనే ప్రకృతికి తప్ప మనిషి ముందుసాగిలపడే సంస్కృతికి ఆదివాసి సమాజంలో స్థానం లేదు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వాన్ని అధికారికంగా కోరింది. మరి రెండు సంవత్సరాలలో ఆ హోదా మేడారం జాతరకూ రాబోతుంది. అదే కనుక వస్తే ఆదివాసీల అస్తిత్వం అంతం అవుతుంది. మేడారం జాతరపై పాలకవర్గాల ఒత్తిడి, ఆధిపత్యం ఎక్కువవుతుంది. ఆదివాసీలు దూరం అవుతారు. గిరిజనేతరుల వలసలు, ఆధిపత్యం ఎక్కువై జాతర నిర్వహణ దేవాదాయ శాఖలోకి పోతుంది. ఆదివాసీల పోరాట చరిత్ర కనుమరుగు అవుతుంది. మేడారం జాతరను జాతీయీకరణ చేయటం ఆదివాసీ సమాజానికి చాలా ప్రమాదం. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం అధికారికంగా ఆధిపత్యం చెలాయించి సగం వాటా తీసుకుంటున్నది. సౌకర్యాలు కల్పించటంలో విఫలం అయింది.

పాలకులు చివరికి హిందూ సామ్రాజ్యవాదాన్ని మేడారం జాతరపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఆదివాసీలకు విగ్రహారాధన లేదు అంటూనే బంగారు విగ్రహాలు సమ్మక్క, సారలక్కలకు చేయించాలనే కుట్ర కనిపిస్తున్నది. ఈ కుట్ర కుతంత్రాలను ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు. ముందు ముందు పెద్దపెద్ద దేవాలయాలు మేడారంలో నిర్మించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. బ్రాహ్మణ పూజారులు ఈ దేవాలయంలో తిష్ట వేస్తారు. ఇట్లా జరగటం చరిత్రలో కొత్తేమీ కాదు. చెంచులకు ఇప్పటికే ఈ అన్యాయం జరిగింది. శ్రీశైలంలో ఉన్న చెంచు మల్లన్న దేవాలయంలో ఆ సముదాయంలో ఇప్పుడు చెంచు పూజారులు లేరు. బ్రాహ్మణులు లింగాయతులే అర్చకులుగా ఉన్నారు. పాలకవర్గాల పెత్తనం పెరిగిపోతే సమ్మక్క, సారలమ్మలకూ కోయలు దూరం అవుతారు. మరోవైపు మేడారం జాతర ఆదివాసీలలో అసంతృప్తికి లోనవుతుంది. మేడారంలో ఆదివాసీల పరిస్థితులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. కన్నేపల్లిని కూడా అభివృద్ధిని చేయటం లేదు. మేడారం జాతర వల్ల ఆదివాసీలు వేసే రెండో పంట నష్టం అవుతోంది. అక్కడ బ్లేడు ట్రాక్టర్లను పెట్టి చదును చేసి సరిహద్దులు చెరిపివేస్తున్నారు. రెండో పంట వేయనీయకుండా ప్రభుత్వం అక్కడి కోయల భూములను బలవంతంగా తీసుకుంటున్నది. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నది. కల్పించటం మంచిదే కాని రెండో పంట వేసుకునే అవకాశం దూరం అవుతోంది. జాతర తర్వాత రెండునెలలు ఆ ప్రాంతం అంతా దుర్వాసనతో భయంకరంగా ఉంటుంది.

స్థానిక ఆదివాసీలు రోగాల బారిన పడతారు. అందువల్ల జాతర ముగిసిన వారంరోజులలోగా ఆ ప్రాంతాన్ని, వారి భూములను శుభ్రం చేసి వ్యర్థాలను తీసివేయాలి. రెండో పంటకూ నష్టపరిహారం చెల్లించాలి. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ వారిని మేడారం జాతర నిర్వహణలో పెట్టి ఆధిపత్యం చెలాయించాలనే పాలకుల కుట్రలకు వ్యతిరేకంగా నేడు ఆదివాసీ కోయలు పోరాడుతున్నారు. మేడారం జాతరలో దేవాదాయశాఖ పెత్తనం కూడా రానురాను పెరిగిపోతోంది. మేడారం జాతరకు అన్ని హిందూ దేవాలయాలు లాగానే ట్రస్ట్ బోర్డును పెట్టి లంబాడీలనూ, గిరిజనేతరులనూ, అగ్రవర్ణాలనూ సభ్యులుగా నియమిస్తున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు తెలియని వారిని ట్రస్ట్‌బోర్డ్‌లో పెట్టి కోయలను మేడారం జాతరకూ దూరంచేయాలనే సమ్మక్క సారలమ్మలను హిందూ దేవతలుగా గుర్తించే కుట్ర, మేడారం బ్రాహ్మణైక్యం చేయాలనే, ఆదివాసీల అస్తిత్వం అంతం చేయాలనే కుట్రలు, కుతంత్రాలు జోరుగా నడుస్తున్నాయి.

నేడు దేశంలో, రాష్ట్రంలో ఆదివాసీల రిజర్వేషన్స్ ఉద్యోగాలు, భూములు, ఆదివాసీల అమాయకత్వాన్ని గిరిజనేతర సామ్రాజ్యవాదం అంతం చేస్తున్నది. దోచుకుంటున్నది. కబ్జా చేస్తున్నది. అదే గిరిజనేత సామ్రాజ్యవాదం నేడు మేడారం జాతరపై పడి దోచుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నది. ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిపే మేడారం జాతరను సైతం ఆక్రమించుకోవాలని, గిరిజనేతరులు, లంబాడీలు ప్రయత్నించడం అణగద్రొక్కడమే అవుతుంది. ఈ కుట్రలు, కుతంత్రాలకు వ్యతిరేకంగా సమ్మక్క, సారలమ్మ పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని మేడారం జాతరను కాపాడుకోవాలి. ఆదివాసీ సంస్కృతిని రక్షించు కోవాలి.

మేడారం జాతరపై ఆదివాసీ మేలుకో..
సమ్మక్క, సారలమ్మ జాతర ఏలుకో.

అఖిల





అవార్డులు రివార్డులకన్నా పేషెంట్ల సంతృప్తే ముఖ్యం

కత్తిగాటు లేకుండా ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) వ్యాధులకు రోబోటిక్ సర్జరీ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించిన తొలి వైద్యురాలిగా తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళ డా.కల్పనా నాగపాల్ చరిత్ర సృష్టించారు. నెల్లూరు జిల్లాలో పుట్టిన ఆమె ఉత్తరాదికి చెందిన ఒక డాక్టర్‌ని వివాహమాడి, ఢిల్లీలోని అపోలో హాస్పిటల్‌లో విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన వ్యాధులను నయం చేసేందుకు అధునాతన రోబోటిక్ చికిత్స విధానాన్ని దేశానికి పరిచయం చేశారు. అమెరికా, దక్షిణ కొరియాలలో ప్రాచుర్యం పొందిన అత్యాధునిక చికిత్సను కల్పనా నాగపాల్ నిర్వహించారు. గురక సంబంధింత వ్యాధులతో బాధపడేవారికి ఈ చికిత్స అత్యుత్తమమైనదని చెబుతున్నారు. సాధారణ శస్త్రచికిత్సల కంటే రోబోటిక్ చికిత్స విధానంలో సక్సెస్ రేట్ ఎక్కువ అని అమెరికా, దక్షిణ కొరియా దేశాలలో నిరూపితమైంది. దీని వల్ల తక్కువ సమయంలోనే రోగి కోలుకోవడానికి ఉపయోగపడుతుంది. తొలిసారిగా ఢిల్లీలోని అపోలో ఇంద్రప్రస్థ వైద్యులు ఈఎన్‌టీ చికిత్సలో రోబోటిక్ శస్త్రచిక్సితను నిర్వహించారు. కల్పన ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీ-ఎస్, అమెరికాలో ఈఎన్‌టీ ఫెలోషిప్, దక్షిణ కొరియాలోని సియోల్‌లో రోబోటిక్స్ సర్జరీని అభ్యసించింది. ఈ నేపథ్యంలో కల్పన తన మనోభావాలను అఖిలతో పంచుకున్నారు.

తొలి రోబోటిక్ సర్జన్ కల్పనా నాగపాల్

ఈఎన్‌టీ వ్యాధులకు రోబోటిక్ సర్జరీ అత్యాధునికమైనది. ఇప్పటి వరకూ గుండె సంబంధిత వ్యాధులకే ఉపయోగించేవారు. కత్తిగాట్లు లేకుండా, తక్కువ నొప్పి, కొద్దిపాటి రక్తస్రావంతోనే వ్యాధుల్ని నయం చేయవచ్చు. శస్త్ర చికిత్స తర్వాత ఒక్కరోజులోనే డిశ్చార్జి కావచ్చు. సర్జరీ తర్వాత సాధారణంగా ఆహారం తీసుకోవటంలో సమస్యలు కూడా ఉత్పన్నం కావు. గురక సమస్యను నివారించేందుకు కూడా రోబోటిక్ సర్జరీ చేస్తాం. రోబోటిక్ ఈఎన్టీ హెడ్ అండ్ నెక్ సర్జరీలో స్పెషలైజేషన్ కోర్సు చేశాను. వేరే డాక్టర్ల కంటే భిన్నమైన రంగాన్ని ఎంచుకొని, అందులో రాణించాలనేదే నా అభిమతం. అందుకోసమే ఈఎన్‌టీలో రోబోటిక్ సర్జరీని ఎంచుకున్నాను. క్రీడారంగం అంటే ఇష్టం. చిన్నతనంలో ఖోఖోలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించాను. అందరి కంటే భిన్నంగా ఉంటూ నలుగురిలో గుర్తింపు తెచ్చుకోవాలనే పట్టుదల ఎక్కువ నాకు. అందుకే పిల్లలకు, ఇతరులకు కూడా ఇదే సందేశాన్ని ఇస్తాను. దేశంలో పేరు పొందిన ఎయిమ్స్ వంటి వైద్య విజ్ఞాన సంస్థలలో కూడా రోబోటిక్ సర్జరీ చేసే విధానం లేదు.

స్వశక్తితో ఎదిగాను

నెల్లూరు జిల్లా సూళ్ళూరు పేటలోని బత్తులవల్లి అనే చిన్న గ్రామంలో పుట్టాను. నిరుపేద కుటుంబంలోంచి వచ్చిన నేను చిన్నతనంలో గ్రామాల పరిస్థితులను చూసి చలించేదాన్ని. కష్టపడి చదివితే జీవితంలో మంచి స్థాయికి చేరుకోవచ్చని మా అమ్మ మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించేది. కుటుంబంలో నేనే పెద్దదాన్ని. ఇద్దరు తమ్ముళ్లు. వారు ప్రస్తుతం ఫ్లోరిడాలో సెటిలయ్యారు. ఎవరి పైరవీ లేకుండా స్వశక్తితో జీవితంలో ఎదిగాను. నలుగురికి సేవచేయాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నాను. జీవితంలో డబ్బు, కీర్తి, పేరు ప్రతిష్టలు సంపాదించినప్పటికీ అవేవీ తృప్తిని ఇవ్వవు. కష్టాలలో ఉన్న వారిని ఆదుకొని సేవ చేస్తే అప్పుడు లభించే ఆనందాన్ని వెలకట్టలేం. చెన్నైలోని ఆవడిలో నా చదువు సాగింది. మా నాన్న ఆర్మీలోని సివిల్ విభాగంలో పనిచేసేవారు. అందుకే విద్యాభ్యాసంలో ఎక్కువ భాగం అక్కడే జరిగింది. అందువల్ల అన్ని సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. అది నా జీవితంపై ప్రభావం చూపింది.

ఆడంబరాలకు, విలాసాలకు దూరం

వైద్యవిద్యలో పుణేలో పీజి చేస్తున్నప్పుడు కూడా సైకిల్ పైనే వెళ్లేదాన్ని. సరిపడినంత డబ్బులు లేక పీజీ చేసేటప్పుడు కేవలం రూ. 850 అద్దె చెల్లించి, కనీసం ఫ్యాన్ లేని ఇంటిలో ఉండేదాన్ని. సైకిల్ కూడా సెకెండ్ హాండ్‌లో కొని కాలేజీకి వెళ్లేదాన్ని. కొన్ని రోజులకు ఆ సైకిల్ కూడా పాడైపోవడంతో, రోజూ ఐదు కిలోమీటర్లు కాలినడకన కాలేజికి వెళ్లేదాన్ని. మా అత్త, మామ, భర్త తరపున కుటుంబ సభ్యులందరూ ఢిల్లీలో సెటిల్ అవడం వల్ల నేను కూడా ఇక్కడే వైద్య వృత్తిని కొనసాగిస్తున్నాను.

నేను నా భర్త ఇద్దరం వైద్యవృత్తిలో కొనసాగుతున్నాం. మాకు డబ్బు యావ లేదు. కావాల్సినంత మాత్రమే రోగుల నుండి తీసుకుంటాం. అది కూడా వారు చెల్లించలేకపోతే వదిలేస్తాం. అనేక చోట్ల జూనియర్ డాక్టర్ గా పనిచేసినప్పటికీ అక్కడ సంతృప్తిని ఇవ్వకపోవడంతో, అపోలోలో జూనియర్ డాక్టర్‌గా విధులు నిర్వర్తించా. అందరికంటే భిన్నంగా వృత్తిలో ఉండటానికి, తమ్ముడు ఉన్న అమెరికాలో ఫ్లోరిడాకి వెళ్లి అక్కడే ఆరునెలల పాటు ఉంటూ ఫెలో షిప్ చేయాలని నిర్ణయించుకున్నాను. జార్జియాలోని ఒక హాస్పిటల్‌ని సంప్రదిస్తే, నువ్వు భారతీయురాలివి, అందులో నీ భర్త ఉత్తర భారతదేశానికి చెందిన వాడు కాబట్టి, వారు చాలా ఆరోగెన్స్‌గా ఉంటారని నిరాకరించారు. ఆ వార్త నన్ను షాక్‌కి గురిచేసింది.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సైనెస్ సర్జన్ అయిన ఆ హాస్పిటల్ అధిపతే ఈ రకంగా మాట్లాడేసరికి నాకు నోటమాట రాలేదు. ఫోన్‌లో ఇంటర్వ్యూ చేసి రమ్మన్న వారు అక్కడికి వెళ్లేసరికి ఈ రకంగా సమాధానం ఇచ్చే సరికి ఏమి చేయాలో పాలుపోలేదప్పుడు. ఇక్కడ వైద్యులలో చాలా ఈగో ఉంటుంది. కాని అమెరికాలో వైద్యులు, సిబ్బంది కలసి పనిచేస్తారు. ఒకరిని ఒకరు గౌరవించుకుంటారు. కాబట్టి ఆ వాతావరణం చాలా బాగా నచ్చింది. అటువంటి వారు నన్ను ఫెలోషిప్ లోకి తీసుకోవడానికి నిరాకరించడంతో చాలా ఇబ్బంది పడ్డాను. అక్కడే పుట్టి స్థిరపడ్డ ఒక భారతీయ వైద్యుడు సిఫార్సు చేయడంతో నన్ను ఫెలోషిప్ కింద తీసుకోవడానికి ఇష్టపడ్డ ఆ హాస్పిటల్ డీన్ నాలో ఉన్న వృత్తిపరమైన స్కిల్స్‌కి పరీక్ష పెట్టారు. వాటిలో పాస్ కావడంతో అంగీకరించిన ఆయనకు ఆ తర్వాత కాలంలో ప్రియ శిష్యురాలిగా మారిపోయాను. దొరికిన అవకాశాన్ని వదులుకోకుండా సద్వినియోగం చేసుకున్నాను. చివరికి శిక్షణ పూర్తి చేసుకొని వెళ్లిపోతున్నప్పుడు ఆయన కుటుంబ సభ్యులతో డిన్నర్‌కి ఆహ్వానించడం నా జీవితంలో మరచిపోలేను. అమెరికా డాక్టర్లు ఎప్పుడూ, ఎవరినీ డిన్నర్‌కి ఆహ్వానించరు. సవానా జార్జి అమెరికా యూనివర్సిటీలో సైనస్ (ముక్కుకు సంబంధించిన విభాగం) డీన్ డాక్టర్ ఫ్రెడిక్ జోన్స్, ఆ అమెరికన్ డాక్టర్ మరుసటి రోజు సర్టిఫికెట్‌తో పాటు, రెండు విలువైన వైద్య పరికరాలు గిఫ్ట్ గా ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేను.



ఒక వైద్యురాలిని అయినప్పటికీ తల్లిగా మారడంలో జీవితంలో చాలా ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. మూడుసార్లు రిపీటెడ్ అబార్షన్లు కావడంతో తీవ్ర మనోవేదనకు లోనయ్యా. చివరికి డాక్టర్లు ఐవిఎఫ్ ట్రీట్మెంట్‌కు వెళ్లమని సలహా ఇచ్చారు. కొన్ని రోజులు తీసుకున్న తరువాత, నా వల్ల కాకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకొని ఒక పాపను దత్తత తీసుకోవాలని అనుకున్నాం. ఈ విషయం ఇప్పటి వరకు బయటి ప్రపంచానికి తెలియదు. ఈ విషయాన్ని మీతోనే పంచుకుంటున్నాను. దత్తతలో కూడా కుల,మత, ప్రాంత పట్టింపు లేకుండా ఆలోచించాం.

అందరికంటే భిన్నంగా ఉండాలనుకునే నేను గైనకాలజీలో, యూరాలజీలో రోబోటిక్ సర్జరీలు చేయడం మొదలుపెట్టాను. వాటిలో సక్సెస్ రేట్ తక్కువగా ఉండంతో చాలా మంది నన్ను నిరుత్సాహ పరిచారు. కాని ఏదో సాధించాలనే తపనతో ఈఎన్‌టీలో రోబోటిక్ సర్జరీ చేయడాన్ని ప్రాక్టీస్ చేసాను. దీనిలో మరింత అనుభవం సాధించడానికి ఇండియాలో ఎవరూ అనుభవజ్ఞులు లేకపోవడంతో, దానిలో నైపుణ్యం ఉన్న వారు శాన్ ఫ్రాన్సిస్కో, దక్షిణ కొరియాలోని సియోల్ ఉండడంతో అక్కడి వెళ్లమని చాలా మంది సూచించారు. చివరికి దగ్గరగా ఉన్న సియోల్‌ను ఎంచుకున్నాను. కాని అక్కడికి వెళ్లిన తరువాత అక్కడి వారికి ఇంగ్లీష్ రాకపోవడంతో భాష సమస్యగా మారింది. అక్కడ ఒక హోటల్ రూమ్ తీసుకొని, పాపను తీసుకువెళ్లాను. శిక్షణకు వెళ్లేటప్పుడు పాపను హోటల్‌లో ఉంచి, భోజనం పెట్టి వెళ్లేదానిని.

నా ఫస్ట్ రోబోటిక్ సర్జరీను ఒక పంది మీద చేసాను. కాని కోర్సు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నా. ఆ సమయంలో అక్కడ గనుక రోబోటిక్ సర్జరీలో డిగ్రీ సంపాదించి వస్తే, అపోలో యాజమాన్యం కోర్సు ఫీజులో యాభై శాతం చెల్లిస్తామని ఒక బంఫర్ ఆఫర్ ఇచ్చారు. దాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకొని కోర్సును విజయవంతంగా పూర్తి చేసి స్వదేశానికి వచ్చాను. అపోలోలో మంచి స్వాగతం లభించింది. వెంటనే ఇక్కడ విజయవంతంగా ఒక శస్త్రచికిత్స చేశాను. మూడు నెలల సమయంలో చాలా కేసులు వచ్చాయి. దానికి అపోలో ఛైర్మన్ నన్ను పిలిచి గోవాలో సన్మానించారు. దేశంలో మొదటి రోబోటిక్ చికిత్స చేసిన మహిళగా కీర్తించారు.

మొదటి చికిత్స లైబీరియా దేశానికి చెందిన ఒక లాయర్‌కి చేయాల్సిరావడంతో కొంత ఉద్వేగానికి గురయ్యాను. రోబోటిక్ సర్జరీ మొదట గురకతో బాధపడే వారికి విజయవంతంగా చేశాను. ఆ తర్వాత థైరాయిడ్‌తో బాధపడేవారికి మొదలుపెట్టాను. నేను విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన వారిలో మొజాంబిక్ మాజీ అధ్యక్షుడు ఉండడం గర్వకారణం. ఇప్పటి వరకు 57 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించాను. అవార్డులు, రివార్డుల కన్నా పేషెంట్ల సంతృప్తే ముఖ్యం. రోబోటిక్ సర్జరీల పట్ల మనదేశంలో చాలా వరకు అవగాహన లేదు. సరియైన అవగాహన కల్పిస్తే, చాలా మంది ముందుకు వస్తారు. నా గురించి నేను మార్కెటింగ్ చేసుకోవడం ఇష్టం లేదు.

నాది లవ్ మ్యారేజ్, ఉస్మానియాలో ఎంబిబీఎస్ చేస్తున్నప్పుడు పరిచయం ఏర్పడింది. మా వారి నాన్న ఆర్మీలో హైదరాబాద్‌లో పనిచేసేవారు. నేను ఎంబిబీఎస్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు నాకు ప్రపోజ్ చేసారు. ఇప్పుడు ఫేమస్ సైక్రియాటిస్ట్ అయిన జితేందర్ నాగపాల్ నా జీవితంలో ఇంత ఎత్తుకు ఎదగడానికి అన్ని విధాలుగా సహకరించారు. మహిళలు ప్రతి చిన్న విషయాలకూ కుంగిపోకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను పాజిటివ్‌గా తీసుకొని, ఎటువంటి ఒత్తిళ్లకు గురి కాకుండా బ్యాలెన్స్ చేసుకొని విజయం సాధించాలి.

కొమ్మాలపాటి సాయిసుధ

మన తెలంగాణ కరస్పాండెంట్- ఢిల్లీ

రాత్రి విధులు.. కేన్సర్ ముప్పు

రాత్రి సమయంలో విధులు నిర్వహించే మహిళలకు కేన్సర్ ముప్పు అధికమని తాజా అధ్యయనంలో తెలిసింది. ఎక్కువ కాలం రాత్రి పూట ఉద్యోగం చేసే స్త్రీలు కేన్సర్ బారిన పడే అవకాశం ఉందని చైనాలోని సించువాన్ యూనివర్సిటీ చేపట్టిన అధ్యయనంలో వెల్లడయింది. ఉత్తర అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఆసియా ఖండాలకు చెందిన 39,09,152 మంది మహిళలపై అధ్యయనం చేపట్టగా, వీరిలో 1,14,628 మంది కేన్సర్ రోగులు ఉన్నట్లు కనుగొన్నారు. సుదీర్ఘకాలం రాత్రిపూట విధులు నిర్వర్తించడం వల్ల కలిగే చెడు ప్రభావాలపై ఇంకా అధ్యయనాలు కొనసాగుతున్నాయి. మిగతావారితో పోలిస్తే రాత్రి కొలువులు చేసే మహిళల్లో కేన్సర్ ముప్పు 19 శాతం అధికంగా ఉన్నట్లు తెలిసింది. వారిలో అధికంగా 41శాతం మంది చర్మ కేన్సర్‌తో బాధపడుతున్నారు. 32శాతం మందిలో రొమ్ము కేన్సర్, 18 శాతం మందిలో జీర్ణాశయ కేన్సర్ ముప్పును ఎదుర్కొంటున్నట్లు తేలింది. రొమ్ము కేన్సర్ ముప్పు మాత్రం ఉత్తర అమెరికా, ఐరోపాల్లో ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు. నిరాటంకంగా రాత్రుల్లు ఉద్యోగం చేసే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ముప్పు 3.3 శాతం అధికమంటున్నారు. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక ప్రకారం అమెరికాలోని 15 మిలియన్ల మంది ఉద్యోగుల పనివేళలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రాత్రిపూట పనుల వల్ల జీవక్రియల్లో తీవ్ర మార్పులు జరుగుతుంటాయి. ఇందువల్ల శరీరంలోని మానసిక, భౌతిక ప్రక్రియలను ఇరవైనాలుగ్గంటలూ నియంత్రించి, ప్రధానంగా వాతావరణంలోని చీకటి వెలుగులకు అనుగుణంగా ప్రతిస్పందిస్తుంది. అంతేకాకుండా ఊబకాయం, గుండెజబ్బులు, కొన్ని రకాల కేన్సర్లు వచ్చే అవకాశం అధికంగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.



నెలసరి పొత్తికడుపు నొప్పా..!

చాలా మంది మహిళలు నెలసరి సమయంలో కడుపునొప్పి, నడుం నొప్పితో బాధపడుతుంటారు. నాలుగు రోజుల పాటు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటారు. నెలసరి వచ్చినప్పుడు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరోన్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. ఫలితంగా కడుపునొప్పి, చీటికీమాటికీ కోపం రావడం, చికాకు లాంటి లక్షణాలు అధికంగా ఉంటాయి. హార్మోన్ల మార్పుల కారణంగా మూడ్ వెంటవెంటనే మారుతుంటుంది. పీరియడ్స్ మొదలైన 24 గంటల్లో నొప్పి ఎక్కువగా ఉండి ఆ తర్వాత క్రమంగా తగ్గుతుంది. అలాంటివారు ఈ కింది చిట్కాలు పాటిస్తే కొంత ఉపశమనం కలగవచ్చు.



* పీరియడ్స్ రావడానికి నాలుగు రోజుల ముందు బొప్పాయి పండు తినాలి. వీటిలో యాంటీ ఇన్ ఫ్లేమటరీ గుణాలుంటాయి. ఐరన్, కాల్షియంతోపాటు విటమిన్లు ఎ, సిలు ఉంటాయి. ఇవి సంకోచించిన పొత్తికడుపు కండరాలను తిరిగి సాధారణ స్థాయికి తెస్తాయి.
* తులసి ఆకుల్ని కప్పు నీటిలో కలిపి వేడిచేయాలి. తర్వాత దాన్ని చల్లార్చి కొద్దికొద్దిగా రెండు మూడు గంటలకోసారి తాగాలి.
* అల్లం తురుమును కప్పు నీటిలో కలిపి ఐదు నిముషాల పాటు మరిగించాలి. తర్వాత దాన్ని వడగట్టి తగినంత నిమ్మరసం , తేనె కలపాలి. నెలసరి సమయంలో రోజుకు రెండు మూడు సార్లు తాగాలి. ఇలా చేయడం వల్ల నొప్పి తగ్గుతుంది.

లైఫ్‌స్టైల్ @



సిసింద్రీ

చాలాకాలం తరువాత మాకు బాగా తెలిసిన ఓ పెద్దమనిషి ఆ రోజు మా ఇంటికి వచ్చాడు భార్యతో సహా.... ఒకప్పుడు వాళ్లూ, మేమూ ఇరుగుపొరుగు ఇళ్లలో ఉండేవాళ్లం.. నా పెళ్లి అయి కొత్తగా కాపురానికి వెళ్లానేమో వాళ్లిద్దరూ కూడా నన్నెంతో ఆప్యాయంగా సొంత చెల్లెల్లా చూసుకునేవాళ్లు. ఆవిడ రోజూ తాను చేసిన వంటలు మాకు పంపిస్తుండేది.. ఆ తరువాత మేము స్వంత ఇల్లు కొనుక్కుని వచ్చేశాము.

అప్పుడు గృహప్రవేశానికి వచ్చారు... మళ్లీ మూడేళ్లకి ఇవాళ వచ్చారు. వస్తూనే బాగున్నావా! పద్మా ...అంటూ ఆప్యాయంగా పలకరించి, మీ ఆయన బాగున్నాడా? పాపెలా ఉంది? స్కూల్లో వేశారా? మళ్లీ సెకెండ్ ఇష్యూలేదా? అంటూ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసిందావిడ నాతో పాటు వంటగదిలో దూరి. ఆవిడ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెబుతూ, శెనగపిండి డబ్బా, ఉప్పు, కారం అలమరలోంచి తీసాను. ఆవిడ వాళ్ల పిల్లల కబుర్లు, వాళ్లాయన వాలంటరి రిటైర్మెంటు తీసుకున్న సంగతి, వాళ్లమ్మాయి పురుడుకి తాను అమెరికా వెళ్లాల్సి రావచ్చేమో అన్న ఆశనీ వ్యక్తం చేస్తూ, ఆపకుండా ఆ కబురూ, ఆ కబురూ చెప్తూనే ఉంది.

ఆయన మాత్రం హాల్లో సోఫాలో సెటిల్ అయి, తెలుగు ఛానెల్‌లో ఆపకుండా ఏకధాటిగా ప్రసారం అవుతోన్న సీరియల్స్ అన్నీ ఎంతో శ్రద్ధగా చూస్తున్నాడు... నేను ఆవిడ కబుర్లు వింటూ, పాలకూర పకోడీ చేసి, ప్లేట్లలో పెట్టుకుని ఆవిడతో కూడా హాల్లోకి నడిచాను...ఆయన పకోడి అందుకుని తింటూ మీ టివి చాలా బాగుందమ్మా అంటూ టివిని, ఆ తరువాత నన్ను, నా సహనాన్ని, నా మంచితనాన్ని తెగ మెచ్చుకుంటూ మాట్లాడాడు.. "మీ పాప బాగా చదువుతోందా?" అడిగిందావిడ.

"చదువుతోందండి" అన్నాను. "టివి చూడనివ్వకు మా ఇంటి పక్క వాళ్లమ్మాయి పొద్దస్తమానం టివి చూస్తూ సరిగా చదవదు. రోజూ మాకు ఆవిడ తిట్లు , ఆయన సర్దుబాట్లు వినిపిస్తూ ఉంటాయి. ఆ పిల్లకి సినిమాలు, టివిలో వచ్చే డ్యాన్సు ప్రొగ్రామ్‌లు, సినిమా పాటల ప్రొగ్రామ్‌లు... అదే గోల" అందావిడ.

లేదండి మా పాప ఎప్పుడన్నా ఒకసారి టివి చూస్తుంది. అది కూడా ఆదివారాలు, సెలవు రోజులు మాత్రమే.. పిచ్చి, పిచ్చి డ్యాన్సులు, పాటలు అసలు లేవు.. చాలా డిసిప్లిన్‌డ్ కొంచెం గర్వంగా చెప్పాను..ఆయన పకోడీలు తిన్నంత సేపూ కబుర్లు చెప్పి, తిరిగి టివి సీరియల్ చూడ్డంలో మునిగిపోయాడు. మీ వారికి సీరియల్స్ అంటే ఆసక్తి బాగా ఉన్నట్టుంది అన్నాను నవ్వుతూ..వట్టి ఆసక్తి కాదు.. పిచ్చి, పిచ్చి ఉంది.. అసలు ఆయన వాలంటరీ రిటైర్మెంట్ ఎందుకు తీసుకున్నారనుకుంటున్నావు.. ఈ సీరియల్స్ చూడ్డానికి టైమ్ సరిపోడంలేదని... అంటూ నవ్విందావిడ. నేనూ నవ్వాను...కాఫీలు కూడా అయ్యేసరికి మూడున్నర దాటింది. ఇంక వెళ్తాం అంటున్న ఆవిడతో పాప వచ్చే టైం అయింది ఉండండి పాపని చూసి వెళ్దురుగాని అని నేను అంటుండగానే మా సిసింద్రీ వచ్చినట్టుగా బైట ఆటో ఆగింది. సిసింద్రీ భుజాన ఐదుకిలోల బరువున్న బ్యాగుతో లోపలికి వచ్చింది. బుట్టబొమ్మలాంటి నా కూతురుని వాళ్లకి మురిపెంగా చూపిస్తూ ఇదిగో నా బంగారు అన్నాను. దాన్ని దగ్గరకు తీసుకుని భుజాన ఉన్న బ్యాగు తీసి పక్కన పెడుతూ. "ఏం సిసింద్రీ బాగున్నావా? నన్ను గుర్తుపట్టలేదుగా.... నీ చిన్నప్పుడు మీ అమ్మావాళ్లు మా ఇంట్లోనే అద్దెకుండేవారు... ఇలారా... బాగా చదువుతున్నావా?" దాన్ని పిలిచి తన పక్కనే కూర్చోబెట్టుకుని కబుర్లు మొదలుపెట్టాడాయన దానినోట్లో మధ్య, మధ్య పకోడి కుక్కుతూ...

"ఏం చదువుతున్నావు?" అడిగిందావిడ

"యుకెజి ఆంటీ.." అన్నది సిసింద్రీ...

"అలాగా... అంటే మంచి ఇంగ్లీషు రెయిమ్స్ అవీ వచ్చునమాట... ఇంగ్లీషు మీడియం కదా అని తెలుగు నేర్చుకోకుండా వదలకు. క్యాలికులేటర్ లెక్కలు కాకుండా చక్కగా పుస్తకంలో లెక్కలు నేర్చుకో.." దానికి హితబోధ చేసిందావిడ. అది అమాయకంగా తలూపింది. "బంగారు కొండ బుద్ధిగా తలూపింది.." అంటూ "నీకు సంగీతం వచ్చా..." అడిగింది. "ఓ డ్యాన్స్ కూడా" అంది మా సిసింద్రీ. "అబ్బో అలాగా ఏదీ ఓ పాట పాడుతూ డ్యాన్స్ చేయి.." ఆశ్చర్యంగా చూస్తూ అడిగిందావిడ. అది ఆవిడ ఒళ్లోంచి గభాల్న గెంతి నడుము, చేతులూ, కాళ్లు తెగ తిప్పేస్తూ పూనకం వచ్చిందానిలా ఊగుతూ "హే పిల్లగాడా, ఏందిరో పిల్లగాడా, నా గుండెకాడ లొల్లి, హే మొనగాడా, సంపకోయి మొరటోడా...." నెత్తుటి చుక్క లేనట్టు నా మొహం పాలిపోడంతో గబుక్కున సోఫాలోంచి లేచి సిసింద్రీ రెక్కపుచ్చుకుని రా, కాళ్లు, చేతులు కడుక్కుందువుగాని అంటూ లోపలికి లాక్కెళ్లాను.

అత్తలూరి విజయలక్ష్మి

99512 50144

శ్రీనివాస్ హత్యపై సిబిఐ విచారణకు హైకోర్టులో పిటిషన్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై సిబిఐచే విచారణ జరిపించాలని కోరుతూ హతుడి భార్య నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక పోలీసులు ఈ కేసు దర్యాప్తును నీరుగారుస్తున్నారని, నిజాలను తారుమారు చేస్తున్నారని, ఇందులో ప్రభుత్వ హస్తం ఉందని ఆ పిటిషన్‌లో లక్ష్మి పేర్కొన్నారు. నిజానిజాలు బయటికి రావాలంటే సిబిఐ దర్యాప్తు చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరారు. పిటిష న్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నల్లగొండ ఎస్‌పిని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అయితే ఈ కేసులో నిందితుల్ని మీడియా ఎదుట హాజరు పర్చడంపై హైకోర్టు న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎవరు నిందితుల్లో ఎవరు పోలీ సులకు కూడా తెలియడం లేదని న్యాయ మూర్తి వ్యాఖ్యానించారు. తొలుత కేసును లంచ్‌మోషన్ రూపం లో విచారణ చేయాలని ఆమె లాయర్ కోరారు. పోలీసుల విచారణలో నిజాయతీ కనబడటం లేద ని, ప్రభుత్వ ఒత్తిళ్లు ఉంటాయని చెప్పడానికి ఘటన జరిగిన రోజు నాటి పరిణామాలే నిదర్శమన్నారు.



కాళేశ్వరానికి రూ. 5980 కోట్ల రుణం

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం బ్యాంకుల కన్సార్టియం నుంచి ప్రభుత్వం తాజాగా రూ.5,980 కోట్ల రుణం తీసుకుంది. ఇందులో విజయబ్యాంకు వాటా రూ. 2,150 కోట్లు. కాళేశ్వరం కార్పోరేషన్ రుణం తీసుకోవడం ఇది మూడోసారి. తొలి దశలో ఆంధ్రా బ్యాంకు ఆధ్వర్యంలోని జాతీయ బ్యాంకుల కన్సార్టియం రూ.7,400 కోట్లు రుణం ఇవ్వగా, రెండో దశలో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలోని కన్సార్టియం రూ.11,400 కోట్లు రుణం మంజూరు చేసింది. మూడు దశల్లో మొత్తంగా రూ.24,780 కోట్లను కాళేశ్వరం కార్పోరేషన్ ద్వారా రుణం లభించింది.

పాల్వంచ ప్లాంట్‌పై సిఎం హర్షం

మన తెలంగాణ/హైదరాబాద్: కెటిపిఎస్ (పాల్వంచ) 7వ దశ నిర్మాణంలో భాగంగా బాయిలర్‌ను వెలిగించి, ట్రయల్‌రన్ ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. సిఎం బుధవారం ఉదయం ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావుకు పోన్ చేసి అభినందనలు తెలిపారు. పారదర్శకత, పనుల్లో వేగం సాధించాలనే లక్ష్యాలతో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించామని, ఈ లక్ష్యం నెరవేరుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో నిర్మిస్తున్న కెటిపిఎస్‌ను స్ఫూర్తిగా తీసుకొని భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు.

కొత్త సిఎస్ ఎస్‌కె జోషి

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన అవకాశానికి కృతజ్ఞతలు తెలిపిన జోషి ప్రభుత్వ ఆదేశాలకను అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తానని, సిఎస్‌గా పదవీ విరమణ చేస్తున్న ఎస్‌పి సింగ్ కృషికి తన బాధ్యతలు కొనసాగింపుగా ఉంటాయని అన్నారు. ఎస్‌పి సింగ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కెసిఆర్ తనకు అప్పజెప్పిన బాధ్యతలను ఇంతకాలం సంతృప్తిగా నిర్వర్తించానని, ఇకపైన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జోషి సమర్ధవంతంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి సిఎస్‌గా పనిచేయడం తన అదృష్టమని, రాష్ట్రాభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రికి చాలా స్పష్టమైన, లోతైన అవగాహన ఉన్నదని, రాష్ట్ర పునర్నిర్మాణంలో అధికారుల, సిబ్బంది స్ఫూర్తి ఇదే తరహాలో ఉండాలని కోరారు. బంగారు తెలంగాణ కార్యాచరణలో భాగంగా యావత్తు ప్రభుత్వ సిబ్బంది భాగస్వాములై అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంగా అమలుచేయాలని కోరారు. రానున్న మూడేళ్ళు చాలా సవాళ్ళతో కూడుకున్న కాలమని అన్నారు. మెట్రో రైల్, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగురోడు ఇలా అనేక అంశాల్లో తెలంగాణ తనదైన గుర్తింపు తెచ్చుకున్నదని, కేంద్ర అధికారులే రాష్ట్ర అభివృద్ధికి ముగ్ధులయ్యారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులు వారి బలాన్ని గుర్తించాలని, మానసిక ధైర్యమే ముందుకు నడిపిస్తుందని అన్నారు. నూతన సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కె జోషికి అన్ని విభాగాల కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం సాగునీటిపారుదల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా చూస్తున్న బాధ్యతలు ఇక పైన కూడా జోషి చూస్తారని, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాజేశ్వర్ తివారి అదనంగా భూ పరిపాలనా విభాగం ముఖ్య కమిషనర్ బాధ్యతలను కూడా చూస్తారని, ముఖ్యమంత్రి కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్ అదనంగా పంచాయతీరాజ్, గ్రామీణ త్రాగునీటి పథకం విభాగాల బాధ్యతలను కూడా చూస్తారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

ఖాతాలకు వాత

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాదారులు పెద్ద ఎత్తున తమ పాస్‌బుక్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌లను తీసుకుని బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకు విజిలెన్స్ విభాగం అధికారులతో పాటు ఉన్నతాధికారులు బ్యాంకుకు చేరుకుని బుధవారం ఖాతాదారుల పాస్‌బుక్‌లు, బాండ్‌లు పరిశీలించి ఎంత డబ్బు మాయం అయిందో రికార్డులు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వందకు పైగా ఖాతాలలో నుంచి పది కోట్ల రూపాయల వరకు మాయం అయినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. గురువారం సైతం విచారణ కొనసాగనుంది. బ్యాంకులో పనిచేసిన ఉద్యోగితో పాటు ఇతరుల ప్రమేయం ఉండే అవకాశాలున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఒక్క క్యాషియర్‌పై నేపం నెట్టి ఉన్నతాధికారులు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్న ఇంత పెద్ద ఘరానా మోసం జరగడం వెనక బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బ్యాంకులపై ప్రజలలో ఉన్న నమ్మకంను పూర్తిగా నాశనం చేశారని స్థానికులు మండిపడుతు తమ డబ్బులు తమకు ఇచ్చివేయాలని మిగత ఖాతాదారులు సైతం బ్యాంకుకు చేరుకుంటున్నారు. మండల పరిధిలోని ఆరు గ్రామాల నుంచి దాదాపు 5 వేలకు పైగా ఖాతాలు బ్యాంకులో ఉండటంతో ఎక్కడ చూసిన ఇదే చర్చ కొనసాగుతుంది. కూతురు పెళ్లి కోసం భూమి అమ్మి బ్యాంకులో డబ్బులు జమ చేశానని వచ్చే నెలలో పెళ్లి ఉందని తమ డబ్బులు 20లక్షలు తమకు ఇవ్వకపోతే అంతా కలసి చస్తామని మహిళ కన్నీళ్ల పర్యంతమైనారు. బ్యాంకు అధికారులు మాత్రం అందరికీ న్యాయం చేస్తామని చెప్తుతున్నారు. మొయినాబాద్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భత్యాల పెంపు జిఓ జారీ

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతోంది. దీంతో హోంగార్డులకు నెలసరి గౌరవ వేతనం రూ.20,250 అందనుంది. ఇకపై ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి హోంగార్డులకు రూ.1000 చొప్పున పెంపు జరగనుంది. దీంతో పాటు రెండు పడక గదుల ఇళ్లు, ఆరోగ్య బీమా సదుపాయం కూడా వారికి లభించనుంది. ట్రాఫిక్ విధులు నిర్వర్తించే హోంగార్డులకు పోలీసుల తరహాలో గౌరవ వేతనంపై 30 శాతం అదనంగా లభించనుంది. మహిళా హోంగార్డులకు 6 నెలల ప్రసూతి సెలవులు, పురుష హోంగార్డులకు 15 రోజులు పితృత్వపు సెలవులిస్తారు.

కొలువులు ఖాయమేనా?

(మొదటిపేజీ తరువాయి)

అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంపై పన్నుల విరామాన్ని ఈ బడ్జెట్ తొలగించే అవకాశం ఉంది. అ లాగే స్టాక్ మార్కెట్ పెట్టుబడుల ఆదాయం పై తిరిగి పన్నులు విధించే అవకాశం ఉంది. జిఎస్‌టి కింద కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ వంటి వర్గీకరణల ఆదాయాలు బడ్జెట్‌లో పేర్కొనవచ్చు. 2017 –18 తొలి 8నెలల్లో ద్రవ్యలోటు లక్ష్యం కంటే 112 శాతం ఎక్కువయింది. దీనితో ఆర్థిక పరిస్థితిపై భయాలు వ్యాపించాయి. ప్రభుత్వ కం పెనీల నుంచి డెవిడెండ్లు తగ్గడంతో ఇలా జరిగింది. హెచ్‌పిసిఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా పెట్టుబడులను అమ్మడం ద్వారా ఆ లోటును భర్తీ చేయడానికి జైట్లీ ప్రయత్నించవచ్చు.

కొత్త బడ్జెట్ వ్యవసాయ వ్యయం పెంచుతుందని, వ్యాపార రంగానికి పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందని మదుపరులు ఆశిస్తున్నారు. అస్తవ్యస్తంగా గత ఏడాది అమలైన సరకులు సేవల పన్ను (జిఎస్‌టి) వల్ల, పెద్ద నోట్లు హఠాత్తుగా రద్దు చే యడం వల్ల 2016 నుంచి ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ఆటుపోట్లకు గురైంది. దాని తరువాత 2017– 18 ఆర్థిక సంవత్సరంలో 6.75 శాతం వృద్ధి సా ధ్యమని అంచనాలు ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఆర్థి క వృద్ధి రేటు తిరిగి ఊపందుకోడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచే ఆలోచన కేంద్రానికి ఉంది. ద్ర వ్యలోటు అంచనాలు మించుతున్న సమయంలో ప్రభుత్వ వ్యయంపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

మళ్లీ అధికారంలోకి రాకపోతే
రాజకీయ సన్యాసం

- తెలంగాణ వెనుకబాటుకు కాంగ్రెస్ పాలనే కారణం
- గద్వాలలో మంత్రి కెటిఆర్ ఎన్నికల సమర శంఖారావం



మన తెలంగాణ/గద్వాల: వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రాకపోతే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సవాల్‌కు సిద్ధమా..? అంటూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారాక రామారావు సవాల్ విసిరారు. బుధవారం తొలిసారి మంత్రి కెటిఆర్ జోగుళాంబ గద్వాల జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా గద్వాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. శాసనసభ ఎన్నికలకు ఇంకా 20 నెలలు సమయం ఉందని, పౌరుషం కలిగిన నడిగడ్డ గద్వాల నుంచి ఎన్నికల శంఖారావాన్ని మొదలు పెడుతున్నట్లు చెప్పారు. ఇక్కడి నుంచి మొదలైన టిఆర్‌ఎస్ పార్టీ జైత్రయాత్ర తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. గడిచిన 50ఏళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిందేమి లేదని ముఖ్యంగా ఇక్కడి నిధులు, నీళ్లను దోచుకెల్లి ఉమ్మడి పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చారని నిప్పులు చెరిగారు. 50ఏళ్ల కాలంలో తెలంగాణ ప్రాంతం అన్ని రంగాల్లో వెనకకు నెట్టివేయబడిందని దీనికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీ నేతలే అని ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లాలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటూ ఫ్లోరైడ్ బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పాపం కూడా కాంగ్రెస్ పార్టీ నేతలదే అని ఆరోపణలు గుప్పించారు. నాటి ప్రధామంత్రి నెహ్రూమొదలుకుని ఇంధిరాగాంధీ, తరువాత సోనియా, రాహుల్‌గాంధీ వరకు తెలంగాణకు మోసం చేసినవాళ్లేనంటూ విమర్శలు గుప్పించారు. 'కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉత్తంకుమార్‌రెడ్డి అధికారంలోకి రావాలని గడ్డాలు పెంచుకుని తిరుగుతున్నాడు. గడ్డాలు పెంచితే అధికారంలోకి వస్తారా? అందరూ గబ్బర్‌సిం గ్‌లు అయిపోతారా?' గతంలో తాను హైదారాబాద్ బల్దియా, ఖమ్మం పాల్వంచలో జరిగిన ఎన్నికల్లో సవాల్ చేస్తే ఇదే ఉత్తంకుమార్‌రెడ్డి తన సవాల్‌ను స్వీకరించేందుకు బెదిరి పారిపోయడని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు వివిధ రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లికృష్ణారావు, లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు క్షమాభిక్ష

(మొదటిపేజీ తరువాయి)

వినయ్‌కుమార్ సింగ్ తెలిపారు. అర్హులైన ఖైదీలకు గుర్తించి నెలరోజుల్లో క్షమాభిక్షపై విడుదల చేసే అవకాశాలున్నాయని తెలిపారు. జైళ్ల శాఖ ఐజి ఆకుల నర్సింహా, డిఐజి సైదయ్యతో కలిసి ఆయన బుధవారం చర్లపల్లి జైలును సందర్శించి పిడి యాక్ట్ కింద శిక్షలను అనుభవిస్తున్న విచారణ ఖైదీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సిటిజన్ ఫోరమ్‌ను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్నట్లు ఆయన తెలిపారు. హరితహారం, స్వచ్ఛ తెలంగాణ, నేర రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామన్నారు. యాచకులకు చర్లపల్లి జైలులో మానిసిక ఉల్లాసానికి, ఆటలు నిర్వహిస్తున్నామని, విద్యను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని జైళ్లను ఆధునికీకరించేందుకు ప్రతి ఏటా రూ.15 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తామన్నారు. చర్లపల్లి సెంట్రల్ జైలు ఆనంద ఆశ్రమంలో ఉన్న 50 మంది మహిళా యాచకులను స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. తిరిగి యాచక వృత్తి చేయబోమని వారితో లిఖితపూర్వకంగా హామీ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎంఆర్ భాస్కర్, వ్యవసాయ క్షేత్రం జైలు సూపరింటెండెంట్ అర్జున్‌రావు, జైలర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి టిఆర్‌టి

(మొదటిపేజీ తరువాయి)

మిగిలినవి ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి ఒక ప్రకటనలో పేర్కొంది. తెలుగు, ఇంగ్లీష్ మీడియంల సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు, తెలుగు మీడియం జీవశాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒఎంఆర్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. మిగతా అన్ని రకాల ఉపాధ్యాయ పోస్టులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు మొత్తం ఏడు జిల్లాల్లో కేంద్రాలను నెలకొల్పింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల (తెలుగు మాధ్యమం)కు అభ్యర్థుల విస్తృత సంఖ్యలో పోటీపడే అవకాశం ఉన్నందువల్ల పది జిల్లాల్లోనూ పరీక్షా కేంద్రాలు ఉండవచ్చని వివరించింది.

నియామక పోస్టు	సబ్జెక్ట్	మాధ్యమం	పరీక్ష తేదీ	పరీక్షా కేంద్రాలు
లాంగ్వేజ్ పండిట్	తెలుగు		24/02/2018	హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్, కరీంగనర్, నల్గొండ, ఖమ్మం
స్కూల్ అసిస్టెంట్	తెలుగు		24/02/2018	హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్, కరీంగనర్, నల్గొండ, ఖమ్మం
స్కూల్ అసిస్టెంట్	ఇంగ్లీష్		26/02/2018	హైదరాబాద్
స్కూల్ అసిస్టెంట్	గణితం, సాంఘిక శాస్త్రం	ఇంగ్లీష్	26/02/2018	హైదరాబాద్
స్కూల్ అసిస్టెంట్	ఫిజికల్ సైన్స్	తెలుగు,ఉర్దూ, హిందీ, మరాఠీ, తమిళ్	27/02/2018	హైదరాబాద్
లాంగ్వేజ్ పండిట్	ఉర్దూ, మరాఠీ, హిందీ		27/02/2018	హైదరాబాద్
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	తెలుగు,ఉర్దూ హిందీ, మరాఠీ, తమిళ్		28/02/2018	హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్, కరీంగనర్, నల్గొండ, ఖమ్మం
స్కూల్ అసిస్టెంట్	హిందీ, కన్నడ, తమిళ్, ఉర్దూ		28/02/2018	హైదరాబాద్
ఎస్‌జిటి	బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ,తమిళ్		02/03/2018	హైదరాబాద్
స్కూల్ అసిస్టెంట్ స్కూల్ అసిస్టెంట్	ఫిజికల్ ఎడ్యుకేషన్ జీవశాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రం	(ఉర్దూ, మరాఠీ, కన్నడ, హిందీ, తమిళం)	02/03/2018 03/03/2018	హైదరాబాద్ హైదరాబాద్
స్కూల్ అసిస్టెంట్	ఫిజికల్ సైన్స్	ఇంగ్లీష్	04/03/2018	హైదరాబాద్
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	ఇంగ్లీష్		04/03/2018	హైదరాబాద్
ఒఎంఆర్ విధానంలో నిర్వహించే పరీక్షలు				
ఎస్‌జిటి ఎస్‌జిటి స్కూల్ అసిస్టెంట్స్	 జీవశాస్త్రం, గణితం సాంఘిక శాస్త్రం	తెలుగు ఇంగ్లీష్ తెలుగు	25/02/2018 25/02/2018 04/03/2018	హెచ్ఎండిఎ పరిధి హెచ్ఎండిఎ పరిధి హైదరాబాద్

తరలివచ్చిన సారలమ్మ

(మొదటిపేజీ తరువాయి)

ముందర అందంగా అలుకులు వేసుకొని ముగ్గులు వేసుకున్నారు. గుడిలో పూజా తంతు నిర్వహిస్తుండగా కన్నెపల్లి గూడెం మొత్తం అక్కడికి చేరుకున్నది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, సంతానం లేనివారు, వివాహాలు కానివారు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తడిబట్ట స్నానాలు చేసి ఆలయం ముందు వరంపట్టారు. గుడి నుంచి తల్లి బయటకు వస్తుండగా దారి పొడవునా అడ్డంగా పడుకున్నారు. సారలమ్మ కాలిధూళి తాకినా తమ కష్టాలు తీరుతాయనే ప్రగాఢ నమ్మకం, విశ్వాసంతో భక్తులు తల్లికి ఎదురువెళ్లి అడ్డంగా పడుకోవడంతో వారిని తొక్కుకుంటూ ముందుకుసాగింది. తమ ఇంటి ఆడబిడ్డను తల్లి చెంతకు తరలిస్తుంగా కన్నెపల్లి గ్రామం పొడువునా ఇంటింటికి స్వాగతం పలుగుతూ దీపాలతో హారతులు పడుతూ, నీళ్లు ఆరబోస్తూ మేడారం గ్రామానికి సాగనంపారు. కన్నెపల్లి గ్రామం నుంచి దారి పొడవునా జయ జయ ధ్వానాలతో జైసారక్క.. జైజై సారక్క తల్లి అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. తల్లి సారమ్మ మమ్ములను సల్లంగచూడమ్మ అంటూ మేడారంలోని తల్లిచెంతకు పంపించారు. దారి పొడవునా భక్తులకు దీవెనెలు ఇస్తూ మార్గ మధ్యలో ఉన్న తమ్ముడు జంపన్నను ముద్దాడుతూ కుశల ప్రశ్నలు వేసింది. అక్క తమ్ముల పలుకరింపు అందరినిక మంత్ర ముగ్ధులను చేసింది. సాయంత్రం పొద్దుపోయిన తర్వాత కన్నెపల్లి నుంచి బయలు దేరిన సారలమ్మ అర్ధరాత్రి మేడారంలోని గద్దెలపైకి చేరుకుంది. గతంలో ప్రతిసారి సాయంత్రం ఐదున్నర, ఆరుగంటలకే కన్నెపల్లి గ్రామం నుంచి బయలుదేరి వచ్చే సారలమ్మ ఈసారి ఆలస్యంగా బయలుదేరింది. అధికారులు, ప్రజాప్రతినిధుల పూజారులతో కొంత నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. సారలమ్మ గద్దెపైకి చేరుకునే సమాయానికే కొత్తగూడ మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజును గద్దెపైకి తీసుకొచ్చారు. అదేవిధం గా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రా మం నుంచి గోవిందరాజును గద్దెపైకి తీసుకొచ్చా రు. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు సమ్మక్క రాక కోసం ఎదురు చూస్తున్నారు.

నేడు సమ్మక్క ఆగమనం..

మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ప్రధాన ఘట్టం మరికొద్ది గంటలలో ఆవిష్కృతం కాబోతున్నది. గురువారం మా ఘశుద్ధ పౌర్ణమి రోజున ఆదివాసీ పూజారులు గిరిజన సంప్రదాయాలతో తల్లిని తీసుకరాకబోతున్నారు. మేడారం గ్రామానికి తూర్పు దిక్కున ఉన్న చిలకలగుట్టపైన ఉన్న నమిలినార చెట్టు వద్ద తల్లికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రధాన వడ్డేలు కొక్కెర కృష్ణయ్య, సిద్ధబోయిన మునీందర్‌లు గుట్టపై నుంచి తీసుకొస్తుండగా మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్, జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు అధికార లాంఛనాలతో తల్లిని తోడ్కొని గద్దెలపై వస్తారు. తల్లి రాకను తెలియజేస్తూ జిల్లా ఎస్‌పి గాల్లోకి కాల్పులు జరుపుతారు.

వలసలకు ప్రాతిపదిక ప్రతిభే

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు అంశాలను ప్రతిపాదించారు. మొదటిది –చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వారి తల్లిదండ్రుల ద్వారా సరైన పత్రాలు లేకుండా అమెరికాలోకి అడుగుపెట్టిన 10 లక్షల 80 వేల మందికి పౌరసత్వం కల్పించడం. రెండోది– సరిహద్దు భద్రత కల్పించి దేశంలోకి అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు అమెరికా దక్షిణంలో గోడను నిర్మించడం, మూడోది– వీసా లాటరీ కార్యక్రమాలను రద్దు చేయడం, నాలుగోది–కుటుంబాధారిత వలసలను పరిమితం చేయడం. ఇదే సమయంలో ఆయన అమెరికన్ల ప్రయోజనాల కోసం తనతో కలసి పనిచేయాలని డెమొక్రాట్లను కోరారు. 'వివిధ రంగు, తెగ, నేపథ్యం ఉన్న మన పౌరులను రక్షించేందుకుగాను డెమొక్రాట్, రిపబ్లికన్ పార్టీల సభ్యులకు తాను విశాల హృదయంతో చేతులు చాస్తున్నాను' అని అన్నారు. ఆయన 80 నిమిషాల పాటు ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడు ఏటా కాంగ్రెస్‌లోని ఉభయ సభలనద్దేశించి చేసే ప్రసంగాన్ని 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' అంటారు. తన ప్రతిపాదనలకు ఉభయపక్షాలు(రిపబ్లికన్లు, డెమొక్రాట్లు) మద్దతు ఇవ్వాలని ట్రంప్ కోరారు. 'తమ ప్రణాళిక కింద ప్రామాణిక విద్య, కష్టించి పనిచేసే తత్వం, మంచి నైతిక ప్రవర్తన ఉన్నవారికే అమెరికా పౌరసత్వం లభించేలా చూస్తాం' అన్నారు. ఏటా లాటరీ పద్ధతిలో ఏ దేశానికి చెందిన వారికైనా ఇచ్చే డైవర్సిటీ వీసాను 7 శాతంకు మించకుండా చూస్తామన్నారు. ఇప్పటికే గ్రీన్‌కార్డుల కోసం వేలాది మంది భారతీయ ఐటి ఉద్యోగులు క్యూకట్టారు. 18 దేశాలకు చెందిన వలసదారులు డైవర్సిటీ వీసాకు అర్హులు కారని తేల్చారు. ఆ దేశాలు– బంగ్లాదేశ్, బ్రెజిల్, కెనడా, చైనా, కొలంబియా, డొమినికన్ రిపబ్లిక్, ఎల్‌సాల్వడర్, హైతీ, భారత్, జమైకా, మెక్సికో, నైజీరియా, పాకిస్థాన్, పెరూ, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, ఇంగ్లాండ్, వియత్నాం. గొలుసుకట్టు వలసలు(చెయిన్ ఇమిగ్రేషన్)కు మంగళం పాడడంతో గ్రీన్‌కార్డుదారులు తమ కుటుంబ సభ్యులకు స్పాన్సర్ చేయడం అనేది కష్టంకానుంది. ఇటీవల కాలంలో న్యూయార్క్‌లో జరిగిన రెండు ఉగ్రదాడులు వీసా లాటరీ, గొలుసుకట్టు వలసల వల్లే సంభవమైందని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాలంతీరిన పాత వలస నియమాలను సంస్కరించాల్సిన తరుణం ఆసన్నమైంది. 21వ శతాబ్దానికి అనుగుణంగా అమెరికా వలస విధానాన్ని మార్చాల్సి ఉందన్నారు.

ఉత్తరకొరియాకు హెచ్చరిక: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఉభయసభల ప్రసంగంలో నిర్లక్ష్యంగా క్షిపణి కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఉత్తరకొరియాను హెచ్చరించారు. చేసిన తప్పునే పదేపదే చేస్తోందన్నారు.

మనసు విప్పిన నేతలు

(మొదటిపేజీ తరువాయి)

సత్యనారాయణ, బలరాం నాయక్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ జె.గీతారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దానం నాగేందర్, మర్రి శశిధర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ సంపత్‌కుమార్, మాజీ ఎంపిలు అంజన్ కుమార్ యాదవ్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డాక్టర్ మల్లు రవి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారి మనసులో మాటను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. పార్టీలో మీరు ఏమి ఆశిస్తున్నారు? అంటూ కుంటియా ఒక్కొక్కరిని సూటిగా ప్రశ్నించారు. అలాగే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలంటే ఏమి చేయాలి, ఎవరితో పొత్తులు పెట్టుకోవాలో చెప్పండంటూ సలహాలను కోరారు. అధిష్ఠానం ప్రతినిధే తమను ఒక్కరినే పిలిచి మాట్లాడుతుండడంతో నాయకులు వారి ఆకాంక్షలను, ఫిర్యాదులను నిర్మొహమాటంగా తెలియజేశారు. తమకు, తమ వారికి ఏ సీట్లు కావాలి, పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను వివరించారు. అంతే కాకుండా పిసిసి ఛీఫ్ మరింత చొరవగా వ్యవహరించాలని చెప్పినట్లు తెలిసింది. ఒకరిద్దరు మినహా ఎక్కువ మంది ఎన్నికలకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వెళ్ళడంపై అభ్యంతరం లేదన్నట్లు తెలిసింది. బుధవారం సుమారు 30 మంది నాయకులతో భేటీ అయిన కుంటియా గురువారం ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలతో ఇలాంటి సమావేశాలు నిర్వహించనున్నారు. ఇతర పార్టీల నుంచి వస్తున్న వారిని నేరుగా ఢిల్లీలో అధిష్టానం వద్ద పార్టీలో చేర్చుకోవడం పట్ల కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎవరినైనా చేర్చుకునే ముందు స్థానిక నాయకత్వంతో మాట్లాడాలని, వారిని ఒప్పించాలని సూచించారు. సస్పెండ్ అయిన వారు పార్టీలోకి వస్తామంటే వద్దనొద్దని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ సూచించినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గాల్లో అభ్యర్థులుగా మాదిగలకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని, ఎస్‌సి వర్గీకరణపై రాహుల్ గాం ధీ వద్దకు రాష్ట్ర ముఖ్య నేతలతో ప్రతినిధి బృం దాన్ని తీసుకెళ్ళాలని కుంటియాను కోరినట్లు సమాచారం. పోటీ చేసేవారు బస్సుయాత్రకు వద్దు: పార్టీ గెలిస్తే ఇచ్చే హామీలకు సంబంధించి ముందుగానే ప్రజల్లోకి వెళ్ళాలని ఒక సీనియర్ నేత సూచించినట్లు తెలిసింది. 'గత ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టో కమిటీ ఏర్పాటు ఆలస్యమైంది. ఈసారి చాలా ముందుగానే వేయాలి. ఈ కమిటీ ప్రజల్లో తిరగాలి. వారి సూచనలను తీసుకొని దాని ఆధారంగా మ్యానిఫెస్టో రూపొందించాల'ని చెప్పినట్లు సమాచారం. అభ్యర్థులపై త్వరగా నిర్ణయం జరిగితే, వారు నియోజకవర్గాల్లో పని చేసుకుంటారని, మిగతా నాయకులను బస్సు యాత్ర, ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని మరో నాయకుడు సూచించారు.

ప్రచార కమిటీలో విజయశాంతి, రేవంత్‌రెడ్డి?:టిడిపి నుండి కాంగ్రెస్‌లో చేరిన రేవంత్‌రెడ్డిని పార్టీ ఉపయోగించుకోవాలని, లేకపోతే టిడిపి నుండి పార్టీలో చేరిన వారిలో నైరాశ్యం కలుగుతుందని, అలాగే ఇతర పార్టీల నుండి చేరాలనుకునేవారికి తప్పుడు సంకేతాలి ఇచ్చినట్లవుతుందని ఒక నేత సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా త్వరలోనే ప్రచార కమిటీనీ వేయనున్నట్లు, అందులో విజయశాంతి, రేవంత్‌రెడ్డి వంటి నాయకులు ఉండనున్నట్లు కుంటియా తనతో భేటీ అయిన నాయకులకు సంకేతాలిచ్చినట్లు తెలిసింది.

అభ్యర్థులను మార్చిలోనే ప్రకటించాలి : కోమటిరెడ్డి

ముఖ్యమంత్రి కెసిఆర్ ఇప్పటి నుండే వచ్చే ఎన్నికలపై కసరత్తు చేస్తున్నారని, కాబట్టి మార్చి నాటికే సగం నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. ప్రస్తుత ఎంఎల్‌ఏలతో పాటు, గతంలో తక్కువ ఓట్లతో ఓడిపోయిన వారు, ఒకే నాయకుడు ఉన్న నియోజవర్గాలన్ని కలిపితే 65 స్థానాల వరకు అభ్యర్థులపై ఇప్పటికే స్పష్టత ఉందన్నారు. అత్యధిక స్థానాలు ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని, ఇక్కడే 24 స్థానాలు ఉన్నాయని, కాబట్టి తక్షణమే ఇన్‌ఛార్జ్‌లు నియమించాలని కోరారు.మొత్తమ్మీద ఈ భేటీలపై నాయకులు సంతృప్తి వ్యక్తమవుతోంది.



రైతులకు రూ. 2లక్షల వరకు రుణ మాఫీ చేస్తాం: ఎంఎల్ఎ రేవంత్‌రెడ్డి

మన తెలంగాణ/ కోస్గి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆవెంటనే రైతుతకు ఏక కాలంలో ఋణమాఫీ చేస్తామంటూ కొడంగల్ ఎంఎల్ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ హయాంలో నిరుద్యోగ తెలంగాణాగా మారిందన్నారు. అధికారం లోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పక్క పార్టీల నాయకులను సంతలో గొర్రెలను కొంటున్నట్లు కొనడమే తప్పా అభివృద్దిని పట్టించుకోవడం లేదని కోడం గలం ఎంఎల్ఎ రేవంత్‌రెడ్డి టిఆర్ఎస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. బుధవారం హబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండల పరిదిలోని పలు గ్రామాల్లో ఆయన జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం లోకి వచ్చిన వెంటనే లక్ష రూపాయల రుణ మాఫీ చేస్తామాంటూ రైతులకు భరోసా ఇచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం నేటికి తమ హామీని నిలబెట్టుకోలేక పోయిందని ముస్లిం మైనారాటీలకు 12 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు ఆ హామీ అమలు తమ పరిదిలోనిది కాదని కేంద్ర ప్రభుత్వంలో ఉన్న అధికార పార్టీ నాయకడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ వల్లనే సాధ్యమవుతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

శక్తికి మించి అభివృద్ధి చేస్తున్నా

- మూడేళ్లలో సత్తుపల్లికి రైలు.. సత్తుపల్లికి బైపాస్ రోడ్ నిర్మిస్తాం
- సంవత్సరంలోనే సత్తుపల్లికి గోదావరి జలాలు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మన తెలంగాణ-/ సత్తుపల్లి : తన శక్తికి మించి అభివృద్ధి చేస్తున్నానని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మంజిల్లా సత్తు పల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తు మ్మల శంకు స్థాపనలు చేసి వేంసూరు రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి పట్టణంలో రూ.22 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థా పనలు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతం లో ప్రభుత్వ స్థలాలు ఉండడంతో ఎన్‌టిఆర్ కాలనీకి 600 ఇళ్లు నిర్మించామని, ప్రస్తుతం స్థలాల సమస్య ఉండ టం వలన ఈ క్రమంలో అటవీశాఖ డిపోలో ఉన్న స్థలా న్ని ఇళ్ల నిర్మాణానికై కోరుతున్నామని, ఇది కలెక్టర్ లోకేష్ కుమార్‌కు కూడా చెప్పడం జరిగిందన్నారు. ప్రభుత్వప రంగా సత్తుపల్లి అభివృద్ధికి మరో రూ.15 కోట్లు మంజూ రు చేయడం జరిగిందని, త్వరలోనే మున్సిపల్ శాఖా మంత్రిచే శంకుస్థాపనలు చేస్తామన్నారు. సింగరేణి బొగ్గు లారీల కారణంగా వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకే ము ఖ్యమంత్రి కెసిఆర్ సత్తుపల్లికి ఎట్టి పరిస్థితుల్లోనైనా రైల్వే లైన్ కావాలనే మంజూరు చేశారన్నారు. మరో మూడేళ్లలో సత్తుపల్లి కి రైలు వస్తుందని, నాలుగు లైన్ల జాతీయ రహ దారిని ప ట్టణం బయటి నుండే బైపాస్ ద్వారా సూర్యా పేట నుంచి రాజమండ్రి వరకూ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముందుగా పట్ట ణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించగా మంత్రి తు మ్మల స్వయంగా బైక్ నడుపుకుంటూ ర్యాలీలో పాల్గొ న్నా రు. జెవిఆర్ పార్కు ఎదురుగా రూ.1.50 కోట్లతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, 1,2,3,4 వా ర్డుల్లో రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి , 14,15,16 వార్డుల్లో రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, 5,6,7,9,10,11 వార్డుల్లో సిమెం ట్ రోడ్ల నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశా రు. ప్రభుత్వ ఆసుపత్రి నుండి కృష్ణ మందిరం మీదుగా పోస్టాఫీసు వరకు రూ.1.70 కోట్లతో నిర్మించే బిటి రోడ్డుకు, బ్రహ్మంగారి గుడి వద్ద నుండి కాకర్లపల్లి వరకు రూ.8.6 కోట్లతో నిర్మించే బిటి రోడ్డుకు, వేంసూరు రోడ్డులో రూ.10.08 కోట్లతో నిర్మించే 200 డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. జెవిఆర్ కళా శాలలో రూ.1.70 కోట్లతో నిర్మించిన గిరిజన బాలికల వసతిగృహాన్ని ఎంపి పొంగులేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ లోకేష్‌కుమార్, జెడ్‌పి ఛైర్‌ప ర్సన్ గడిపల్లి కవిత, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడ మర్తి రవి హాజరయ్యారు.





జమిలి ఎన్నికలపై అఖిలపక్షం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

మన తెలంగాణ/ కోహెడ : దేశంలో లోక్‌సభ, రాష్ట్రాలలోని అసెంబ్లీ ఏకకాల ఎన్నికల నిర్వహణపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయా లని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అఖిలపక్ష నాయకులతో సంప్రదింపులు చేయకుండా ప్రధాని మోడీ ఏకపక్ష నిర్ణయం సరికాదన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా, కోహెడ మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లడుతూ కార్పొరేట్ శక్తుల కనుస న్నల్లో కేంద్ర పాలన సాగుతోందన్నారు. దేశంలో 73శాతం కార్పొరేట్ సంస్థలతో కుమ్మక్కై ఉందని ఆరోపించారు. దేశంలో కొనసాగుతున్న మతోన్మాద శక్తుల పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు ప్రజాస్వామ్యానికి కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోడీ 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో సిఎం కెసిఆర్ నియంతృత్వ పోక డలతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతీ,యువ కులకు ఇచ్చే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సబ్సిడీ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విడుదల చేయలేదని అన్నారు. ఉపాధి హామీ కూలీల డబ్బులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వీటన్నింటి సమస్యలపై రా నున్న రోజుల్లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సిద్దిపేట, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మంద పవన్, రాంగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెండాల ఐల య్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సృజన్‌కుమార్ తదితరులున్నారు.

పునర్విభజన సమస్యలపై నిర్లక్ష్యం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీక రణ చట్టంలో పొందుపర్చిన అన్ని అంశాలను వెంటనే పరిష్కరించా లని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. శాసనసభ నియోజకవర్గాల సంఖ్య పెంచుతున్నట్లు ఒ కసారి, అలాంటి ఆలోచనలు లేవని మరోసారి ప్రకటనలు వస్తున్నాయ ని, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలతో కేంద్రానికి ఉన్న సంబం ధాలను అనుసరించి అవకాశవాద రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. చట్టంలో పొందుపర్చిన హైకోర్టు విభజన ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నదని, ప్రభుత్వరంగ సంస్థల విభజన పూర్తిస్థాయిలో జరగలే దని, ఉద్యోగుల విభజన కూడా ఇప్పటికీ పూర్తికాలేదన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మన తెలంగాణ/ కూసుమంచి: భద్రాచలం కొత్తగూడెం జిల్లా మండ లంలోని జుజ్జులరావుపేట గ్రామంలో దాట్ల లక్ష్మి ప్రసన్న(25) బుధ వారం ఉదయం బెడ్‌రూంలో అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకొని మృతి చెందింది. మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన మృతురా లికి ఏడాదిన్నర క్రింత దాట్ల సురేశ్‌తో వివాహం అయ్యింది. వీరికి యా క్షిత్ అనే 14 నెలల బాలుడున్నాడు. మరణవార్త తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు జుజ్జులరావుపేటకు వచ్చి మృతదే హాన్ని చూసిన అనంతరం తమ కూతురుది ముమ్మాటికి హత్యేనని భా వించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ పి. రఘు ఆధ్వ ర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం ని మిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

మన తెలంగాణ/ నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ నగరంలో బుధ వారం రైల్వేస్టేషన్ సమీపంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. శ్రీనివాస్, నందగోపాల్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం సో దాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జుక్కల్ మండలం పో చారం గ్రామానికి చెందిన పాడ్యాల్ రూప అనే వ్యక్తి నారాయణఖేడ్‌లో కొందరు వ్యక్తుల నుండి గంజాయిని తెచ్చి మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన విలాస్ కృషాంత్ షిండే ప్రమేయంతో ముంబాయికి త రలిస్తున్నట్లు పక్కా సమాచారంతో సోదాలు నిర్వహించామన్నారు. గంజాయి విలువ సుమారు రూ. 3లక్షలు ఉంటుందని వెల్లడించారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీ సులు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జె. వెంకట్‌రెడ్డి, ఎస్ఐ సింధు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ఉపాధి బృందం పర్యటన

మన తెలంగాణ/ నవాబుపేట(వికారాబాద్ జిల్లా) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నవాబుపేట మం డల పరిధిలోని నవాబుపేట, మహ్మదాన్‌పల్లి, లింగంపల్లి, ఎల్లకొండ గ్రామలలో కేంద్ర బృందం, రాష్ట్ర బృందం, జిలా స్థాయి, మం డల స్థాయి అధికారులు పర్యటించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. దీనిలో భాగంగా నవా బుపేట గ్రామంలో ని మ్మతోట, ఇంకుడు గుంతలు, ఎంజిఎన్ఆర్ఈజి ఎస్ కిం ద నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. అవగహన కార్య క్రమ ఫోటో ప్రదర్శన కార్యక్రమాలను పరిశీలన చేశారు. అనంతరం మహ్మదాన్‌పల్లి గ్రామంలో డి. చంద్ర య్య అనే లబ్ధిదారుడు తన పొలంలో కూరగాయల పంది రి, నర్సరీ, పశువులతొట్టిని పరిశీలిం చారు. ఆయనకు కే వలం కూరగాయల పందిరి కోసం అయిన ఖచ్చు 1, 12,716 రూపాయలు కాగా ఎంఆర్ఇజిఎస్ నుండి లబ్దిపొందింది 79,210 రూపాయలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

కారు మెకానిక్ దారుణ హత్య

మన తెలంగాణ/ కార్వాన్: నగర నడిబొడ్డులో పట్టపగలు కారు మెకా నిక్‌ను కత్తులతో పొడిచి దారుణంగా చంపేశారు. మామూళ్లు ఇవ్వనం దుకే స్థానిక రౌడీషీటర్లు ఈ ఘాతుకానికి పాల్పడ్డా రు.ఈ సంఘటన హుమాయున్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీ సులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ ఎన్.ఎల్.ఎన్.రాజు కథనం ప్రకారం సయ్యద్‌నగర్ నివాసి సయ్యద్ ష ర్ఫుద్దీన్ (36) ఫస్ట్‌లాన్సర్‌లోని బుల్కాపూర్ నాలా పక్కన కారు మెకాని క్‌గా పనిచేస్తున్నాడు. గోల్కొండ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న అర్షద్ ప్రతినెల వచ్చి షర్ఫుద్దీన్ వద్ద నుంచి మామూళ్లు తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం అర్షద్ తన అనుచరులతో షర్ఫు ద్దీన్ కారు మెకానిక్ షెడ్డు వద్దకు వచ్చి షర్ఫుద్దీన్‌తో మామూళ్ల విష యంపై గొడవ చేశాడు. అడ్డు వచ్చిన షర్ఫుద్దీన్ తమ్ముడిని కొట్టి వెళ్లిపో యారు. దీంతో షర్ఫుద్దీన్ బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో సదరు రౌడీ షీటర్ అర్షద్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న అర్షద్, కారు మెకానిక్‌పై కక్ష పెంచుకుని ఈ దారుణానికి దిగారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వజ్రం విక్రయించిన నిందితులు అరెస్టు

- రూ. 1.15కోట్ల నగదు స్వాధీనం
- తక్కువ ధరకు వస్తుందని నమ్మి మోసపోవద్దు
- నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రావు

మన తెలంగాణ/ సిటీబ్యూరో: నకిలీ వజ్రం విక్ర యించిన ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ నగర పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు మహమ్మ ద్ సలాం ఖాన్, మహమ్మద్ సిద్దిఖీని రిమాండ్‌కు పంపిస్తున్నట్టు నగర పోలీసు కమిషనర్ వివి శ్రీని వాస్‌రావు తెలిపారు. నిందితుల నుండి రూ. 1,15,20,000ల నగదును స్వాధీనం చేసుకున్న ట్టు వెల్లడించారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిష నర్ మాట్లాడుతూ నకిలీ వజ్రం చూపి రూ. 4.50 కోట్లు విలువచేస్తుందని ఆసక్తి ఉన్నవారిని నమ్మిం చడం ద్వారా పెద్దమొత్తంలో నగదును పొందాల ని పథకం వేసుకున్నారని నిందితులని తెలిపారు. గతంలో ఒక నగల దుకాణంలో పనిచేస్తున్న సం దర్భంలో నిందితుడు మహమ్మద్ సలాం ఖాన్‌కు హాజీ అనే ఫిర్యాదు దారుడితో పరిచయం ఉన్నది. కాగా మరో నిందితుడైన సిద్దిఖీతో సలాం ఖాన్‌కు మధ్య స్నేహం ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసు కున్న సలాం ఖాన్, సిద్దిఖీలు కలిసి హాజి అనే వ్యక్తికి ఈ నకిలీ వజ్రాన్ని విక్రయించాలని నిర్ణ యించారు. రూ. 4.50 కోట్లు పలుకుతుందని, కానీ వారి అవసరం నిమిత్తం రూ. 1.20 కోట్లుకు అమ్ముతున్నట్టు తెలిపారు. సలాం ఖాన్‌తో పరిచ యమున్న హాజి వీరి మాటలను నమ్మి రూ. 1.20 కోట్లు ఇచ్చి వారి వద్దనున్న వజ్రంను తీసుకున్నా డు. తీరా అది నకిలీదని తేలడంతో హాజీ నేరుగా పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులిద్దరినీ అదుపు లోకి తీసుకుని విచారించగా అసలు విషయం బ యటపెట్టారు. వారి వద్ద నుండి రూ. 1.15 కోట్లు స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మార్కెట్‌లోకన్నా తక్కువ ధరకు ఏదేని విలువైన వస్తువు లభిస్తుందంటే దాని వెనకాలే పచ్చి మోసముంటుందని, అలాంటి విషయాలను నమ్మి మోసపోరాదని ప్రజలకు కమిషనర్ విన్నవి ంచాడు. అలా ప్రయత్నాలు చేస్తున్న వారిపై పోలీ సు కంట్రోల్ రూంకు, మాకు సమాచారాన్ని చేర వేయాలని సూచించారు.



ప్రాణం మీదకు తెచ్చిన గాలిపటం

విద్యుదాఘాతానికి బలైన బాలుడు
రెండు చేతులు తొలగించిన వైద్యులు



మన తెలంగాణ/ చాంద్రాయణగుట్ట : గాలి పటం బాలుడి ప్రాణాల మీదకు తెచ్చింది. సమీపంలోనే ఉన్న విద్యుత్ తీగలకు తగలి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. తీవ్రగాయా లతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి రెండు చేతులను ఉస్మానియా వైద్యులు తొలగించారు. స్థా నికుల తెలి పిన ప్రకారం ఉప్పుగూడ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన జి. శ్రీరాములు, సరితలకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు జి.చరణ్ తేజ్ (9) స్థానిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 27వ తేదీ శనివారం మధ్యాహ్నం శివాజీనగర్, కృష్ణవేణి టాలెంట్ స్కూ ల్ సమీపం లోని పెద్దనాన్న ఇంటికి వచ్చాడు. అక్కడ వేలాడుతున్న గాలిపటాన్ని తీయబోగ బాల్కనీ సమీపం నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదఘాతానికి గురైయ్యాడు. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు కర్రల సహాయంతో బాలుడిని విద్యుత్ తీగల నుంచి రక్షించి హుటాహు టిన ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతున్న బా లుడి చేతులు తీవ్రంగా కాలి చర్మం ఊడిపోగా, రెండు చేతులను బుధవారం వైద్యులు తొలగించారు. ఈ నెల 13వ తేదీన సైతం ఒక బాలుడు విద్యుదాఘాతా నికి గురైయ్యాడని, సిపిడిసిఎల్ ఫలక్‌నుమా ఎడిఇకి ఫిర్యాదు చేసినా స్పందించకపోవటం వల్లే మరోసారి ఈ ఘటన చోటు చేసుకుందిని బాధి తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదివాసీలపై ప్రభుత్వం చిన్నచూపు

తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావ్

మన తెలంగాణ / ఆదిలాబాద్ టౌన్ : ఆదివాసీలను ప్రభుత్వం విస్మరి స్తోందని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావ్ అన్నారు. మే డారం జాతరకు వచ్చిన జాతీయ ఎస్టీ కమీషన్ జాతీయ చైర్మన్ నంద కుమార్ సాయి అవమానం పరిచారని బుధవారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో తెలిపారు. మేడారం జా తర సందర్శనకు వచ్చిన ఆయనకు హెలికాప్టర్‌ను కేటాయించి చివరి నిమిషంలో మంత్రి హ రీశ్‌రావ్ దాన్ని ఎంపి సీతారాంనాయక్‌కు కేటాయించారన్నారు. దీని కా రణంగా జాతీయ స్థాయి నేత నాలుగు గంటల పాటు నిరీక్షించారని తెలి పారు. అయినప్పటికి హెలిక్యాప్టర్‌ను కేటాయించకపోవడం దారుణమ ని ధ్వజమెత్తారు. ఈ సంఘటన చూస్తే ప్రభుత్వానికి ఆదివాసీలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. ఇక నుంచి మేడారంలో వచ్చే కేంద్ర, రాష్ట్ర మంత్రులు మినహా ఎవరైన హెలిక్యాప్టర్‌ను వినియోగిస్తే వా రిని ఆదివాసీ సంఘాల నాయకులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

చిట్టీల వ్యాపారి ఘరానా మోసం

- రూ. 21 కోట్లతో ఉడాయింపు.. అరెస్టు



మనతెలంగాణ/ కోదాడ/కోదాడక్రైమ్ : చిట్టీల పేరుతో ప్రజలను మోసి చేసి ఉడాయించిన చిట్టీల వ్యాపారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిన ఘట న కోదాడ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్‌పి ప్రకాశ్ జావెద్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కోదాడలో 1993లో మందలపు కోటేశ్వరరావు, అతని సోద రుడు రఘు సేవా చిట్‌ఫండ్ వ్యాపారాన్ని ప్రారం భించినట్లు తెలిపారు. ఎటువంటి ప్రభుత్వ అను మతులు లేకుండా 1993 నుండి 2004 వరకు చిట్టీలను నడుపుతూ సభ్యులతో డబ్బులను కట్టి స్తూ ఈ వ్యాపారాన్ని కొనసాగించారు. 2004లో ఒక లక్ష చిట్టీకి మాత్రమే ప్రభుత్వ అనుమతులు తీసుకున్నట్లు, రికార్డుల ద్వారా వెల్లడయ్యిందన్నా రు. 2004 నుండి నేటి వరకు వందల మంది సభ్యుల వద్ద రూ.21 కోట్ల వరకు వసూలు చేసి నట్లు తెలిపారు. అనంతరం ఆ సభ్యులను నమ్మిం చి బోర్డు తిప్పేసి ఊడయించినట్లు, ఈ చిట్ ఫండ్ కంపెనీలో సుమారుగా 9వందల మంది సభ్యులు న్నారని, వారి వద్ద నుంచి 9 కోట్ల వరకు డిపాజిట్ రూపంలోనూ, 12 కోట్ల వరకు చిట్టీల ద్వారాను మొత్తం కలిపి రూ.21 కోట్లు వసూలు చేసి సభ్యు లకు కుచ్చుటోపి పెట్టినట్లు గుర్తించమని ఎస్పీ ప్రకాశ్ జాదవ్ తెలిపారు. సేవా చిట్‌ఫండ్ వ్యాపారి మందలపు కోటేశ్వరరావు ఖమ్మంజిల్లా బోనకల్ మండలం లోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన వాడుగా గుర్తించినట్లు తెలిపారు. చిట్టి వ్యాపారిపై ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశా మని, మరోక కేసును కూడా నమోదు చేస్తు న్నట్లు తెలిపారు. ఈ చిట్టివ్యాపారి కోటేశ్వరరా వుకు కోదాడలో సొంత ఇల్లు, రెండు ఫార్ బాయిల్డ్ రైస్ మిల్లులు లక్ష్మీ వెంకటేశ్వర ఫార్ బాయిల్డ్ బొజ్జ గూడెంతండా, పద్మావతిరైస్ మిల్లు నేలకొండపల్లి, రెండు పాఠశాల భవనాలు ఆదర్శ్ లిటిల్ స్కూల్, కోదాడలో ఒక ప్లాట్, సొంతగ్రా మంలో రెండు ఎకరాల భూమి, హైదరాబాద్‌లో ఒక ప్లాట్‌లను గుర్తించామని, వారి ఆస్తుల వివ రాలు కోర్టులో పొందుపరుస్తామన్నారు. బుధ వారం కోటేశ్వరరావును అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు.

దళిత మహిళ సజీవ దహనం

- అప్ప కట్టమన్నందుకు దారుణం
- పోలీసుల అదుపులో మండల కోఆప్షన్ సభ్యునితో పాటు మరో ఇద్దరు

మన తెలంగాణ/ మంచిర్యాల : కొమురంభీం ఆ సిఫాబాద్‌జిల్లా బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామా నికి చెందిన దుర్గం స్రవంతాబాయి(45) బుధవా రం కాలిన గాయాలతో మృతి చెందింది. మంగళ వారం అర్ధరాత్రి మండల కో ఆప్షన్ సభ్యులు బస్ర త్‌ఖాన్‌తో పాటు కామెర సాయి, కామెర చాలుబా యిలు కిరోసిన్ డబ్బ తీసుకొని స్రవంతాబాయి ని ద్రిస్తుండగా ఆమెపై చల్లి నిప్పు అంటించారు. దీం తో ఆమె తీవ్రంగా గాయపడగా మొదట సిర్పూ ర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. సిర్పూ ర్(టి) మెజిస్ట్రేట్ ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చే శారు. తనపై బస్రత్‌ఖాన్‌తో పాటు కామెర చాలు బాయి, కామెర సాయిలు కిరోసిన్ చల్లి నిప్పు అం టించారని వాంగ్మూలంలో ఆమె పేర్కొన్నారు. పో లీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

డబ్బులు అడిగినందుకే

మర్తిడి గ్రామానికి చెందిన కామెర దుర్గయ్య కూతు రు వివాహం కోసం రూ.47 వేలు స్రవంతాబాయి అప్పుగా ఇచ్చి నాలుగు సంవత్సరాలు అయింది. ఎప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య వి వాదం జరిగింది. ఈ సంఘటన నేపథ్యంలో సి ర్పూర్ ఎంఎల్ఏ అనుచరుడుగా చెప్పుకుంటున్న మండల కోఆప్షన్ సభ్యుడు బస్రత్‌ఖాన్‌ను సంప్ర దించి ఆమెను హత్య చేసేందుకు కుట్రపన్నారు. పథకం ప్రకారమే కిరోసిన్ చల్లి నిప్పు అంటించగా ఆమె తీవ్రంగా గాయపడి మృతి చెందింది. స్రవం తాబాయి ఇంటిని జనవరి 25న గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. అప్పుడు పోలీసులు అధి కార పార్టీకి మద్దతు తెలుపుతూ సిలిండర్ పేలి ప్రమాదం జరిగిందని కేసు నమోదు చేయకుండా నష్టపరిహారం ఇప్పిస్తామని ఆమెపై ఒత్తిడి తెచ్చా రు. భర్తను కోల్పోయి ఒంటరిగా ఉంటున్న స్రవం తాబాయి అధికార పార్టీ నాయకులను పోలీసుల ను ఎదిరించలేక ఫిర్యాదు చేయలేదు. మరింతగా రెచ్చిపోయిన బస్రత్‌ఖాన్‌తో పాటు అప్పు తీసు కున్న కామెర చాలుబాయి, కామెర సాయిలు మళ్లీ పథకం ప్రకారం పశువుల కొట్టంలో నిద్రిస్తున్న స్రవంతాబాయిపై కిరోసిన్ చల్లి నిప్పు అంటిం చారు. మొదట ఇల్లు తగులబెట్టినప్పుడే పోలీసులు స్పందించి ఉంటే ప్రస్తుతం ఈ దారుణం చోటు చేసుకునేది కాదని విపక్షాల నాయకులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు. మండల కోఆప్షన్ సభ్యులు మరికొందరు ఇటీవల మర్తిడి మాజీ సర్పంచ్ ఉమ్మెర లింగయ్యపై దాడి చేయగా అతను పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు కేసు నమోదు కాలేదు. కాగా స్రవంతాబాయి సజీ వదహనం కేసులో పోలీసులు బస్రత్‌ఖాన్‌తో పాటు కామెర చాలుబాయి, కామెర సాయిలను అదుపు లోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అమెరికా, భారత్‌లు మిత్ర దేశాలు

మన తెలంగాణ / అమీర్‌పేట : ప్రపంచంలో రెండు దేశాలైన అమెరికా, భారత దేశాలమధ్య మంచి స్నేహ సంబంధాలున్నాయని యుఎస్ కాన్సలేట్ జనరల్ (హైదరాబాద్) కత్రినీ హదా అన్నారు. అమెరికా భారత దేశాల మధ్య దౌత్య సంబదాలు కుదిరి 70 ఎళ్ళు పూరైన సందర్భంగా రెండు దేశాల మధ్య ఉన్న స్నేహ సంబందాలపై విద్యార్థులు వేసిన పెయింటింగ్ ప్రదర్శ నను అమీర్‌పేట మెట్రో రైల్వే స్టేషన్ ప్రాంగణములో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పెయింటింగ్ పదర్శన కార్యక్రమాన్ని బుధవారం కత్రినీ హదా, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్.వి.ఎస్. రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెరికా భారత దేశాల మధ్య దౌత్య సం బంధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నగరంలోని నాలుగు పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులతో పెయింటింగ్ కార్యక్ర మాన్ని నిర్వహించామన్నారు. వీటిలో 50 మంది విద్యార్థులు వేసిన పెయిం టింగ్‌లను ఎంపికచేసి ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. ఎన్నో ఎళ్ళుగా ఇరుదేశాల మధ్య ఉన్న దౌత్య సంబంధాలపై పిల్లలు వేసిన పెయిం టింగ్‌లు ఆదర్శంగా నిలిచాయన్నారు.

ఔషధ ధరలను స్థిరీకరించాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఔషధ ధరలను స్థిరీకరించాలని అల యెన్స్ ఆఫ్ డాక్టర్స్ ఆన్ ఎథికల్ హెల్త్‌కేర్ (ఎడిఈహెచ్) ప్రధాని మోడీకి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఇతర దేశాల కంటే కూడా భారత్‌లో ఔషధాలు, మందుల ధరలు అధికంగా ఉన్నాయని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. పంజాబ్ మెడికల్ కౌన్సిల్ పూర్వ అధ్యక్షులు డా. జిఎస్ అగ్రేవాల్, పిఎంసి ఎథికల్ కమిటి మాజీ ఛైర్మన్ డా. అరుణ్ మిత్రా, ఇండియన్ డాక్టర్స్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి), సీనియర్ వైస్ ప్రసి డెంట్ ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవపల్‌మెంట్, ఏడిఈహెచ్ కోర్ సభ్యులు ఈ మేరకు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్ద కూడా ప్రధాని మోడీ ఈ విషయాన్ని ఇటీవల ప్రస్తావించారని గు ర్తు చేసింది. మందులు, ఇతర ఔషధాల తయారీకి అవుతున్న వాస్తవిక ధరల కు, రోగులకు విక్రయించే ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండడాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ప్రాణాధార ఔషధ ధరలను నియంత్రించేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని, ఇందుకోసం సమి ష్టిగా ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని సూచించింది. ఔషధ రంగ భాగస్వాములు ఫిబ్రవరి 5న ఎన్‌పిపిఏ సమీక్ష నిర్వహించనుంది. సమావే శాలు ఏవైనా అంతిమ లక్ష్యం ఔషధ ధరల నియంత్రణే అన్నారు.

విశాఖపట్నం వాణిజ్యపన్ను శాఖ కమిషనర్ ఇంటిపై ఏసిబి అధికారుల దాడులు

మన తెలంగాణ/ ముషీరాబాద్ : విశాఖపట్నం వాణిజ్య పన్ను శాఖ కమీషనర్ లక్ష్మీ ప్రసాద్ రెండో భార్య నివాసముంటున్న హైదరాబాద్ అశో క్‌నగర్‌లోని ఇంటిపై ఏసిబి అధికారులు బుధ వారం దాడులు చేసారు. ఈ దాడుల్లో ఏసిబి అధి కారులు భారీగా అక్రమ ఆస్తులు స్వాధీనం చేసుకు న్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు విశాఖ పట్నం ఏసిబి డిఎస్పీ రామకృష్ణ ప్రసాద్ తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. విశాఖప ట్నంలో వాణిజ్య శాఖ కమీషనర్‌గా పని చేస్తున్న లక్ష్మీ ప్రసాద్ ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం అందుకుని ఆంధ్రప్రదేశ్‌తో పాటు హైదరాబాద్ ఆయనకు సంబంధించిన బంధు వులు, అశోక్‌నగర్‌లోని లక్ష్మీ ప్రసాద్ రెండవ భార్య ఇంటిపై దాడులు చేశారు. ఈ దాడుల్లో లక్ష్మీ ప్రసాద్‌కు మహేశ్వరంలో రెండు ఎకరాల భూమి, గచ్చిభౌలిలో 2000 చదరపు అడుగుల వాణిజ్య స్థలం, పరిగిలో 200 గజాల నాలుగు ఫ్లాట్లు, 30 తులాల బంగారం, కిలో బంగారంకు సంబంధించిన కాగితాలు, రెండు ఖరీదైన కార్లు, ఒక ద్విచక్ర వాహనం, విలువైన సెల్‌ఫోన్లు, చేతి గడియారాలతో పాటు కొంత నగదును ఏసిబి అధి కారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న మొత్తలం కలిపి రూ.2 కోట్ల రూపాయల విలువ ఉంటుందని ఏసిబి అధికా రులు తెలిపారు. ఈ దాడిలో ఏసిబి ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుంది



మోడల్‌గా రాణించి హీరోయిన్‌గా తన కెరీర్‌ను మొదలుపెట్టిన అమీజాక్సన్ తక్కువ కాలంలోనే మంచి పేరు, గుర్తింపును సాధించింది. 'మదరాసపట్టణం' అనే తమిళ సినిమాతో పరిచయమైన అమీ జాక్సన్... ఏక్ దివానా థా, ఎవడు, ఐ సినిమాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఇప్పుడు రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో 'రోబో'కు సీక్వెల్‌గా రూపొందుతున్న '2.0' చిత్రంలో నటించింది. పెద్ద స్టార్లతో నటిస్తున్న ఈ భామకు ఒక హీరోతో నటించాలని కోరిక మాత్రం బాగా ఉందట. ఆ హీరో మరెవరో కాదు... 'బాహుబలి'తో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభాస్. ఈ స్టార్ హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడాన్ని తాను ఇష్టపడతానని చెప్పింది హాట్ బ్యూటీ అమీజాక్సన్. 'బాహుబలి'లో ప్రభాస్‌ను చూసి తాను విస్మయం చెందానని ఆమె చెప్పింది. కానీ అమీజాక్సన్ కోరిక ఎప్పుడు తీరుతుందో చూడాలి.

నిజ జీవితంలో ఎలా ఉంటానో అలాగే...



నాగశౌర్య

నాగశౌర్య కథానాయకుడిగా ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో నూతన దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఛలో'. శుక్రవారం ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా నాగశౌర్యతో ఇంటర్వ్యూ విశేషాలు...

మరచిపోలేని అనుభవం...

మా సొంత బ్యానర్ ఐరా క్రియేషన్స్‌లో ఈ చిత్రం చేయడం చాలా బాగుంది. ఈ సినిమాతో మా బ్యానర్ అంటే ఏంటో అందరికీ తెలుస్తుంది. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సినిమా చేయడం మరచిపోలేని అనుభవాన్ని ఇచ్చింది.

కథ నచ్చి చేశాను...

దర్శకుడు వెంకీ నాకు మంచి స్నేహితుడు. 'జాదూగాడు' సినిమా నుండి అతను నాకు తెలుసు. అతనిపై నాకు నమ్మకం ఎక్కువ. అతను చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశాను.

8 నెలలు కష్టపడ్డాను...

ఇంతకుముందు సినిమాల్లో దర్శకులు ఏం చెబితే అదే చేసేవాడిని. పెద్దగా జోక్యం చేసుకునేవాడిని కాదు. దాంతో దెబ్బలు కూడా తిన్నాను. అందుకే ఈ సినిమా కథ కోసం వెంకీతో కలిసి 8 నెలల పాటు కష్టపడ్డాను. నాకు ఏదైనా నచ్చకపోతే వెంకీకి చెప్పి మార్పించుకునేవాడిని.

సహజంగా నటించగలిగాను...

నిజ జీవితంలో నేను ఎలా అయితే రఫ్‌గా, ఫన్నీగా ఉంటానో సినిమాలో కూడా అలాగే ఉంటాను. దర్శకుడు వెంకీ కావాలనే నా పాత్రను అలా డిజైన్ చేశాడు. దీంతో సినిమాలో నేను సహజంగా నటించగలిగాను.

సాంప్రదాయం ప్రకారం చంపేస్తారు...

కొన్ని కారణాల వల్ల ఒక ఊరు తెలుగు, తమిళం అని రెండుగా విడిపోతుంది. రెండు ఊళ్లకు మధ్యన కంచె ఉంటుంది. ఎవరైనా కంచె దాటితే సాంప్రదాయం ప్రకారం చంపేస్తారు. అలాంటి ఊళ్లో నాకు పనేంటి అనేదే ఈ సినిమా.

ఆవిధంగా టైటిల్ ఖరారు...

ముందుగా ఈ సినిమాకు ఏ టైటిల్ పెట్టాలో అస్సలు తోచలేదు. మా నాన్నేమో తొందరపెట్టేవారు. ఒకరోజు కారులో వెళ్తూ రామ్‌చరణ్ 'బ్రూస్‌లీ' సినిమాలోని 'లే ఛలో..' పాట వింటున్నప్పుడు 'ఛలో' టైటిల్ అయితే బాగుంటుందని దీన్ని ఖరారు చేశాం.

తదుపరి చిత్రాలు...

సాయిశ్రీరామ్‌తో ఓ సినిమాను ఫిబ్రవరి నెలాఖరులో ప్రారంభిస్తాను. అదొక లవ్ స్టోరీ. రెండున్నర ఏళ్ల క్రితమే ఆ సినిమా చేయాల్సింది. కానీ ఇప్పటికి కుదిరింది. దానితర్వాత శ్రీనివాస్ అనే కొత్త దర్శకుడితో 'నర్తనశాల' సినిమాను చేస్తాను.



నిఖిల్, సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే, తేజ, అనిల్ సుంకర, శరణ్ కొప్పిశెట్టి తదితరులు

కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో బెస్ట్ ఫిల్మ్

నిఖిల్ హీరోగా ఎటివి సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి. సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'కిర్రాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రామబ్రహ్మమ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా టీజింగ్ ట్రైలర్‌ను హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ టీజర్ మళ్లీ మళ్లీ చూసేలా ఉంది. నిఖిల్‌కు స్నేహితులుగా నటించిన వారందరూ చక్కగా నటించారు. అందరికీ మంచి పేరు తెచ్చేలా సినిమా సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ "కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన సినిమాల్లోనే ఇది బెస్ట్ ఫిల్మ్‌గా నిలుస్తుంది. కొత్త నటీనటులు అందరూ అనుభవమున్న వారిలా నటించారు"అని తెలిపారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ "హ్యాపీడేస్ సినిమాలో ఇలాగే కొత్త నటీనటులతో కలిసి నటించాను. 'కిర్రాక్ పార్టీ' చిత్రంలో నటించినప్పుడు అదే ఫీలింగ్ కలిగింది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఇద్దరు హీరోయిన్లు బాగా నటించారు. సినిమా మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకముంది"అని చెప్పారు. బ్రహ్మాజీ, సిజ్జు, రఘు కారు మంచి, షియాజి షిండే తదితరులు ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: సుధీర్ వర్మ, డైలాగ్స్: చందు మొండేటి. సినిమాటోగ్రఫీ: అద్వైత గురుమూర్తి, సంగీతం: అంజనీష్ లోకనాథ్, ఎడిటర్: ఎం.ఆర్.వర్మ.

'హౌరా బ్రిడ్జ్' పాటల సందడి

ఈఎంవిఈ స్టూడియోస్ ప్రై.లి. బ్యానర్‌పై రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరీ, మనాలీ రాథోడ్ హీరోహీరోయిన్లుగా రేవన్ యాదు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. శేఖర్‌చంద్ర సంగీతమందించిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి పత్తిపాటి పుల్లారావు, నారా రోహిత్, రాహుల్ రవీంద్రన్, నిఖిల్, సాయికార్తీక్, శేఖర్‌చంద్ర, ప్రతాని రామకృష్ణగౌడ్, చాందిని చౌదరి, జె.ఎన్.రాజు, నవీన్‌చంద్ర, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆడియో సీడీలను నారా రోహిత్ విడుదల చేసి మంత్రి పత్తిపాటి పుల్లారావుకు అందజేశారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ "శేఖర్‌చంద్ర మ్యూజిక్ చాలా బావుంది. నిర్మాతగా చరణ్‌కు తొలి చిత్రమిది. సినిమా పెద్ద సక్సెస్ కావాలి"అని అన్నారు. దర్శకుడు రేవన్ యాదు మాట్లాడుతూ "దర్శకుడిగా ఇది నాకు రెండో చిత్రం. సినిమాను వెరైటీగా రూపొందించాం. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. శేఖర్ చంద్ర మంచి సంగీతాన్ని అందించారు"అని చెప్పారు. హీరో రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ "సినిమా బాగా వచ్చింది. రేవన్ యాదు మంచి క్యారెక్టర్‌ను డిజైన్ చేసి నాకు ఇచ్చారు. చాందినీ, మనాలి చక్కగా నటించారు. విజయ్‌మిశ్రా విజువల్‌గా సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు"అని పేర్కొన్నారు.



'హౌరా బ్రిడ్జ్' ఆడియో వేడుకలో ఎపి మంత్రి పత్తిపాటి పుల్లారావు, నారా రోహిత్, రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరి, రేవన్ యాదు.

ఈనెల 4న ప్రీ రిలీజ్ ఫంక్షన్



సి.కళ్యాణ్

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ "ఇటీవల ప్రభాస్ విడుదల చేసిన పాటలకు మంచి స్పందన వస్తోంది. 'ఇంటిలిజెంట్' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను ఫిబ్రవరి 4న రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ వై జంక్షన్‌లో భారీ ఎత్తున నిర్వహించనున్నాం. స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. సాయిధరమ్‌తేజ్ కెరీర్‌లో ఈ చిత్రం బిగ్ హిట్‌గా నిలుస్తుంది. సినిమాలో తేజ్ డ్యాన్సులు ఇరగదీశాడు. పాటలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్‌చేస్తారు. ప్రతి సాంగ్, ప్రతి ఫైట్‌ను రిచ్‌గా తీశాం. ఈ సినిమా యాక్షన్ సీన్స్ కోసం ప్రత్యేకంగా సెట్స్ కూడా వేశాం. అన్నీ చాలా గ్రాండియర్‌గా ఉంటాయి. ఇక అందరినీ ఆలోచింపచేసే విధంగా ఓ కొత్త దర్శకుడితో 'భారతి' అనే సినిమాను ప్లాన్ చేస్తున్నాను. అలాగే రానా హీరోగా శివ డైరెక్షన్‌లో నిర్మిస్తున్న '1945' సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. పది రోజుల వర్క్ మాత్రమే ఉంది. ఇది పీరియాడికల్ మూవీ. బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఉంటుంది. నిర్మాతగా రామానాయుడు నాకు స్ఫూర్తి. ఆయన ఇన్‌స్పిరేషన్‌తో ఇప్పటివరకు 70 సినిమాలు చేశాను. ఇదే ఎనర్జీతో వంద సినిమాలు పూర్తిచేస్తాను. నిర్మాతగా ఎంత బిజీగా ఉన్నా యస్‌యస్‌ఎస్‌ఐ అధ్యక్షుడిగా నా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాను. మార్చి 1న థియేటర్ల బంద్ పిలుపు కొరకు నార్త్, సౌత్ సినీ ప్రముఖులతో సమావేశాలను నిర్వహిస్తున్నాము. ప్రస్తుతం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లను దోచుకుంటున్నారు. అలా చేస్తే చివరకు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు నక్సలైట్లుగా మారే అవకాశం ఉంది. అలా జరగకూడదని మార్చి 1న బంద్ ప్రకటించి తగిన చర్యలు తీసుకోబోతున్నాం"అని అన్నారు.

భయపెట్టే హర్రర్ థ్రిల్లర్



మేఘన, సల్మాన్, సంతోషి

లాగిన్ మీడియా పతాకంపై మేఘన, సంతోషి, సల్మాన్ ప్రధాన పాత్రల్లో కృష్ణకార్తీక్ దర్శకత్వంలో ఉదయ్‌భాస్కర్.వై నిర్మించిన హర్రర్ అండ్ థ్రిల్లర్ మూవీ 'హ్యాక్డ్ బై డెవిల్' (హెచ్‌బిడి). ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా సినిమా యూనిట్ హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆర్.పి.పట్నాయక్, రాజ్ కందుకూరి, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, గాంధీ, నవీన్ యాదవ్, సాయి వెంకట్, రామ సత్యనారాయణ తదితరులతో పాటు చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ సందర్భంగా సినిమా టీజర్‌ను నవీన్ యాదవ్, ట్రైలర్‌ను సర్వే సత్యనారాయణ విడుదల చేశారు. పాటలను ఆర్.పి.పట్నాయక్, రాజ్ కందుకూరి, రామసత్యనారాయణ, సాయి వెంకట్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కృష్ణకార్తీక్ మాట్లాడుతూ "నా మొదటి సినిమా ఇది. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. పరీక్ష రాసి రిజల్ట్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిలా వేచి చూస్తున్నాను"అని అన్నారు. చిత్ర నిర్మాత ఉదయ్‌భాస్కర్.వై మాట్లాడుతూ "ఈ చిత్రం తర్వాత ఇక రెగ్యులర్‌గా సినిమాలు నిర్మిస్తాం. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందన్న నమ్మకముంది"అని చెప్పారు. మేఘన, సంతోషి, సల్మాన్, హిమజ, మానస, సురేష్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహి మదన్, కెమెరా: కన్నా కోటి, ఎడిటర్: కె.ఆర్.స్వామి, డైలాగ్స్: అభయ్ శ్రీజయ్.

మెగాస్టార్ అల్లుడి చిత్రం ప్రారంభం



కళ్యాణ్‌దేవ్

మెగాస్టార్ చిరంజీవి అల్లుడు కళ్యాణ్‌దేవ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రాన్ని వారాహి బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. రాకేష్ శశి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో కళ్యాణ్‌దేవ్‌కు జోడీగా మాళవిక నాయర్ నటించనుంది. ఈ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లోని వారాహి కార్యాలయంలో లాంఛనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, రాజమౌళి, ఎం.ఎం.కీరవాణి, ఎన్.వి.ప్రసాద్, గుణ్ణం గంగరాజు, కళ్యాణ్ కోడూరి, అవసరాల శ్రీనివాస్ పాల్గొన్నారు. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి క్లాప్ కొట్టగా రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సాయి కొర్రపాటి మాట్లాడుతూ "చిరంజీవి అల్లుడైన కళ్యాణ్‌దేవ్ పరిచయ చిత్రాన్ని మేము నిర్మించడం ఆనందంగా ఉంది. దర్శకుడు రాకేష్ శశి అద్భుతమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నాడు"అని అన్నారు. తనికెళ్లభరణి, మురళీశర్మ, నాజర్, సత్యం రాజేష్, ప్రగతి, కళ్యాణి నటరాజన్ తదితరులు నటించనున్న ఈ చిత్రానికి కెమెరా: కె.కె.సెంథిల్ కుమార్, సంగీతం: యోగేష్, సాహిత్యం: రెహమాన్, ఫైట్స్: జాషువా, కళ: రామకృష్ణ.

ఓ ప్రేమ జంట ప్రయాణం



విశ్వదేవ్ రాచకొండ, ప్రదీప్ కుమార్, ప్రియాంక జైన్, శ్రీనివాస్ పొట్లూరి, ఉత్తేజ్

విశ్వదేవ్ రాచకొండ, ప్రియాంక జైన్ హీరోహీరోయిన్లుగా ప్రదీప్ కుమార్ కోనేరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'చల్తే చల్తే'. ఈ చిత్రానికి ప్రదీప్‌కుమార్ కోనేరు, శ్రీనివాసరావు పొట్లూరి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ చిత్రం టైటిల్ లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ "ఓ ప్రయాణంలో పరిచయమైన ఓ జంట ప్రేమలో పడుతుంది. ఆతర్వాత వారి ప్రేమాయణం ఆసక్తికరంగా కొనసాగుతుంది. అన్ని కమర్షియల్ అంశాలతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. సినిమాలోని ఐదు పాటలకు నేనే సంగీతాన్ని అందించాను"అని అన్నారు. హీరో విశ్వదేవ్ మాట్లాడుతూ యూత్‌ను ఆకట్టుకునే విలక్షణ ప్రేమ కథా చిత్రమిదని చెప్పారు. హీరోయిన్ ప్రియాంక జైన్ మాట్లాడుతూ ఈ చిత్రంతో హీరోయిన్‌గా తనకు మంచి పేరు వస్తుందని తెలిపారు. నిర్మాత శ్రీనివాసరావు పొట్లూరి మాట్లాడుతూ "విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. పాటలను అందమైన లొకేషన్లలో చిత్రీకరించాము. ఫిబ్రవరిలో ఆడియోను విడుదల చేస్తాము"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తేజ్ పాల్గొన్నాడు.



సామ్‌సంగ్‌లో 1000 ఉద్యోగాలు

న్యూఢిల్లీ: ప్రముఖ ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ భారతీయ ఇంజనీర్లకు భారత్‌లో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టేందుకు సిద్ధమైంది. వెయ్యిమంది ఇంజనీర్లను ఈ ఏడాదిలో నియమించుకోనున్నట్టు సంస్థ ప్రకటించింది. టాప్ ఇంజనీరింగ్ కాలేజీల నుంచి వీరిని ఎంపిక చేయనున్నామని, దేశ వ్యాప్తంగా ఉన్న తమ ఆర్ అండ్ డి(రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) కేంద్రాల కోసం ఇంజనీర్లను ఎంపిక చేయనున్నట్టు కంపెనీ పేర్కొంది. ఐఐటి, నిట్, ఢిల్లీ ఇంజనీరింగ్ కాలేజీ, బిట్స్ పిలానీ, మనిపాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ట్రిపుల్ ఐటి నుంచి ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నామని కంపెనీ తెలిపింది. వీరిలో 300మందిని ఐఐటీలనుంచి నియమించుకుంటామని వెల్లడించింది. దేశంలో ఉన్న మూడు పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాల కోసం ఈ ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నామని బెంగళూరు సామ్‌సంగ్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఎండి దీపేష్ షా వెల్లడించారు. సామ్‌సంగ్‌కు బెంగళూరు, నోయిడా, ఢిల్లీలో ఆర్ అండ్ డి సెంటర్లు ఉన్నాయి. గతేడాదిలో సామ్‌సంగ్ ఆర్ అండ్ డి కోసం 800 మంది ఇంజనీర్లను నియమించుకోగా, దీనిలో 300 మంది ఐఐటికి చెందినవారే కావడం విశేషం. ఈ సంవత్సరం కూడా ఇదే మాదిరిగా నియామకాలు చేపట్టనుంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 32 ఆర్ అండ్ డి కేంద్రాలు కంపెనీకి ఉన్నాయి.


విత్త మంత్రి ఏం చెప్తారు?

● బడ్జెట్‌లో వరాలా? వాతలా? ● ఉపాధి నుంచి పన్ను శ్లాబు వరకు ఎన్నో అంచనాలు

ముంబై: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపైనే అందరి దృష్టి నెలకొంది. ఆయన నేడు పార్లమెంట్‌లో ఐదో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీకి ఇది ఆఖరి పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్.. ఆదాయం ఎంత? వ్యయం ఎంత? వివరాలను వెల్లడించే రోజు.. అనేక రంగాల నుంచి అంచనాలెన్నో ఉన్నాయి. ప్రతి ఒక్కరు విత్త మంత్రి తమకు వరాలు కురిపిస్తారనే ఆశతో ఉన్నారు. ఇదే సమయంలో బడ్జెట్ 2018పై అనేక ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబ్ పరిమితిని పెంచుతారా? కార్పొరేట్లకు ఎంత వరకు ఉపశమనం లభించనుంది? ఏడో వేతన సంఘం చేసిన ప్రకటనలు ఈ బడ్జెట్‌లో ఉంటాయా? జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అనంతరం తొలి బడ్జెట్ ఆర్థిక వృద్ధి ఊతం అందిస్తుందా? ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం అందిస్తారా? వీటన్నింటి సమాధానం ఈరోజు లభించనుంది.

డిజిటల్ ఇండియా

ప్రధాని నరేంద్ర మోడీ కలల ప్రాజెక్ట్ 'డిజిటల్ ఇండియా'.. 2018 బడ్జెట్‌లో ఆయన విజన్ ఇ–గవర్నెన్స్, కాగితం రహిత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రోత్సాహకాలు ఉండనున్నాయి. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఈ బడ్జెట్‌లో డిజిటల్ ఇండియాకు మార్గం సుగమం చేసేందుకు ప్రయత్నం చేస్తారు. మధ్యవర్తులు ఎలాంటి ప్రయోజనం పొందకుండా, మరింతగా కాగితం రహిత విధానాలను అవలంభించే దిశగా పౌరులను ప్రభుత్వం కోరనుంది.



పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం

రూ.72,500 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యానికి గాను రికార్డు స్థాయిలో రూ.91,253 కోట్ల నిధులను ప్రభుత్వం సేకరించింది. ఆ తర్వాత ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఈ సంవత్సరంలోనూ మరింతగా నిధులను సేకరించడంపై దృష్టి పెట్టనున్నారని అంచనాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం హడ్కో, ఇఐఎల్, ఎన్‌టిపిసి, నాల్కో, ఆయిల్ వంటి ప్రభుత్వ సంస్థల్లో ప్రభుత్వ వాటాలను తగ్గించుకుంది.

జనాకర్షణ వర్సెస్ సంస్కరణ


ప్రభుత్వం గత బడ్జెట్‌లో సంస్కరణలకు ప్రాధాన్యతనిచ్చింది.ప్రస్తుతం ఎన్నికల దృష్ట్యా ఊహించని అంశాలు బడ్జెట్ నుంచి అంచనా వేయవచ్చని నిపుణులు అంటున్నారు.జనాకర్షణకు అరుణ్ జైట్లీ పెద్ద పీట వేస్తారనిభావిస్తున్నారు.

ద్రవ్య లోటు

బడ్జెట్ 2017 ప్రసంగంలో ఆర్థకమంత్రి జైట్లీ ద్రవ్య లోటును లక్ష్యం 3.2 శాతం(2017–18)గా, 2019కి 3 శాతంగా నిర్ణయించారు. దీని ప్రకారం, టార్గెట్ గాడి తప్పిందని తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం మౌలికసదుపాయాలు, గ్రామీణాభివృద్ధిపై వ్యయాలు పెంచే దిశగా చర్యలు చేపట్టనుంది. అలాగే ఉపాధి అవకాశాలను పెంచేందుకు ఇతర పథకాలకు ఊతం అందించనుంది. ద్రవ్య లోటు రోడ్‌మ్యాప్‌కు చిన్న దిద్దుబాటు చర్యలు చేపట్టనుందని నిపుణులు అంటున్నారు.

గ్రామీణాభివృద్ధిపై దృష్టి

2019 ఎన్నికల నేపథ్యంలో బడ్జెట్ ఎక్కువగా గ్రామాలపై దృష్టి పెట్టనుందని తెలుస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తరహా ప్రకటనలే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతేడాదిలో వస్తు సేవల పన్ను చట్టాన్ని అమలు చేయడం ద్వారా పరోక్ష పన్నుల విధానాన్ని విస్తరింపచేసిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు దిగుమతి పన్ను, ప్రత్యేక్ష పన్నుల పరిధి పెంపు అంశంపై దృష్టి సారించనుంది.



మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి

కేంద్ర బడ్జెట్ ఏ విధంగా ఉండనుందనే అంశంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడయ్యే షేర్లలో తీవ్ర ఒత్తిడికి లోనవనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన, గృహ నిర్మాణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కేటాయింపులు పెరుగుతాయని మార్కెట్ వర్గాలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చేశాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుల్ రన్‌తో చరిత్ర సృష్టిస్తున్నాయి. జనవరి 17న సెన్సెక్స్ 35000 మార్క్‌ను క్రాస్ చేసి పైపైకి దూసుకెళ్లింది. సర్వే ప్రకారం, బడ్జెట్ 2018 అనంతరం స్టాక్‌మార్కెట్లు వరుసగా సానుకూల ఫలితాలతో వెళ్లనున్నాయి. సర్వేలో పాల్గొన్న ఇన్వెస్టర్లు, ఫండ్ మేనేజర్లు, విశ్లేషకులు, ఆర్థికవేత్తలు ఏకగ్రీవంగా చెప్పినదేమిటంటే.. ప్రస్తుత దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్, డివిడెండ్ పంపిణీ పన్ను నిబంధనల్లో ఎలాంటి మార్పులుండకపోవచ్చు.



కాగా అమెరికా పన్ను రేట్లను తగ్గించ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం కూడా కార్పొరేట్, వ్యక్తుల ఆదాయంపై పన్ను రేటును తగ్గించడం ద్వారా చెల్లింపుదారుల సంఖ్యను పెంచే దిశగా నిర్ణయాలు తీసుకుంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం ఈ దిశగా ఎటువంటి నిర్ణయం తీసుకుందనేది.. బడ్జెట్‌లో కీలక అంశంగా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

బడ్జెట్ ముందు అప్రమత్తత

లాభాల స్వీకరణతో స్వల్పంగా నష్టపోయిన సూచీలు

ముంబై: కేంద్ర బడ్జెట్ ముందు రోజు మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. నేడు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించారు. పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందిన ఇన్వెస్టర్లు కొంతమేరకు లాభాల్ని స్వీకరించడంతో బుధవారం స్టాక్ సూచీలు నష్టాలతో ముగిశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 68.71 పాయింట్ల నష్టంతో 35965.02 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 21.95 పాయింట్లు క్షీణించి 11027.70 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా ఆసియా మార్కెట్లు సానుకూలంగా ఉన్నా.. బడ్జెట్ ప్రవేశపెట్టనున్న దృష్ట్యా సూచీలు రోజంతా నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి. ప్రధానంగా ఫార్మా, ఎఫ్‌ఎంసిజి, మెటల్ రంగాలకు చెందిన షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ బ్యాంక్, ఫెనాన్షియల్ సర్వీస్ సూచీలు తప్ప మిగతా అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఇక బ్యాంక్ నిఫ్టీ 110 పాయింట్లు లాభపడి 27,379ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ పెట్రోలియం, బిపిసిఎల్, టెక్ మహీంద్రా, కోటక్ బ్యాంక్ 1 నుంచి 3శాతం లాభపడ్డాయి. సిప్లా, యుపిఎల్, హిందూస్తాన్ యూనిలివర్, టాటా స్టీల్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు 3 నుంచి 4శాతం నష్టపోయాయి. ఫార్మా అత్యధికంగా దాదాపు 2 శాతం పతనమవగా.. ఎఫ్‌ఎంసిజి, మెటల్ 1.4 శాతం చొప్పున క్షీణించాయి. పిఎస్‌యు బ్యాంక్స్ 0.5శాతం బలపడగా, ప్రైవేట్ బ్యాంక్స్ అదే స్థాయిలో బలహీనపడింది. నిఫ్టీ దిగ్గజాలలో డాక్టర్ రెడ్డీస్, టాటా స్టీల్, యుపిఎల్, హెచ్‌యుఎల్, సిప్లా, లుపిన్, ఐబి హౌసింగ్, సన్ పార్మా, ఇన్ఫోసిస్, కోల్ ఇండియా తిరోగమించాయి. మార్కెట్ల బాటలో చిన్న షేర్లలోనూ అమ్మకాలు తలెత్తడంతో మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం, స్మాల్ క్యాప్ 0.8 శా తం క్షీణించాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 1731 నష్టపోగా, 1091 షేర్లు లాభపడ్డాయి. నగదు విభాగంలో మంగళవారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ.105 కోట్లకుపైగా పెట్టుబడులను వెనక్కి తీసుతున్నారు. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 282 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి.





32% క్షీణించిన ఐసిఐసిఐ లాభం

ముంబై: దేశీయ అతిపెద్ద ప్రైవేటు బ్యాంక్ ఐసిఐసిఐ మూడో త్రైమాసిక ఫలితాల్లో నిరాశపర్చింది. డిసెంబర్ ముగింపునాటి క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల్లో బ్యాంక్ నికర లాభం రూ.1,650.24 కోట్లు నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,441.82 కోట్ల లాభంతో పోలిస్తే ఈసారి 32.42 శాతం క్షీణించింది. అదే విధంగా ఇంతకుముందు త్రైమాసికం(క్యూ2)లో లాభం రూ.2,058.19 కోట్లతో పోల్చిన లాభం 19.82 శాతం తగ్గుముఖం పట్టింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) రూ. 5,705.27 కోట్లు నమోదు చేయగా.. గతేడాది ఇదే సమయంలో రూ. 5,363.35 కోట్లతో పోలిస్తే ఆదాయం 6.37 శాతం పెరిగింది. దేశీయంగా నికర వడ్డీ మార్జిన్ 3.53 శాతంగా, అలాగే మొత్తం నికర వడ్డీ మార్జిన్ 3.14 శాతంగా ఉంది. ఐసిఐసిఐ బ్యాంక్ స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) రూ.46,038.70 కోట్లతో 20.88 శాతం పెరగ్గా.. గతేడాది ఇదే సమయం లో ఇది రూ.38,084.97 కోట్లుగా ఉంది. అయితే 2018 క్యూ2(జులై–సెప్టెంబర్)లో స్థూల ఎన్‌పిఎ రూ.44,488.54 కోట్లతో పోలిస్తే 3.48 శాతం పెరిగింది. శాతంలో చూస్తే స్థూలు ఎన్‌పిఎ క్యూ2లో 7.87 శాతంతో పోలిస్తే క్యూ3లో 7.82 శాతంతో స్థిరంగా ఉంది. 2017 డిసెంబర్ నాటికి కరెంట్, సేవింగ్ ఖాతా(సిఎఎస్ఎ) నిష్పత్తి 50.4 శాతంగా ఉంది.



ఫ్లిప్‌కార్ట్‌లో వాటాల కొనుగోలుకు వాల్‌మార్ట్ చర్చలు

న్యూఢిల్లీ: అమెరికా రిటైల్ దిగ్గజం వాల్ మార్ట్ సంస్థ భారత్ ఇ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమవుతోంది. ఈమేరకు రిటైల్ మార్కెట్‌లో వ్యాపారంపై ఇరు సంస్థలు చర్చలు కూడా నిర్వహిస్తున్నాయని సమాచారం. ఫ్లిప్‌కార్ట్‌లో కొంత వాటాలను సొంతం చేసుకునే దిశగా వాల్‌మార్ట్ చర్చలు జరుపుతో ందని తెలుస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌లో దాదాపు 20శాతం వా టా కొనుగోలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఫ్లిప్‌కార్టులో ఉన్న వాటాదారుల వద్ద నుంచి ప్రై మరీ, సెకండరీ సేల్ విధానంలో షేర్లు కొనుగోలు చేసే అవకాశం ఉండగా, ఈ ఒప్పందం మార్చి తొలి వారం లో పూర్తి కావొచ్చని భావిస్తున్నారు. ఈ వార్తలపై తామే మీ స్పందించబోమని వాల్‌మార్ట్ ప్రతినిధి రాన్డీ హర్‌గ్రోవ్ తెలిపారు.

రెండేళ్ల క్రితం ఫ్లిప్‌కార్టులో బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టేందుకు వాల్‌మార్ట్ సిద్ధమైనా అది ముందుకు జరగలేదు. ఇప్పుడు మళ్లీ చర్చలు జరుగుతున్న వార్తలు బయటికి వచ్చినా, అధికారింగా వెల్లడించాల్సి ఉంది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్ఠం	కనిష్ఠం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
భారతీ ఇన్‌ఫ్రాటెల్	353.95	343.20	351.55	344.45	7.10	2.06
కొటక్ మహీంద్రా	1,113.20	1,083.15	1,108.95	1,088.05	20.90	1.92
టెక్ మహీంద్రా	626.20	597.00	612.65	602.95	9.70	1.61
బిపిసిఎల్	493.60	483.35	492.30	485.60	6.70	1.38
హెచ్‌పిసిఎల్	400.65	388.20	397.70	393.00	4.70	1.20
రిలయన్స్	964.50	941.55	961.30	950.40	10.90	1.15
హిందాల్కొ	263.20	252.00	256.15	253.55	2.60	1.03
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,761.00	1,725.10	1,753.10	1,736.05	17.05	0.98
హెచ్‌డిఎఫ్‌సి	1,963.05	1,918.00	1,956.30	1,937.50	18.80	0.97
టాటా మోటర్స్	400.95	395.25	399.50	395.85	3.65	0.92

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్ఠం	కనిష్ఠం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
టాటాస్టీల్స్	747.90	701.70	705.05	739.15	34.10	4.61
డా. రెడ్డీస్ ల్యాబ్స్	2,306.15	2,203.55	2,225.35	2,306.15	80.80	3.50
యుపిఎల్	777.00	746.50	752.05	770.75	18.70	2.43
సిప్లా	608.50	590.00	592.15	605.95	13.80	2.28
హెచ్‌యుఎల్	1,400.00	1,362.60	1,369.35	1,400.25	30.90	2.21
లుపిన్	901.70	876.00	883.75	902.75	19.00	2.10
కోల్ ఇండియా	304.55	298.00	299.55	305.90	6.35	2.08
సన్‌ఫార్మా	594.90	575.05	579.90	591.95	12.05	2.04
టాటాపవర్	91.20	88.55	89.00	90.60	1.60	1.77
ఇన్ఫోసిస్	1,166.60	1,142.15	1,150.25	1,170.65	20.40	1.74



ఎస్‌బిఐ ఉదారత

● అనాధ విద్యార్థులకు రూ.14.96 లక్షల స్కూల్ బస్సు

● జిహెచ్‌ఎంసికి రూ. 6.97లక్షల వితరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ సర్కిల్ మరో సారి తన ఉదారతను చాటుకుంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా బ్యాంకు హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన మారుతి ఓల్డ్ ఏజ్, ఆర్ఫనేజ్ సొసైటీకి రూ. 14.96 లక్షల విలువైన మినీ స్కూల్ బస్సును కొనుగోలు చేసి జనరల్ సెక్రటరీ విజయకు ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ జె. స్వామినాథన్ అందజేశారు. ఎస్‌బిఐ ఈ ఏడాది ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మూడున్నర కోట్ల విలువైన ఆర్థిక సాయాన్ని వివిధ సంస్థలు, అనాధ పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ హాస్పిటళ్లకు అంబులెన్స్ తదితర వాహనాలను సమకూర్చేందుకు అందజేసినట్లు విశ్వనాథన్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థకు కూడా రూ.6.79 లక్షల విలువ చేసే 75 మినీ చెత్త కుండీల కొనుగోలు చేసేందుకు కమిషనర్ జనార్ధనరెడ్డికి ఎస్‌బిఐ ఉన్నతాధికారులు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ జిఎంలు ప్రబోధ్ పారిఖ్, యూఎన్‌ఎన్ మఇయా, ఎస్. మనికందన్, కెపి. మల్లిక, అలాగే డిజిఎం అండ్ సీడిఓ బంగారు రాజు పాల్గొన్నారు.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	35965.02	-68.71	-0.19%
నిఫ్టీ	11027.70	-21.95	-0.20%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29000	31016.04	0.28%
ముంబై	29820	31893.05	0.13%
ఢిల్లీ	29200	31229.95	-0.34%
కోల్‌కతా	29830.99	31904.80	0%
కేరళ	28000	29946.52	0%
బెంగళూరు	28400	30374.33	0%
హైదరాబాద్	29000	31016.04	0.49%
గల్ఫ్	1430.55	1530.00	0.66%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	42200.00	42000.00	0.48
ముంబై	42200.00	42000.00	0.48
ఢిల్లీ	42200.00	42000.00	0.48
కోల్‌కతా	42200.00	42000.00	0.48
హైదరాబాద్	42200.00	42000.00	0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	390	విశాఖపట్నం	400
వరంగల్	392	చిత్తూరు	393
విజయవాడ	396	చెన్నై	400
గోదావరి	396	బెంగళూరు	395

కొత్త రూ.50, రూ.200 నోట్లను పరీక్షించాలి : హైకోర్టు



న్యూఢిల్లీ: కొత్తగా విడుదలైన రూ.50, రూ.200 నోట్లను పరీక్షించాలని కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ)ని బుధవారం ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కొత్త నోట్లను గుర్తించి, వినియోగించడంలో అంధులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని పేర్కొంది. ముగ్గురు న్యాయవాదులు, ఆల్‌ఇండియా కన్ఫెదరేషన్ ఆఫ్ బ్లైండ్, ఎన్‌జిఒ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి హరిశంకర్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం విచారణకు స్వీకరించింది. నోట్ల పరిమాణం, స్పర్శ సంబంధిత గుర్తులను కనుగొనడం కష్టమవుతోందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ, పిటిషన్‌దారులు కలిసి పరిష్కరించుకోవాలని సూచించింది. నోట్లను విడుదలకు ముందే సంబంధిత అధికారులు పలువురు దృష్టి సంబంధిత నిపుణులు, ఈ రంగంలో పనిచేసిన వారిని సంప్రదించి ఉంటే బాగుండేదని పేర్కొంది. గతంలో మాదిరిగా కొత్తనోట్లను ఎందుకు తీసుకురాలేకపోయారని సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 16లోపు సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది

కాస్‌గంజ్ హింస: పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

లక్నో: పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో చందన్‌గుప్తా హత్యలో ప్రధాన నిందితుడు సలీంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్యలో సలీంతోపాటు ఆయన ఇద్దరు సోదరులు నసీం, వసీంలు నిందితులుగా ఉన్నట్లు అలీఘర్ రేంజ్ ఐజి సంజీవ్ గుప్తా తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్తున్న యుకులపై కొందరు రాళ్లతో దాడి చేశారు. దీంతో కాస్‌గంజ్‌లో మతఘర్షణలు చెలరేగాయి. తుపాకీ గుళ్ల గాయాలతో 22 ఏళ్ల కాలేజ్ విద్యార్థి చందన్ గుప్తా చనిపోయిన తర్వాత కనీసం మూడు దుకాణాలు, రెండు బస్సులు, ఒక కారు దగ్ధమైంది. కాస్‌గంజ్ అల్లర్లకు సంబంధించి 150 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. చందన్‌గుప్తాపై తానే కాల్పులు జరిపినట్లు సలీం ఒప్పుకున్నాడని ఐజి తెలిపారు. పరారీలో ఉన్న ఆయన ఇద్దరు సోదరుల కోసం వెతుకుతున్నామని ఆయన తెలిపారు. నిందితుల ఆస్తులను జప్తు చేసేందుకు వారి ఇంటి ముందు నోటీసులు అతికించినట్లు ఎస్‌పి పియూష్ శ్రీవాస్తవ తెలిపారు. కాసన్‌గంజ్‌లో నెమ్మదిగా శాంతియుత పరిస్థితులు నెలకొంటున్నాయని, సున్నిత ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జియా ఆత్మహత్యకు ప్రియుడే కారణం!



ముంబయి: బాలీవుడ్ నటి జియా ఖాన్ ఆత్మహత్య కేసు కీలక మలుపు తిరిగింది. జియా ప్రియుడైన బాలీవుడ్ హీరో సూరజ్ పంచోలీ ఆమె ఆత్మహత్యకు కారణమని ముంబయి సెషన్స్ కోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆత్మహత్యకు కారణమైన ఆయనపై ఐపిసి సెక్షన్ 306 కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ తీర్పు పట్ల సూరజ్, ఆయన కుటుంబ సభ్యులు స్పందించారు. ఈ కేసు ఇప్పటికైనా ఓ కొలిక్కి వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. దీని కోసం కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. 'మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ రోజు కోసం గత నాలుగున్నరేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు కేసు సరిగ్గా గాడిలో పడింది. ఇక మేం నిజమైన పోరాటం చేస్తాం. మేము దీనికి సిగ్గుపడితే సూరజ్‌కు శిక్షపడుతుంది. కాదని ఓపెన్‌గా ఉంటే అతడు బయటపడుతాడు.' అని సూరజ్ తండ్రి ఆదిత్యా పంచోలీ మీడియాతో చెప్పారు.

త్రిపురలో పర్యటించనున్న ప్రధాని

అగర్తలా : త్రిపురలో ఫిబ్రవరి 18న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బహిరంగ సమావేశాల్లో పాల్గొనేందుకు ఎన్నికల్లోపు రెండు సార్లు ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి రానున్నట్లు త్రిపుర బిజెపి అధ్యక్షుడు బిప్లబ్ కుమార్ దేబ్ చెప్పారు. 8వ తేదీన దక్షిణ త్రిపుర జిల్లా శాంతిర్‌బజార్, ఉనాకోటి జిల్లాలోని కైలాష్‌హర్‌లో జరిగే రెండు బహిరంగ సభలకు ప్రధాని హాజరవుతారన్నారు. అదే విధంగా 15వ తేదీన అగర్తలాలో జరిగే సభలో పాల్గొనేందుకు మరలా 15వ తేదీన మోడీ రాష్ట్రానికి విచ్చేయనున్నట్లు ఆయన చెప్పారు. కాగా, బిజెపి–ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) కూటమి నుంచి బరిలోకి దిగే అభ్యర్థుల తరుపున ప్రచారం చేసేందుకు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వారం రోజుల పాటు రాష్ట్రంలోనే ఉండనున్నట్లు దెబ్ మీడియాకు వెల్లడించారు. 60 స్థానాలు ఉన్న రాష్ట్ర అసెంబ్లీకి ఫిబ్రవరి 18న ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 3న ఫలితాలను వెల్లడించనున్నారు. అయితే ఫిబ్రవరి 27న అసెంబ్లీ ఎన్నికలు జరిగే మేఘాలయ, నాగాలాండ్‌లను కూడా అమిత్ షా త్రిపుర రాష్ట్రం నుంచే పర్యటిస్తారని దెబ్ పేర్కొన్నారు. ప్రచారంలో పాల్గొనేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల శాఖమంత్రి సుష్మా స్వరాజ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీతో సహా 40 మంది బిజెపి అగ్ర నాయకులు రాష్ట్రానికి విచ్చేయనున్నట్లు దెబ్ వివరించారు.

జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయం



న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలకు బీహార్ ముఖ్యమంత్రి, జెడియు చీఫ్ నితీశ్‌కుమార్ అనుకూలమని ప్రకటించారు. బుధవారంనాడిక్కడ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అనంతరం జమిలి ఎన్నికలపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అన్ని రాష్ట్రాలతో చర్చించి ఏకాభిప్రాయం తీసుకురావాలని కోరారు. ఇది ఇప్పటికిప్పుడే సాధ్యమవుతుందని తాను అనుకోవడంలేదన్నారు. మెల్లమెల్లగా రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచించారు. తమ రాష్ట్రంలో అయితే ఇప్పుడు జమిలి ఎన్నికలు సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఇటీవల పార్లమెంట్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగంలో జమిలి ఎన్నికల ప్రస్తావన తర్వాత ప్రధాని మోడీకి కూడా ఎన్‌డిఎ పక్షాలతో చర్చించాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ నేపథ్యంలో నితీశ్ ప్రకటన వెలువడం ప్రాధాన్యత సంతరించుకుంది.

బిజెపి వైఖరేమిటో చెప్పాలి

కొహిమ : నాగాలాండ్‌లో ఏళ్ల తరబడి సాగుతున్న నాగా రాజకీయ వివాదానికి పరిష్కారాన్ని కనుగొనేందుకు కట్టుబడి ఉన్నారో, లేదో స్పష్టం చేయాలని నాగా గిరిజన సంఘాలు రాష్ట్ర బిజెపి శాఖను డిమాండ్ చేశాయి. రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయొద్దని అన్ని పార్టీలు కలిసి సంయుక్తంగా నిర్ణయం తీసుకున్న మరుసటి రోజే బిజెపి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నది. దీంతో రాష్ట్రంలో అయోమయం నెలకొన్న నేపథ్యంలో తన వైఖరి ఏమిటో వెల్లడించాలని నాగా గిరిజన హోహో కోర్ కమిటీ, పౌర సంఘాలు బిజెపిని డిమాండ్ చేశాయి. ఎన్నికలకంటే ముందు నాగా రాజకీయ సమస్యను పరిష్కరించాలన్న గిరిజన, పౌర సంఘాల కోరికను అంగీకరించేంత వరకు ఫిబ్రవరి 27న రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన కూడదని నాగా పీపుల్స్ ఫ్రంట్, బిజెపి, కాంగ్రెస్‌తో సహా 11 రాజకీయ పార్టీల ప్రతినిధులు సోమవారం నిర్ణయం తీసుకున్నాయి. బిజెపి అధినాయకత్వం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు విసాసొలి లూంగొ చెప్పారు. అయితే సంయుక్త ప్రకటనపై సంతకం చేసిన పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు ఖెటో సెమాపార్టీని బిజెపి సస్పెండ్ చేసింది. ఎన్నికల నిర్వహణకు ముందుగా నాగా సమస్యను పరిష్కరించాలన్న గొంతులను నొక్కేందుకే బిజెపి డ్రామాలాడుతోందని కోర్ కమిటీ కన్వీనర్ తేజ తెర్హీ, కో కన్వీనర్ డేవిడ్ సంగటంలు ఒక ప్రకటనలో విమర్శించారు. సంయుక్త ప్రకటనపై సంతకం చేసిన తరువాత బిజెపి ద్వంద్వ వైఖరిని అవలంబించ కూడదని సూచించారు.



భారత నౌకాదళానికి చెందిన కొత్త సబ్‌మెరైన్ కరంజ్‌ను బుధవారం జలప్రవేశం చేయించారు. నేవీ చీఫ్ అడ్మిరల్ లాంబా భార్య రీనా లాంబా జలాంతర్గామిని ఆవిష్కరించారు. మజగావ్ డాక్ లిమిటెడ్ సంస్థ దీన్ని నిర్మించింది. అయితే మరో ఏడాది పాటు దీన్ని పూర్తిగా పరీక్షించనున్నారు. ఆ తర్వాతే దీనిని నేవీకి అప్పగిస్తారు. మజగావ్ డాక్ సంస్థలో మొత్తం ఆరు జలాంతర్గాములను నిర్మిస్తున్నట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ లాంబా తెలిపారు. ఫ్రెంచ్ నౌకా నిర్మాణ సంస్థ సహకారంతో ఈ సబ్‌మెరైన్లను అభివృద్ధి చేస్తున్నారు. స్కార్పీన్ క్లాస్‌కు చెందిన కల్వరీ సబ్‌మెరైన్‌ను ఇటీవల ప్రధాని మోడీ జలప్రవేశం చేయించారు.

8 నెలల శిశువుపై అన్న అత్యాచారం

ఈ ఘోరంపై సుప్రీంకోర్టు ఆందోళన

న్యూఢిల్లీ: ఎనిమిది నెలల శిశువుపై అత్యాచారం కేసును సుప్రీంకోర్టు బుధవా రం విచారించాల్సి ఉంది. కానీ విచారణను మంగళవారంకు ఖరారు చేసిం ది. ఈ కేసులో సాయం అందించాలని ఢిల్లీ న్యాయసేవల అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఆ శిశువు ఆరోగ్యపరిస్థితిపై సుప్రీంకోర్టు చాలా ఆందోళనను వ్యక్తం చేసింది. ఆ శిశువుపై ఆమె 27 ఏళ్ల కజిన్ బ్రదర్ అత్యాచారం చేయడంతో తీవ్ర గాయాలపాలుకాగా ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్చారు. ఢిల్లీలోని షాకుర్ బస్తీలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పని చేసే ఆ శిశువు తల్లిదండ్రులు ఆమెను బంధువుల ఇంట్లో వదిలి వెళ్లాగా ఈ దురాగతం జరిగిం ది. శ్రామికుడైన అయిన ఆ శిశువు తండ్రి తమ అన్న ఇంట్లో శిశువును వది లి వెళ్లినట్లు తెలిపాడు.ఆయన అన్న కుమారుడే ఈ కేసులో నిందితుడుగా ఉన్నాడు. తన భార్య పని నుంచి ఇంటికి రాగానే శిశువు బెడ్ మీద నెత్తురోడుతున్న బట్టల్లో తడిసి కనిపించిందని ఆ శిశువు తండ్రి వివరించారు. ఆ శిశువు తల్లి నిందితుడిని నిలదీయగా శిశువు తనపై మూత్రం పోసిందని చెప్పా డు. ఆ శిశువును డాక్టరు వద్దకు తీసుకెళ్లగా పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాలని సూచించి మరి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. ఆశిశువు ఇప్పుడు జీవన్మరణ పోరాటం చేస్తోంది. శిశువు కజిన్ బ్రదర్‌ను అరెస్టు చేశారు.

ఇద్దరు బిజెపి ఎంఎల్‌ఎలపై అనర్హత కత్తి?

గుజరాత్ ఎన్నికల ప్రచారంలో పరిమితికి మించి ఖర్చు

న్యూఢిల్లీ : గుజరాత్‌లో ఇద్దరు బిజెపి ఎంఎల్‌ఎలపై అనర్హత కత్తి వేలాడుతోంది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నిబంధనలకు మించి ఖర్చు చేయడమే దానికి కారణం. హిమత్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందిన రాజేంద్ర సింగ్ చావ్డా, సంత్రాంపూర్ (ఎస్‌టి) రిజర్వ్‌డు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కుబేర్‌భాయి మన్సుఖ్ భాయి ఎన్నికల్లో పరిమితికి మించి ఖర్చు చేశారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి రూ.28లక్షలకు మించి ఖర్చు చేయడానికి వీలు లేదని ఎన్నికల కమిషన్(ఇసి) నిబంధన విధించింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 78 ప్రకారం ఎన్నికల ఫలితాలు వెలువడిన 30రోజుల్లోగా ప్రచార ఖర్చుల వివరాలతో కూడిన అఫిడవిట్‌ను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు అభ్యర్థులు సమర్పించాల్సి ఉంటుంది. ఆ గడువు తేదీ గత నెల 17తో ముగిసింది. అయితే ఎంఎల్‌ఎ రాజేంద్ర సింగ్ పరిమితికి మించి రూ. 5,78,309, మరో శాసనసభ్యుడు మన్సుఖ్ భాయి రూ.95,766 ఖర్చు చేశారని, ఎన్నికల కమిషన్‌కు అందజేసిన అఫిడవిట్‌లో వారే స్వయంగా అంకెలతో సహా పేర్కొన్నారని ప్రజాస్వామిక సంస్కరణల సంఘం(ఎడిఆర్)



పేర్కొంది. ఇద్దరు ఎంఎల్‌ఎలు సమర్పించిన అఫిడవిట్‌లు ఆ రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో కూడా నిక్షిప్తమై ఉన్నాయని పేర్కొంది. 182మంది ఎంఎల్‌ఎలలో సగానికి పైగా(59శాతం) శాసనసభ్యులు పరిమితికి లోబడి సరాసరి రూ.16.45లక్షలు ఖర్చు చేసినట్టు అఫిడవిట్‌లలో తెలిపారు. లూనావాలా నుంచి గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి రతన్ సింగ్ రాథోడ్ అతి తక్కువగా రూ.3లక్షలు మాత్రమే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేసినట్లు పేర్కొనగా, బెచరాజి నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ ఎంఎల్‌ఎ భరత్‌జీ ఠాకూర్ రూ.3.81లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. శాసన సభ్యుల్లో 22శాతం మంది ప్రచారానికి సొంత నిధులు వెచ్చించామని చెప్పగా.. 67శాతం బంధువులు, స్నేహితుల దగ్గర నుంచి తీసుకున్నామని, మరో 11శాతం రుణాలు, బహుమతులు, డొనేషన్ల రూపంలో సేకరించుకున్నట్టు వివరించారు. అయితే ఇప్పుడు నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికల కమిషన్ ఏం చర్య తీసుకుంటుందోనన్న దానిపై ఆసక్తి నెలకొంది.

నేడు హైదరాబాద్‌కు చైతన్య భౌతికకాయం

హోస్టన్: అమెరికాలోని టెక్సాస్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వెంకన్నగిరి కృష్ణ చైతన్య భౌతికకాయం గురువారం భారత్‌కు చేరుకోనుంది. మృతదేహాన్ని న్యూయార్క్ మీదుగా హైదరాబాద్‌కు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భారత కాన్సులేట్ సీనియర్ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని మృతుడి తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామన్నారు. చైతన్య మృతదేహానికి హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. చైతన్య మృతికి గల కారణాలపై ఇంకా అనుమానాలు కొనసాగుతున్నాయి. ఆయన భౌతిక కాయానికి పంచనామా పూర్తి అయినప్పటికీ ఇంకా వివరాలు వెల్లడికాలేదని డిప్యూటీ కౌన్సెల్ జనరల్ సురేంద్ర ఆదాన్ మీడియాకు తెలిపారు. మూడేళ్ల క్రితం ఉద్యోగ వీసాపై అమెరికా వెళ్లిన చైతన్య కాగ్నిజెంట్ టెక్నాలజీస్‌లో సౌత్ ఈస్టు ఎయిర్‌లైన్స్ ప్రాజెక్టుపై పని చేస్తున్నారు.

మోడీకి కావాలంటే రూ.700కే కొనిస్తాం

రాహుల్ గాంధీ బుర్బెర్రీ జాకెట్‌పై బిజెపి, కాంగ్రెస్ మాటల యుద్ధం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవల షిల్లాంగ్ సందర్శించినప్పుడు రూ. 63,000 జాకెట్ ధరించారని బిజెపి గగ్గోలు పెట్టడంపై కాంగ్రెస్ పార్టీ బుధవారం నవ్వుకుంది. 'బిజెపి నిరాశ చూసి నవ్వాలో ఏడ్వాలో కూడా నాకైతే అర్థం కావడంలేదు. కూర్చుని రేట్లు వెదకడం తప్ప వారికి వేరే పని లేదా అనిపిస్తోంది. రాహుల్ గాంధీ వేసుకునటువంటి జాకెట్ రూ. 700కే దొరకడాన్ని నేను చూపిస్తాను. ఒకవేళ ప్రధానికి కూడా అలాంటి జాకెట్ కావాలంటే ఒకటి కొని పంపిస్తాను' అని కాంగ్రెస్ నాయకురాలు రేణుక చౌదరి ఎఎన్‌ఐ వార్తా సంస్థతో అన్నారు. రాహుల్ గాంధీ ధరించిన బుర్బెర్రీ జాకెట్ ధర 995 డాలర్లు, అంటే మన కరెన్సీలో దాదాపు రూ. 63,400 ఉంటుందని మేఘాలయ బిజెపి చేసిన ట్వీట్ ప్రతిస్పందనగా ఆమె ఈ మాటలన్నారు. 2015లో బీహార్ ఎన్నికల ప్రచారం సందర్భంలో రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ వేసుకున్న సూట్‌బూట్‌పై చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు ప్రతిదాడిగానే బిజెపి రాహుల్ గాంధీ జాకెట్ ధరపై వ్యాఖ్యానాలు చేసింది. నాడు బీహార్ ఎన్నికల ప్రచారం సందర్భంగా చంపారన్ ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ ' నిరుపేద రైతులకు నేతృత్వం వహించినప్పుడు మహాత్మాగాంధీ సూట్‌ను ధరించడం వదిలేసి ధోతి ధరించారు, కానీ చాయ్ అమ్మేవాడిగా (చాయ్‌వాలా) జీవితం ఆరంభించిన మోడీ ప్రధాని అయ్యాక రూ. 15 లక్షల సూట్ ధరించడం ఆరంభించారు' అని వ్యాఖ్యానించారు. నాడు అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత్‌లో పర్యటించినప్పుడు ఆయనతో సమావేశమైన మోడీ ఖరీదైన సూటు ధరించారని, అది వేలంలో రూ. 4.31 కోట్లకు అమ్ముడుపోయిందని, దానిపై చారలు, మెరిసే బంగారు అక్షరాలతో నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ అన్న పేరు ఉన్నాయిన తెలిపారు. నాటి రాహుల్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిదాడిగానే బిజెపి నేడు రాహుల్ జాకెట్ ధరపై విరుచుకుపడింది.



సూపర్, బ్లూ, బ్లడ్ మూన్

ఆకాశంలో అరుదైన అద్భుత దృశ్యం ఆవిష్కరణ

హైదరాబాద్: దాదాపు 36 ఏళ్ల తర్వాత చంద్రుని అపురూప దృశ్యం ఆకాశంలో బుధవారం ఆవిష్కృతమైంది. సూపర్ మూన్, బ్లూ మూన్, బ్లడ్ మూన్ అనే మూడు కలిసిన దృశ్యం ప్రపంచవ్యాప్తంగా కనిపించింది. అనేక దేశాల ప్రజలు దీనిని చూశారు. 1982 తర్వాత ఇలాంటి అద్భుత దృశ్యం ఆకాశంలో కనపడడం ఇప్పుడే. సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా భూమి పూర్తిగా ఛాయలోనే ఉండిపోవడంతో జాబిల్లి ముదురు ఎరుపురంగులో(బ్లడ్ మూన్‌గా) కనిపించాడు. ఈ సంపూర్ణ చంద్రగ్రహణం సాయంత్రం 4.21 గంటలకు ప్రారంభమై రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ముగిసింది. ఆసియా, తూర్పు రష్యా, మధ్యప్రాచ్యం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ఈ ఖగోళ వింత కనిపించింది.

భారత్‌లో... బ్లూమూన్

దేశవ్యాప్తంగా సంపూర్ణ చంద్ర గ్రహణం దర్శనమిచ్చింది. చందమామ(సెలీన్)పై పాక్షిక ఛాయ లేదా భూమికి చెందిన ఉపఛాయతో బుధవారం సాయంత్రం 5.20కి భారత్‌లో కనిపించడం ఆరంభమైంది. ప్రధాన గ్రహణం మాత్రం సూర్యాస్తమయం తర్వాత 6.25 నిమిషాలకు ప్రారంభమై, తూర్పు దిక్కున ఆకాశంలో కనిపించింది. ఈ నెల 1వ తేదీన తొలి పౌర్ణమి ఏర్పడింది. మళ్లీ 28 రోజుల్లోనే పౌర్ణమి రావటంతో ...అంటే ఒకే నెలలో వచ్చే రెండో పౌర్ణమిని బ్లూమూన్ అంటున్నారు.

సూపర్ మూన్...

చంద్రుడు పూర్ణ బింబంతో ఒక స్థిర కక్ష్యలో కాకుండా అటుఇటుగా(అప్సిడల్ ప్రిసిషన్)లో భ్రమించడంతో కొన్ని సంర్భాల్లో భూమికి మరింత సమీపంలోకి వస్తాడు. ఇలాంటి సందర్భాల్లో పున్నమి రోజుల్లో సూర్యుడికి ఎదురుగా చంద్రుడు వస్తాడు. ఈ కారణంగా చంద్రుడి పరిమాణం పెరిగినట్లుగా కనిపిస్తుంది. ఇలా చంద్రుడు పెద్దగా కనిపించడాన్నే సూపర్‌మూన్‌గా పిలుస్తారు. ఆకాశంలో కనిపించిన చంద్రుని అద్భుత దృశ్యాలను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) ప్రత్యక్ష ప్రసారం చేసింది. మళ్లీ 2037 వరకు ఇలాంటి 'సూపర్, బ్లూ, బ్లడ్ మూన్' కనిపించబోదు.

జడ్జి శుక్లా తొలగింపుకు సిఫార్సు

భారత ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం



ఎస్.ఎన్. శుక్లా దీపక్ మిశ్రా

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.ఎన్. శుక్లాను తొలగించేందుకు సిఫార్సు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నిర్ణయించుకున్నారు. మెడికల్ కాలేజ్ అడ్మిషన్ కుంభకోణంలో జరిపిన అంతర్గత దర్యాప్తులో శుక్లా ప్రవర్తన సరిగా లేదని తేలడంతో ఆయన తొలగింపుకు సిఫార్సు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి, ప్రధానికి లేఖలు రాయాలని ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించుకున్నారని బుధవారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇందిరా బెనర్జీ, సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.కె.అగ్నిహోత్రి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి పి.కె. జైస్వాల్‌లతో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ జరిపిన అంతర్గత విచారణలో న్యాయమూర్తి శుక్లాపై వచ్చిన అభియోగాలు సరైనవేనని తేలింది. ఆయన నేరానికి సంబంధించిన ఆధారాలు కూడా లభించడంతో ఆయనను పదవి నుంచి తొలగించాలన్న నిర్ణయానికి వచ్చారు. కమిటీ ఇచ్చిన నివేదిక అనంతరం శుక్లా రాజీనామా అయి నా చేయాలి లేక స్వచ్ఛంద పదవీ విరమణనైనా కోరుకోవాలని ప్రధాన న్యా యమూర్తి దీపక్ మిశ్రా సూచించారు. అయితే ఆయన అలా చేయడానికి నిరాకరించారని సమాచారం. దాంతో న్యా యస్థాన పని నుంచి వెంటనే తొలగాలని ప్రధాన న్యాయమూర్తి ఆయనను మంగళవారం ఆదేశించారు. దాంతో ఆయన దీర్ఘకాల సెలవుపై వెళ్లారని సమాచారం. శుక్లా రాజీనామా చేయనందున ప్రధాన న్యాయమూర్తి ఆయన తొలగింపును సిఫార్సు చేస్తూ రాష్ట్రపతి, ప్రధానికి రాయక తప్పడం లేదు.

కొనసాగుతున్న సుప్రీంకోర్టు సంక్షోభం

సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులు జనవరి 12న లేవనెత్తిన అంశాలతో తలెత్తిన సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతున్నది. సంక్షోభ పరిష్కారానికి భారత న్యాయమూర్తి దీపక్ మిశ్రా బుధవారం లంచ్‌లో ఇతర న్యాయమూర్తులతో సమావేశమయ్యారు. నాడు పత్రికా సమావేశంలో నలుగురు న్యాయమూర్తులకు నేతృత్వం వహించిన జె.చలమేశ్వర రావు బుధవారం చర్చల్లో పాల్గొనలేదు. ఆయన సెలవులోఉన్నారు. న్యాయమూర్తి ఎ.కె.గోయెల్ ఏర్పాటు చేసిన లంచ్ సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సమావేశమయ్యారు. అయితే చర్చల ఫలితమేమిటన్నది తెలియలేదు. జనవరి 12న న్యాయమూర్తులు జె.చలమేశ్వర రావు, రంజన్ గగోయ్, ఎం.బి.లోకుర్, కురియన్ జోసఫ్ అనేక సమస్యలను లేవనెత్తారు. అందులో సుప్రీంకోర్టు కేసుల సమస్య కూడా ఉంది. ఇంకా దేశంలోని హైకోర్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వారు లేవనెత్తారు.సుప్రీంకోర్టు లాన్‌లో మంగళవారం జరిగిన వేడుకకు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు లోకుర్, జోసఫ్‌హాజరయ్యారు. వారు ఒకరితో మరొకరు కరచాలనం చేస్తూ కనిపించారు.

వాయుసేన అధికారి గూఢచర్యం?

న్యూఢిల్లీ: గూఢచర్యానికి పాల్పడుతున్నాడన్న కారణంగా భారత వాయుసేనాధికారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఉత్తర్వులకు విరుద్ధంగా కొన్ని అనుమతించని ఎలక్ట్రానిక్ పరికరాలతో అతడు అవాంఛనీయ కార్యకలాపాలు సాగిస్తున్నాడని వాయుసేన అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆ అధికారిని భారత వాయు సేనకు చెందిన సెంట్రల్ సెక్యూరిటీ, దర్యాప్తు బృందం ప్రశ్నిస్తోంది. అయితే ఈ విషయంపై భారత వాయుసేన అధికారులు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఎవరికైనా ఆ అధికారి సున్నితమైన సమాచారాన్ని చేరవేశాడా? అన్న విషయాన్ని కూడా దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారని సమాచారం.

గురుకుల పోస్టుల పరీక్షల షెడ్యూల్ విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : వివిధ గురుకుల విద్యాలయాల్లో జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, లైబ్రేరియన్, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు నిర్వహించే ప్రధాన పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 19 నుంచి 23 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు (సిబిఆర్‌టి) నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. తొలిరోజు జూనియర్ లెక్చరర్, రెండవరోజు లెక్చరర్, మూడవ రోజు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, నాల్గవ రోజు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చివరి రోజు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు పరీక్షలు జరుగుతాయి.

ఫిబ్రవరి 19	జూనియర్ లెక్చరర్	పేపర్–1(పెడగాజి), పేపర్–2(సంబంధిత సబ్జెక్ట్)
ఫిబ్రవరి 20	డిగ్రీ లెక్చరర్	పేపర్2(సంబంధిత సబ్జెక్ట్)
ఫిబ్రవరి 20	డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్	లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్
ఫిబ్రవరి 2	గురుకుల పాఠశాలల్లో ప్రిన్సిపాల్	పేపర్1
ఫిబ్రవరి 21	గురుకుల పాఠశాలల్లో ప్రిన్సిపాల్	పేపర్2
ఫిబ్రవరి 22	గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్	పేపర్1
ఫిబ్రవరి 22	గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్	పేపర్2
ఫిబ్రవరి 23	గురుకుల జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్	ఫిజికల్ ఎడ్యుకేషన్
ఫిబ్రవరి 23	గురుకుల డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్	ఫిజికల్ ఎడ్యుకేషన్



బడ్జెట్‌కు ముందే రుణమాఫీ సమస్యలు పరిష్కరించాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతులకు రుణమాఫీ జరగడం లేదని, బ్యాంకులు సహకరించడం లేదని టిడిపి ఎంఎల్‌సి సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. రుణమాఫీ, వడ్డీ మాఫీలపై అసెంబ్లీ సమావేశాల ఉంటే స్పీకర్ వద్ద పడిగె పరిష్కారం చేస్తామని సిఎం కె. చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని, ఇప్పటికీ వాటికి మోక్షం లభించ లేదన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో పొలిట్‌బ్యూరో సభ్యుల రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సండ్ర గురువారం మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌కు ముందే స్పీకర్ వద్ద ఉన్న రైతు రుణమాఫీ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో 20 వేల మంది అర్హులైన రైతులకు రూ. 120 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉందని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా ఫలితం లేదన్నారు. ఉపాధి హామీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలతో వేరు పనులు చేయిస్తున్నారన్నారు. ఆ విధంగా రూ. 420 కోట్లు మళ్లింపు జరిగిందని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన సంపూర్ణ వైఫల్యాల పుట్ట అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. 24 గంటల విద్యుత్ ఇస్తామని ఓ వైపు చెబుతూనే మరోవైపు మంత్రులు రోజంతా విద్యుత్ అవసరం లేదని తీర్మానాలు చేయిస్తున్నారన్నారు.

రూపాయిలో 45 పైసలు కేంద్రానివే : బిజెపి



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయిలో 45 పైసలు కేంద్రం నుంచి అందినవేనని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగులరాకేష్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు, సహకారం విషయం లో రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం బిజెపి మీడియా కన్వీనర్ సుధాకర్‌శర్మతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంరూ.3,56,375 కోట్లు కాగా,ఇందులో కేంద్ర నిధులు రూ. 1,58,000 కోట్లు అని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.21,631 కోట్లు కేటాయించగా, డిసెంబర్ నాటికి రూ.19,601 కోట్లను విడుదల చేసిందన్నా రు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్రానికి రూ. 9వేల కోట్లను విడుదల చేసిందన్నారు. మిషన్‌భగీరథకు రూ 3,900కోట్లు, మిషన్ కాకతీయకు రూ.677 కోట్ల నిధులను విడుదలచేసిందని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ భూముల ఆక్రమణలపై చర్యలు శూన్యం : సేవ్ వక్ఫ్ ప్రాపర్టీస్

మన తెలంగాణ / హైదరాబాద్ : వక్ఫ్ ఆస్తుల కబ్జాలు, ఆక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సేవ్ వక్ఫ్ ప్రాపర్టీస్ సంస్థ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇఫ్తెకార్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలని, అయితే వాటిని కొనుగోలు చేసిన ప్రజలకు మాత్రం అన్యాయం జరుగకుండా టెనెంట్లుగా చేయాలని సూచించారు. వక్ఫ్‌బోర్డుకు జ్యుడిషియల్ అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు మునిసిపల్ పాలకులకు పాలకవర్గాన్ని రద్దు క్రితం అప్పటి వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అసదుల్లా చొరవ తీసుకోవడంతో వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్లపై నిషేధం అమల్లోకి వచ్చిందని, అయినా క్రయ విక్రయాలు ఆగలేదని, కోట్లాది రూపాయల వక్ఫ్ ఆస్తులు స్వాహా అవుతున్నా బోర్డు, రెవెన్యూ విభాగం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. నగర శివారులోని రాజేంద్రనగర్ మండల పరిధిలో మీర్ మోమిన్ పహాడి దర్గాకు చెందిన 400 ఎకరాల భూమిలో ఆక్రమణలు వెలుస్తున్నాయని, ప్లాట్లుగా చేసి యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు వక్ఫ్‌బోర్డుకు ఫిర్యాదులు కూడా అందాయని, రాజకీయ అండదండ లు ఉండడంతో బోర్డు సీరియస్‌గా పట్టించుకోలేదని గుర్తుచేశారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి రీడిలు రాయడంతోనే సరిపెట్టుకున్నారని, కళ్ళముందే కోట్లాది రూపాయల నష్టం వక్ఫ్‌బోర్డుకు వాటిల్లుతోందన్నారు.

రైల్వేలో వికలాంగులకు సదుపాయాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) పరిధిలోని అన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్లు, పరిసర ప్రాంతాల్లో వికలాంగుల రైల్వే స్టేషన్ లోపలికి చేరుకోవడానికి వీలుగా బారికేడ్లు లేని ర్యాంప్, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, భవనాల వరకు చేరుకోడానికి ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక సూచికలు, మూత్రశాలలు,మరుగుదొడ్లు, ప్రత్యేక నీటి కుళాయిలు, ట్రాక్ మార్గాలతో పాటు అన్ని ప్రధాన స్టేషన్లలో రెండు చక్రాల కుర్చీలను ఎస్‌సిఆర్ ఏర్పాటు చేసింది. ఈ సదుపాయాలను ఎ1 కేటగిరి రైల్వే స్టేషన్‌లైన సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, విజయవాడ, తిరుపతితో పాటు 31 'ఎ' కేటగిరి, 38 'బి' కేటగిరి రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసింది. సి, డి, ఇ కేటగిరిలలోని రైల్వే స్టేషన్లలో కూడా దశలవారీగా ఈ సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌సిఆర్ సిపిఆర్‌ఓ ఎం.ఉమాశంకర్‌కుమార్ ఒక ప్రకటనలో వివరించారు.

రైల్వే ట్రాక్ మెయింటనర్లకు ఆధునాతన పరికరాలు సమకూర్చాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వేలో భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ట్రాక్ మెయింటేనర్లకు ఆధునాతన పరికరాలను సమకూర్చాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్), ఎస్‌ఆర్ ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య కేంద్ర రైల్వే శాఖను డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 70 వేల ట్రాక్ కిలోమీటర్ల రైల్వే లైన్లలో దాదాపు 2 లక్షల మంది ట్రాక్ మెయింటెనర్లు దయనీయమైన పరిస్థితుల్లో భద్రతా విధులను నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన రైల్వే మంత్రికి బుధవారం ఒక లేఖ రాశారు. అడవులు, మారుమూల ప్రాంతాలు,ప్రజల నివాసం లేని అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల నుంచి ఏండ్ల తరబడి ప్రమాదకర పరిస్థితుల్లో ట్రాక్ మెయింటనర్లు అత్యంత చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నప్పటికీ వారి సదుపాయాలపై రైల్వే శాఖ తగిన దృష్టి సారించడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైల్వే శాఖ స్పందించి ట్రాక్ మెయింటనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగాల రద్దు ఆలోచనను విరమించుకోండి : ఎఐవైఎఫ్

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ శాఖల్లో ఐదేళ్ల నుంచి ఖాళీగా వున్న పోస్టులను రద్దు చేయాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిద్దెని కర్ణ కుమార్, ప్రధానకార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు దేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను రద్దు చేస్తుండడం యువతకు అన్యాయం చేయడమేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల రద్దు ఆలోచన వల్ల దేశంలో నిరుద్యోగ సమస్య మరింతగా పెరిగే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తంచేశారు.ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఉపాధి లేక యువత అనేక ఇబ్బందులు పడుతుంటే గత కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా కాలయాపన చేసిన పాలకులు ఇపుడు ఉద్యోగాలను రద్దు చేయడం పరోక్షంగా దేశ ఆర్థికాభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మన తెలంగాణ / హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 2018 క్యాలెండర్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మఖ్దూంభవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎపి కార్యదర్శి కె.రామకృష్ణ, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్, నాయకులు బి.నాగభూషణం, రాములు గౌడ్, ఎం.ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అఫ్ఘనిస్థాన్‌లో భూకంపం

- రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.1గా నమోదు
- పాక్, భారత్‌లోనూ భూ ప్రకంపనలు
- పాక్‌లో ఓ బాలిక మృతి, మరి 11 మందికి గాయాలు





లాహోర్‌లో రోడ్డుపైకి వచ్చిన ప్రజలు

ఇస్లామాబాద్ / కాబూల్ : ఉత్తర అఫ్ఘనిస్థాన్‌లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్ర 6.1గా నమోదైంది. అఫ్ఘాన్‌తో పాటు భారత్, పాకిస్థాన్‌లోనూ భూ ప్రకంపనలు వచ్చాయి. భూకంప ధాటికి ఒక బాలిక మృతి చెందగా, మరో 11 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.37 గంటలకు భూకంపం వచ్చిందని, ఉత్తర అఫ్ఘాన్ సరిహద్దుల్లో ఉన్న హిందు కుష్ పర్వతాల్లో 191 కలోమీటర్ల లోతున కేంద్రీకృతమైన ఉన్న భూకంపం కేంద్రం నుంచి ప్రకంపనలు వచ్చినట్లు యుఎస్ భూగర్భ సర్వే పేర్కొంది. ఒక్కసారిగా భూమి కంపించడంతో కాబూల్‌లో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లు, దుకాణాల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే అఫ్ఘాన్‌లో ఎంత ప్రాణ నష్టం జరిగిందో ఇప్పుడే చెప్పలేమని ఆ దేశ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. పాకిస్థాన్ సరిహద్దులోనూ భూమి కంపించింది. దీంతో ఇస్లామాబాద్, పేషావర్, లాహోర్‌లో ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలను ఖాళీ చేయించారు. అయితే ఖ్వైబ్రా పట్టణంలో భూ ప్రకంపనలకు ఇంటి పైకప్పు కూలి ఒక బాలిక మృతి చెందింది. పట్టణంలోని ఇతర ప్రదేశాల్లోనూ కొన్ని ఇళ్ల దెబ్బతినడం, పై కప్పులు కూలిపోయిన ఘటనలు నోటు చేసుకోవడంతో మరో 11 మందికి గాయాలు అయ్యాయని డిప్యూటీ కమిషనర్ షబ్బీర్ మెంగల్ చెప్పారు. బెలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని కొన్ని గ్రామాల్లో కూడా భూమి కంపించిందన్నారు. నష్టాన్ని అంచనా వేసేందుకు సహాయ బృందాలను అధికారులు పంపించారు. అయితే పాక్‌లో పెద్దగా నష్టం జరగలేదని పాక్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికార ప్రతినిధి తెలియజేశారు.అదే విధంగా భారత రాజధాని ఢిల్లీలోనూ స్వల్పంగా ప్రకంపనలు వచ్చాయి.అక్టోబర్ 2015లో అఫ్ఘనిస్థాన్ జార్మ్ సమీపంలో కేంద్రీకృతమై ఉన్న భూకంపం కేంద్రం నుంచి వచ్చిన భూ ప్రకంపనలు భారీ విధ్వంసాన్ని సృష్టించాయి. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.5గా నమోదైంది. భూకంప ధాటికి కొండచరియలు విరిగిపడ్డాయి. భవనాలు కుప్పకూలాయి. 380 మందికి పైగా మృత్యువాతపడ్డారు.

గ్వాంటనామో జైలు ఉత్తర్వుపై ట్రంప్ సంతకం



వాషింగ్టన్: గ్వాంటనామో బేలో ఉన్న వివాదాస్పద అమెరికా జైలును ఇంకా తెరిచి ఉంచే కార్యనిర్వాహక ఉత్తర్వుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో కొత్త ఉగ్రవాద ఖైదీలను క్యూబాలోని ఈ అపఖ్యాతిపాలైన జైలుకు తరలించేందుకు మార్గం సుగమం చేశా రు. దీనికి సంబంధించిన ప్రకటనను ఆయన తన తొలి భయసభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో చేశారు. గ్వాంటనామో బేలో ఉన్న అమెరికా సైనిక స్థావరంపు జైలులో కరుడుగట్టిన ఉగ్రవాదులను, శత్రుపోరాట యోధులను బంధించి ఉం చుతారు. అక్కడ ఉన్న హీన పరిస్థితులపై సర్వ త్రా విమర్శలున్నాయి. అమెరికా ఇదివరలో తెలివితక్కువతనంతో పందలాది ప్రమాదకర ఉగ్రవాదులను విడిచిపెట్టింది. కానీ తర్వాత ఐసిస్ నాయకుడు అల్ బగ్దాదీ సహ వారందరితో యుద్ధరంగంలోనే తలపడాల్సి వచ్చిందని ట్రంప్ తెలిపారు. అందుకే తాను గ్వాంటనామో జైలును ఉపయోగించుకునే ఉత్తర్వుపై సంతకం చేశానని అన్నారు. ఐసిస్, అల్‌ఖాయిదాలు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో పట్టుబడే ఉగ్రవాదులను నిర్బంధించేందుకు అవసరమైన అన్ని అధికారాలు కలిగి ఉంటామని, అందుకు కాంగ్రెస్ సహకరించాలని ఆయన కోరారు.

రెండు నెలల్లో పాల్వంచ విద్యుత్ ప్లాంట్ రెడీ

మన తెలంగాణ/హైదరాబాద్: పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం ఉత్పత్తి ప్రారంభిస్తుందని, మార్చి 31కల్లా ఏడవ దశ ప్లాంటును గ్రిడ్‌కు సింక్రనైజ్ చేస్తామని టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. పాల్వంచలోని కెటిపిఎస్ ఏడవ దశ ప్లాంటులో బాయిలర్‌ను జెన్‌కో సిఎండి ప్రభాకరరావు బుధవారం ఉదయం 8.46 గంటలకు వెలిగించారు. దీంతో ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ట్రయల్‌రన్ విజయవంతంగా ప్రారంభమయింది. బిహెచ్‌ఇఎల్ తయారు చేసిన భారీ జనరేటర్‌తో బాయిలర్‌ను అనుసంధానం చేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో డైరెక్టర్లు రాధాకృష్ణ, సచ్చిదానందం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అజయ్, లక్ష్మయ్య, ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, కన్సల్టెంట్ గోపాలకృష్ణ, బిహెచ్‌ఇఎల్ ఇడి ఉమామహేశ్వరరావు, ఉన్నతాధికారులు మూర్తి, పిఎస్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది చివరి నాటికి 17 వేల మెగావాట్లు : ప్రభాకరరావు

ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రానికి 17 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని, 28 వేల మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని, మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరిస్తామని సిఎండి ప్రభాకరరావు వెల్లడించారు. మార్చి 31 నాటికి 1,080 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన భద్రాద్రి ప్లాంటు నిర్మాణం పూర్తవుతుందని, రెండు యూనిట్లను ఈ ఏడాది డిసెంబరులో, మరో రెండు యూనిట్లను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో సింక్రనైజ్ చేస్తామన్నారు.

ఎన్నికలప్పుడు కూటములు సహజం

ప్రజాభిప్రాయం మావైపే : జానారెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎన్నికలు వచ్చిన సమయంలో సంకీర్ణాలు, కూటములు గురించి చర్చలు జరగడం సహజమని, రాష్ట్రంలో అలాంటి పరిస్థితి వస్తే కాంగ్రెస్ కూడా అలాంటి ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రతిపక్ష నాయకుడు కుందూరు జానారెడ్డి స్పష్టం చేశారు. దేశంలో పాత కేక్లగా సంకీర్ణ రాజకీయాలు సాగుతున్నాయన్నారు. ముందస్తు ఎన్నికలు వస్తే సిద్ధంగా ఉన్నామని, ప్రజాభిప్రాయం తమవైపే ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం తనను కలిసిన జర్నలిస్టులతో జానారెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఎన్నికల్లో 102 స్థానాల్లో గెలుస్తామని టిఆర్ ఎస్ నాయకులు చెప్పుకోవడం కేవలం తమ కార్యకర్తలను బలోపేతం చేసే వ్యూహంతోనే అంటున్నారని అన్నారు.మహాభారతంలో ఎక్కువ అస్త్రాలు, జనం కౌరవుల వద్దే ఉన్నాయని, అయినా పాండవులు విజయం సాధించారని చెప్పారు. శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన జరగదని తన అభిప్రాయమని, ఒకవేళ జరిగినా తమకు అభ్యంతరం లేదన్నారు. రాష్ట్రంలో 45 లక్షల ఎకరాల్లోనే రెండు పంటలు వేస్తున్నారని, ఇందులో 62 శాతం రైతులు 2.5 ఎకరాల లోపే భూమి కలిగి ఉన్నారని, కాబట్టి మెజారిటీ రైతులకు పెట్టుబడి పథకం కింద రూ.3వేల లోపే అందుతుందని చెప్పారు. దాని బదులు గిట్టుబాటు ధర, బోనస్ కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందని, వ్యవసాయ ఉత్పత్తుల ధర క్వింటాలుకు రూ.100 కన్నా పెట్టుబడి సాయం అక్కడికే సరిపోతుందన్నారు.

రేవంత్ రాజీనామాకు సిద్ధం : రేవంత్‌రెడ్డి కంటే ముందు ఎంఎల్‌ఏలు చేసిన రాజీనామాలపై నిర్ణయం తీసుకుంటే రేవంత్ రెడ్డి కూడా రాజీనామాచేసేందుకు సిద్ధంగానే ఉన్నారని జానారెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రేవంత్‌రెడ్డి కంటే ముందుగా ఎంఎల్‌ఏలు చేసిన రాజీనామాలను స్పీకర్ ఇంకా ఆమోదించలేదని, ఆయన రాజీనామా కూడా పెండింగ్‌లో పెడతారని రేవంత్ ఆగుతున్నారని జానారెడ్డి చెప్పారు. ముందు ఇచ్చిన రాజీనామాలను ఆమోదించిన వెంటనే రేవంత్ రాజీనామా చేసేందుకు సిద్ధంగాఉన్నారని యన తెలిపారు.



ఉత్తమ్ కుర్చీలో జానా

గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుని సీటులో జానారెడ్డి కూర్చున్నారు. రాష్ట్ర ఇన్‌ఛార్జ్ కుంతియాతో భేటీ సందర్భంగా పార్టీ కార్యాలయానికి వచ్చిన జానారెడ్డి పిసిసి అధ్యక్షుని ఛాంబర్‌కు వెళ్ళారు. జానాను చూసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేచి తన సీటులో కూర్చోవాల్సిందిగా జానారెడ్డిని కోరారు. తామిద్దరం ఆత్మీయులమని, అందుకే తన స్థానంలో గౌరవంతో కూర్చోవాలన్నారని జానారెడ్డి అన్నారు. ఆయన పక్కనే మరోసీటులో ఉత్తమ్ కూర్చున్నారు. ఇదంతా అక్కడే ఉండి గమనించిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఇలాంటి సహృద్భావ వాతావరణం పార్టీకి మేలు చేకూరుస్తుందని వ్యాఖ్యానించుకోవడం కనిపించింది.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

'నేను.. మీ అంజయ్య' పుస్తకావిష్కరణలో వక్తలు




మన తెలంగాణ / హైదరాబాద్ : రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని, అలాగే రజక ఫెడరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజక అభివృద్ధి సంస్థ జాతీయ అధ్యక్షులు, అఖిల భారత స్థాయి సమాజ్ జాతీయ అధ్యక్షులు డా.ఎం అంజయ్య జీవిత చరిత్ర పై జర్నలిస్టు అంజనీ రవి రచించిన 'నేను.. మీ అంజయ్య-సంఘర్షణ.. సంస్కరణ' పుస్తకాన్ని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, తెలంగాణ బిసి కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన రావు, తెలంగాణ రజకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ సమక్షంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, స్వామీజీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రజకులను ఎస్‌సి జాబితాలో కలపాలన్న డిమాండ్ రజకుల నుండి వస్తోందని, ఈ అంశాన్ని పార్లమెంటు సమావేశంలో చర్చకు వచ్చేలా చూస్తానన్నారు. డాక్టర్ ఎం.అంజయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా..రజకులకు అంటరాని వారిగా చూస్తున్న సమాజం ఎస్‌సిలో జాబితాలో కలిపేందుకు మాత్రం తమకు మద్దతి వ్వడం లేదన్నారు. ఇతర సామాజిక వర్గాలకు భవనాలను నిర్మించి ఇస్తున్నట్లుగానే రాష్ట్ర కేంద్రంతో పాటు ప్రతి మండలానికి ఒక రజక సామాజిక భవనం నిర్మించి ఇవ్వాలన్నారు. ఎంఎల్‌సి డా. కె. లక్ష్మణ్ మాట్లాడుతూ ఒక్కు రజకులే కాదు, తెలంగాణ ప్రభుత్వ హయాంలో బిసి అన్ని కుల వృత్తులు నిరాదరణకు గురవుతున్నాయన్నారు. వకుళా భరణం కృష్ణమోహన రావు మాట్లాడుతూ బిసి కులాల సామాజిక పరిస్థితులపై అధ్యయనం చేస్తున్న ప్రభుత్వం త్వరలో మ రిన్ని నిర్ణయం తీసుకునే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సిఎం, ప్రధానిని నేరుగా ఎన్నుకోవాలి: విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ సాధు సంతులు, ఆధ్యాత్మిక వేత్తలు రాజకీయాలతో పని లేదని విశ్వంజీ మహరాజ్ ఆధ్యాత్మిక వేత్త విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ అన్నా రు.ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుందని విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ అన్నారు.



జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ వేడుకలు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: కేంద్ర మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, మహిళల సాధికారత ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు అనేక పథకాలను ప్రవేశ పెట్టారని తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్పర్సన్ త్రిపురనేని వెంకటరత్నం తెలిపారు. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ సదస్సులో ఆమె ప్రసంగించారు. రాజకీయాల్లో మహిళలను ప్రోత్సాహిస్తున్న సి.ఎం కె.సి.ఆర్ ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' ఘటనలు హైదరాబాద్‌లో జరుగకుండా 'షీ టీమ్స్' ను ఏర్పాటు చేశారని, 'హాక్ ఐ'అప్లికేషన్ ద్వారా మహిళలకు రక్షణ చేపట్టారని వెంకటరత్నం వివరించారు. మహిళా సాధికారత దిశగా కె.సి.ఆర్‌గారి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగిపోతుందన్నారు. తెలంగాణ నుండి జాతీయ సదస్సులో 40 మంది మహిళలు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జెడ్‌పి చైర్మన్ తుల ఉమా మాట్లాడుతూ కేంద్రం జాతీయ స్థాయిలో మహిళల రక్షణకు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. మహిళల రక్షణ కొరకు టీమ్స్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. దేశంలోనే మహిళా రక్షణలో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగంలో నిలిచిందన్నారు. మహిళల రక్షణ, అభివృద్ధి, సాధికారతకు మరిన్ని కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం తీసుకురానుందని తెలిపారు. రాజకీయాల్లో సైతం మహిళలను సిఎం కెసిఆర్ ప్రోత్సహిస్తున్నారని అన్నారు. తెలంగాణ రీజినల్ కోఆర్డినేటర్లు మాల యివ యారెడ్డి, రేవ, మహిళా కార్యకర్త ఉప్పులేటి శైలజ, పలు రాష్ట్రాల మహిళా కమిషన్ చైర్మన్లు, శిశు సంక్షేమ శాఖ రిజినల్ ఆఫీసర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఇతర రాష్ట్రాల్లో మహిళా కార్యక్రమాలు ఎలా జరుగుతున్న తీరుతెన్నులను ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పలు సెషన్స్‌లో మహిళలు ఒకరినొకరు అడిగితెలుసుకున్నారు. ఈ జాతీయ సదస్సులో గృహ హింస నివారణ, ఉద్యోగాలు పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు,విదేశాల్లో భారతీయుల పెళ్లిళ్లు, మహిళలపై ఆసిడ్ దాడులు,అత్యాచారాలు వంటి అంశాలపై కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ ప్రసంగించారు.

ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తం



మన తెలంగాణ/ హైదరాబాద్ : గ్రామీణ నియోజకవర్గాల ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమకు వ్యతిరేకంగా ఉండే వారి ఓట్లను తొలగించేందుకు టిఆర్‌ఎస్ ప్రయత్నించవచ్చని టిపిసిసి ఎన్నికల సంఘం సమన్వయకర్త మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఓటర్ల సవరణ ప్రక్రియను జాగ్రత్తగా గమనించేందుకు కాంగ్రెస్ శ్రేణులను అప్రమత్తం చేస్తున్నామని, అందులో భాగంగా ఫిబ్రవరి 5 నుండి 9వ తేదీ వరకు జిల్లాల్లో మా టీమ్ పర్యటించనున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జనవరి 23 నుండి ఫిబ్రవరి 14 వరకు గ్రామీణ ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతోందన్నారు.

అంబటి రాయుడిపై రెండు మ్యాచ్‌ల నిషేధం



ముంబయి: భారత స్టార్ క్రికెటర్, హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్ అంబటి రాయుడుపై భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. ఇటీవల జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లో రాయుడు క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడడంతో బిసిసిఐ అతనిపై చర్యలకు దిగింది. కర్ణాటకతో జరిగిన మ్యాచ్ సందర్భంగా రాయుడు నిబంధనలు పాటించక పోవడంతో బిసిసిఐ అతనిపై క్రమశిక్షణ చర్యలను తీసుకుంది. ఈ అంశంపై బిసిసిఐ బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ రాయుడుపై రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధిస్తున్నట్టు ప్రకటించింది. బిసిసిఐ క్రమశిక్షణ కమిటీ సభ్యులు రాయుడును విచారించగా తాను అనుచితంగా ప్రవర్తించినట్టు నాయుడు ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధిస్తూ బిసిసిఐ అధికార నిర్ణయాన్ని తీసుకుంది. బిసిసిఐ నిర్ణయంతో అంబటి రాయుడు విజయ్ హాజరే ట్రోఫీలో భాగంగా జరిగే రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. కాగా, జనవరి 11న విశాఖ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అంబటి రాయుడు అంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నానా హంగామా సృష్టించాడు. రాయుడు ప్రవర్తనపై ప్రత్యర్థి జట్టు కెప్టెన్‌తో పాటు ఫీల్డ్ అంపైర్లు, మ్యాచ్ రిఫరీ బిసిసిఐకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి రాయుడుపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

ప్రణయ్‌కు షాక్

- **శ్రీకాంత్, సింధు, సైనా ముందంజ, ఇండియా ఓపెన్**



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ తొలి రోజే పెను సంచలనం నమోదైంది. భారత స్టార్ ఆటగాడు హెచ్.ఎస్.ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగిన మొదటి రౌండ్‌లో భారత్‌కే చెందిన శ్రేయస్ జైస్వాల్ 21–14, 21–6తో ప్రణయ్‌ను చిత్తు చేశాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన జైస్వాల్ ఏదశలోనూ ప్రణయ్‌ను కోలుకునే అవకాశం ఇవ్వలేదు. మరోవైపు అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోరులో శ్రీకాంత్ 21–17, 21–18 తేడాతో హాంకాంగ్ ఆటగాడు చెయుక్ ఇ లీను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్‌కు ప్రత్యర్థి నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. అయితే ఒత్తిడికి తట్టుకొని ముందుకు సాగిన శ్రీకాంత్ రెండో రౌండ్‌లో ప్రవేశించాడు. మరో పోటీలో సాయి ప్రణీత్ చెమటోడ్చి విజయం సాధించాడు. ఇంగ్లాండ్ ఆటగాడు క్యూసెప్‌తో జరిగిన పోరులో ప్రణీత్ 21–11, 17–21, 21–17తో జయభేరి మోగించాడు. సౌరభ్ వర్మ కూడా తొలి రౌండ్‌లో విజయం సాధించాడు. డెన్మార్క్ ఆటగాడు అంటోన్‌సెన్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌరభ్ 22–20, 21–8తో జయకేతనం ఎగుర వేశాడు. మరోవైపు తెలుగుతేజం పారుపల్లి కశ్యప్ కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్‌లో కశ్యప్ 21–14, 21–18తో డెన్మార్క్‌కు చెందిన విట్టింగ్స్‌ను చిత్తు చేశాడు. మరో భారత ఆటగాడు గుల్షన్ కుమార్ కూడా తొలి రౌండ్‌లో జయకేతనం ఎగుర వేశాడు. మహిళల సింగిల్స్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిలు పివి.సింధు, సైనా విజయం సాధించారు. తొలి రౌండ్‌లో సింధు 21–10, 21–13తో రోడె (డెన్మార్క్)ను చిత్తు చేసింది. మరో పోటీలో సైనా 21–15, 21–9తో డెన్మార్క్‌కే చెందిన సోఫిహోల్మ్‌ను ఓడించింది. మరో పోటీలో భారత్‌కే చెందిన యువ సంచలనం ఆకర్షి కశ్యప్ విజయం సాధించింది. సహచర క్రీడాకారిణి అనురాతో జరిగిన పోటీలో ఆకర్షి జయభేరి మోగించింది.





రాజధాని ఢిల్లీలో బుధవారం జరిగిన ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు..నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాలుపంచుకుంటున్నారు.. కేంద్ర క్రీడల మంత్రి రాథోడ్‌తో పాటు తెలుగు తేజాలు గోపీచంద్, సింధు, శ్రీకాంత్ తదితరులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు..

కదం తొక్కిన హక్

- బంగ్లాదేశ్ 374/4, లంకతో తొలి టెస్టు



చిట్టగాంగ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ భారీ స్కోరును సాధించింది. బుధవారం ప్రారంభమైన టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేవ్ 4వికెట్ల నష్టానికి 374 పరుగుల రికార్డు స్కోరును సాధించింది. టాప్ ఆర్డర్ కదం తొక్కడంతో బంగ్లా భారీ స్కోరును నమోదు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాకు ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్, ఇమ్రుల్ కైస్ శుభారంభం అందించారు. ఇద్దరు లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కైస్ సమన్వయంతో బ్యాటింగ్ చేయగా, తమీమ్ తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. లంక బౌలర్లను హడలెత్తించిన తమీమ్ 53 బంతుల్లోనే ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 52 పరుగులు చేశాడు. మరోవైపు కైస్ 40 పరుగులు చేశాడు. మరోవైపు వన్‌డౌన్‌లో వచ్చిన మోమినుల్ హక్ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగిపోయాడు. అతనికి సీనియర్ ఆటగాడు ముష్ఫికుర్ రహీం అండగా నిలిచాడు. కీల ఇన్నింగ్స్ ఆడిన రహీం పది ఫోర్లతో 92 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇదే క్రమంలో 236 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యంలో పాలుపంచుకున్నాడు. మరోవైపు లంక బౌలర్లను హడలెత్తించిన హక్ 203 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్స్‌తో 175 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో బంగ్లా తొలి రోజే మ్యాచ్‌పై పట్టు బిగించింది.

సమరానికి సై

ఆత్మవిశ్వాసంతో భారత్, ఫేవరెట్‌గా దక్షిణాఫ్రికా, నేడు తొలి వన్డే



దర్బన్: భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య వన్డే సమరానికి గురువారం తెరలేవనుంది. ఇప్పటికే రెండు జట్లు మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. మూడో టెస్టులో అద్భుత విజయం సాధించిన టీమిండియా వన్డే సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. మరోవైపు టెస్టు సిరీస్‌ను గెలిచి పైచేయి సాధించిన ఆతిథ్య సౌతాఫ్రికా వన్డేల్లోనూ జయకేతనం ఎగుర వేయాలనే పట్టుదలతో ఉంది. రెండు జట్లలోనూ అగ్రశ్రేణి ఆటగాళ్లు ఉండడంతో ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్ హోరాహోరీగా సాగడం ఖాయం. రెండు జట్ల మధ్య తొలి వన్డేకు దర్బన్ వేదికగా నిలువనుంది. కాగా, టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన ఫాస్ట్ బౌలర్లపైనే భారత్ ఆశలు పెట్టుకుంది. మరోవైపు భారత్‌పై వన్డేల్లో అద్భుత రికార్డును కలిగి ఉన్న సఫారీ జట్టు మరోసారి ఆధిపత్యాన్ని చెలాయించేందుకు తహతహలాడుతుంది. అయితే స్టార్ ఆటగాడు ఎబి.డివిలియర్స్ తొలి మూడు వన్డేలకు దూరం కావడం దక్షిణాఫ్రికాకు పెద్ద ఎదురు దెబ్బగానే విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగల్లో ఇరు జట్లు కూడా సమతూకంగా కనిపిస్తున్నాయి. దీంతో సిరీస్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో చెప్పడం అసాధ్యం. బరిలోకి దిగితేనే ఎవరి సామర్థ్యం ఏంటో తేలుతోంది. కెప్టెన్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, అజింక్య రహానె, ధావన్, యువ ఆటగాళ్లు శ్రేయస్ అయ్యర్, మనీష్ పాండే తదితరులతో భారత్ చాలా బలంగా ఉంది. అంతేగాక, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, షమీ, చాహల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు ఉండనే ఉన్నారు. దీంతో భారత్ కూడా భారీ ఆశలతో వన్డే సిరీస్‌కు సిద్ధమవుతోంది.

ఓపెనర్లే కీలకం

బౌన్స్ సహకరించే దర్బన్ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులువేం కాదు. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఆడిన భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఆటగాడు తన పాత్రను సమర్థంగా పోషించేందుకు ప్రయత్నించాలి. అప్పుడే జట్టుకు ప్రయోజనంగా ఉంటుంది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు ఓపెనర్లు కీలకంగా మారారు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఒకవేళ ధావన్‌ను తప్పిస్తే ఓపెనర్‌గా రహానె బరిలోకి దిగడం ఖాయం. టెస్టు సిరీస్‌లో ఆశించిన విధంగా రాణించని రోహిత్ శర్మకు వన్డే సిరీస్ సవాలుగా తయారైంది. ఇందులో రాణించడం ద్వారా విమర్శకులకు గట్టి జవాబు చెప్పాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇటీవల కాలంలో రోహిత్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో వరుస సెంచరీలతో ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారాడు. ధావన్ కూడా తన పాత్రను సమర్థంగా పోషించక తప్పదు. ఆడిన ఏకైక టెస్టులో ధావన్ విఫలమయ్యాడు. అయితే వన్డేల్లో అతనికి మంచి రికార్డే ఉంది. దీంతో సిరీస్‌లో అతని పాత్ర కూడా జట్టుకు ఎంతో ముఖ్యమని చెప్పాలి.

రికార్డుల ప్రస్థానం

- ఇరు జట్ల మధ్య జరిగిన వన్డేలు 77
- దక్షిణాఫ్రికా గెలిచినవి 45
- భారత్ గెలిచినవి 29
- ఫలితం తేలనివి 3
- అత్యధిక స్కోరు
- దక్షిణాఫ్రికా 438/4
- భారత్ 401/3
- అత్యల్ప స్కోరు
- దక్షిణాఫ్రికా 117
- భారత్ 91

వ్యక్తిగత పరుగులు

- హాషిం ఆమ్లా 778
- డికాక్ 720
- ధోని 727
- కోహ్లి 711

జట్ల వివరాలు:

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), ధావన్, అయ్యర్, ధోని, మనీష్ పాండే, రహానె, కేదార్ జాదవ్, దినేష్ కార్తీక్, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, చాహల్, అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకూర్, షమీ, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్.

దక్షిణాఫ్రికా: డుప్లెసిస్ (కెప్టెన్), హాషిం ఆమ్లా, డికాక్, జీన్ పాల్ డుమినీ, మార్‌క్రామ్, డేవిడ్ మిల్లర్, క్రిస్ మోరిస్, ఎన్‌గిడి, ఫెలూక్‌వాయో, రబడా, మోర్కెల్, ఇమ్రాన్ తాహిర్, తబ్రేస్ షమ్‌సి, జొండో.



డివిలియర్స్ లేకుండానే...

కాగా, వన్డే సిరీస్ ప్రారంభానికి ముందే దక్షిణాఫ్రికాకు గట్టి షాక్ తగిలిందని చెప్పాలి. అగ్రశ్రేణి బ్యాట్స్‌మన్ డివిలియర్స్ గాయం వల్ల తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. అతను లేకపోవడం జట్టుకు పెద్ద లోటుగానే విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే డివిలియర్స్ లేకున్నా సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. డికాక్, హాషిం ఆమ్లా, డుమినీ, మార్‌క్రామ్, క్రిస్ మోరిస్, కెప్టెన్ డుప్లెసిస్‌లతో బ్యాటింగ్ బలంగానే ఉంది. అంతేగాక, రబడా, మోర్కెల్, తాహిర్, ఎన్‌గిడి, ఫెలూక్‌వాయో తదితరులతో బౌలింగ్ కూడా చాలా పటిష్టంగా కనిపిస్తోంది. దీంతో సిరీస్ గెలవడమే లక్ష్యంగా సౌతాఫ్రికా పోరుకు సిద్ధమైంది.



కోహ్లిపైనే భారం...

ఇదిలావుంటే భారత్ ఆశలన్నీ కెప్టెన్ విరాట్ కోహ్లిపైనే ఆధారపడి ఉన్నాయి. టెస్టు సిరీస్‌లో నిలకడగా ఆడిన ఏకైక ఆటగాడు కోహ్లినే. దీంతో వన్డే సిరీస్‌లో కూడా జట్టుకు అతనే కీలకమని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అంతేగాక వన్డేల్లో కోహ్లికి మంచి రికార్డే ఉంది. ఇటీవల కాలంలో కోహ్లి వన్డేల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. వరుస సెంచరీలతో ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడు. ఈసారి కూడా అదే జోరును కొనసాగించేందుకు తహతహలాడుతున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన కోహ్లి చెలరేగితే దక్షిణాఫ్రికాను ఓడించడం భారత్‌కు కష్టమేమి కాదు. ఇక, శ్రేయస్ అయ్యర్, మనీష్ పాండే, కేదార్ జాదవ్, ధోని, హార్దిక్ పాండ్య, రహానె, దినేష్ కార్తీక్ వంటి అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్ భారత్‌కు అందుబాటులో ఉన్నారు. వీరిలో ఎవరికి చోటు కల్పించినా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదల వీరిలో కనిపిస్తోంది. ఇది జట్టుకు ఎంతో కలిసి వచ్చే అంశమని చెప్పాలి.



బౌలింగే బలం...

గతంలో బ్యాట్స్‌మెన్‌పైనే ఆధారపడే టీమిండియాలో ఇప్పుడు బౌలర్లు మ్యాచ్ విన్నర్లుగా మారారు. ప్రపంచ స్థాయి ఫాస్ట్ బౌలర్లతో భారత బౌలింగ్ లైనప్ చాలా పటిష్టంగా ఉంది. ఇప్పటికే తమ సత్తా ఏమిటో టెస్టు సిరీస్‌లో సఫారీ బ్యాట్స్‌మెన్‌కు వీరు రుచి చూపించారు. ముఖ్యంగా బుమ్రా, భువనేశ్వర్, షమీల రూపంలో మ్యాచ్ విన్నర్ బౌలర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. టెస్టు సిరీస్‌లో ఈ త్రయం నిలకడైన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. వన్డేల్లో కూడా జట్టు వీరిపై భారీ ఆశలే పెట్టుకుంది. ఇక, చాహల్, కుల్దీప్, అక్షర్‌ల రూపంలో ప్రపంచ స్థాయి స్పిన్నర్లు కూడా ఉండనే ఉన్నారు. శార్దూర్ ఠాకూర్ కూడా ప్రతిభావంతుడే. హార్దిక్‌కు కూడా తక్కువ అంచనా వేయలేం. దీంతో దక్షిణాఫ్రికాను కట్టడి చేసే బౌలింగ్ వనరులు కోహ్లి వద్ద పుష్కలంగా ఉన్నాయి. వీరు సమష్టిగా రాణిస్తే సఫారీపై సంచలన విజయం సాధించడం భారత్‌కు అసాధ్యమేమి కాదు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.